సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 332
గురువారం 22-2-2024


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'


యశస్వి @ 15
ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 14 స్థానాలు ఎగబాకిన భారత ఓపెనర్
-స్పోర్ట్స్‌లో


ఆఖర్లో అమ్మకాలు
ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్
73 వేల దిగువకు సెన్సెక్స్
-బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కథలు మార్చగలవు

రచయిత్రి, ఫొటోగ్రాఫర్ అయిన కరిష్మా మెహతా హ్యూమన్స్ ఆఫ్ బాంబే వెబ్‌సైట్ వ్యవస్థాపకురాలు, నిర్వాహకురాలు. హృదయాలను కదిలించే ప్రత్యేకమైన కథా విధానం ద్వారా ప్రజాదరణ పొందిన రచయిత్రి. ముంబై వాసి కరిష్మా మెహతా కాలక్షేపంగా కాకుండా సామాజిక బాధ్యతనూ తన కథనాల ద్వారా పంచుకుంటూ నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆమె ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై డిజిటల్ రంగంలో తనను తాను ఆవిష్కరించుకోవడం, లక్షలమందికి చేరువైన తీరుతో సహా తన కథనంతటినీ పంచుకున్నారు.

దాదాపు పదేళ్ల క్రితం ప్రారంభించిన ఫేస్ బుక్ పేజీ 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' కరిష్మా మెహతాకి ఎంతో పేరు తెచ్చిపెట్టింది. ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించినప్పుడు ఆమె వయసు కేవలం 21 ఏళ్లు. ఇప్పుడు విస్తృతమైన ప్లాట్‌ఫారమ్‌గా పరిణామం చెందింది. సామాన్యుల నుంచి ఉన్నతస్థాయి వ్యక్తుల వరకు ముంబై నివాసితుల కథనాలను వెలుగులోకి తెచ్చింది. అందుకోసం ఆమె పడిన కష్టం సామాన్యమైనది కాదు. సంపన్న వర్గంలో పుట్టినా తనకున్న ఆసక్తితో సామాన్యులలో తిరిగి, ఫొటోలతో వారి కథనాలను ప్రజలకు అందిస్తూ వచ్చింది. మొదట్లో ఇద్దరు టెక్నికల్ వ్యక్తులతో కలిసి ప్రారంభించిన ఈ పని మెహతాను నేడు మిలియన్ల మందికి చేరువ చేసింది. దేశంలోని ఇతర ప్రాంతాలలో పలువురు ఆమె వెబ్‌సైట్‌కి ఫ్రీలాన్సర్లుగా ఉండేలా చేసింది. కిందటేడాది 'హౌ ది హెల్ డిడ్ డూ ఇట్' అనే యూట్యూబ్ వెబ్ సిరీస్ ద్వారా వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఇతర నిష్ణాతులైన వ్యక్తుల ఇంటర్వ్యూల ద్వారా తనలో ఉన్న మరో ప్రతిభను పరిచయం చేసింది. రైటర్‌గా, ఫొటోగ్రాఫర్‌గా, ప్రెజెంటర్‌గా రాణిస్తున్న కరిష్మా మాట్లాడుతూ –

చేయూతగా మారడం సంతోషం

''కష్టంలో ఉన్న వ్యక్తులను గుర్తించడం, కలుసుకోవడం, మాట్లాడటం ప్రతిరోజూ జరుగుతుంటుంది. వారి కథను ఐదు వందల పదాల్లో మా పోర్టల్ ద్వారా తెలియజేయడం మాత్రమే కాదు ఏళ్లుగా జరుగుతోంది... అవసరమైన వారికి డబ్బు సేకరించి వారు తమ కష్టమైన పరిస్థితి నుండి బయట పడటానికి సహాయం చేయడం సంతోషంగా ఉంటుంది. ఒకరోజు హాస్పిటల్‌లో ఒక గర్భిణిని చూశాను. ఆమెకు అప్పటికే ఐదుగురు కూతుళ్లు ఉన్నారు. మగపిల్లవాడు కావాలనే ఆశతో పిల్లలను కంటూనే ఉంది. మద్యానికి బానిసైన భర్త ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఫలితంగా ఆమె ఆసుపత్రి పాలు, భర్త జైలు పాలూ అయ్యారు. ఆమె కథనాన్ని జనం ముందుకు తీసుకువచ్చాను. ఆమెకు, ఆమె ఐదుగురు కూతుళ్లకు సమాజం నుంచి ఆర్థిక భద్రత లభించింది. ఆసరాగా అందిన రూ. 25 లక్షల రూపాయలు వారి జీవనం సాఫీగా గడపడానికి ఉపయోగపడ్డాయి. మరొక కథ జమ్మూ కాశ్మీర్‌కు చెందిన అలీ భాయ్‌ది. చేయని నేరానికి ఏళ్లుగా జైలు జీవితం గడుపుతుండేవాడు. అతని కథ బయటకు రావడంతో ఆ జీవితం నుంచి విముక్తి లభించింది. అలాగే, యాసిడ్ బాధితులకు, సెక్స్‌వర్కర్ల పిల్లలకు, ఎముక గుజ్జు మార్పిడి అవసరమయ్యే పిల్లల కోసం క్రౌడ్ ఫండింగ్ చేసి ఐదుకోట్ల నిధులను సేకరించి, అందించాం. వెబ్‌సైట్‌కు నిధులు సమకూర్చడానికి చేసిన మొదటి ప్రయత్నంలో 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పుస్తకం పబ్లిష్ అయ్యింది. అంటే, మా కథలు ప్రజలలో పెద్ద మార్పును తీసుకువచ్చాయి. ఎన్నోచోట్ల నుంచి మాకు కథనాలు అందుతుంటాయి. వాటి ద్వారా ఎంతో మందికి స్ఫూర్తిని, సేవను అందించగలుగుతున్నాం''అని వివరిస్తారు ఆమె.

ప్రతి వ్యక్తీ ప్రత్యేకమే!

'ఏ కలా సాధించలేనంత పెద్దది కాదు' అని చెప్పే కరిష్మా జీవితంలో చేయాల్సినవి ఎన్నో ఉన్నాయని భావించే వ్యక్తి. యూనివర్శిటీ ఆఫ్ నాటింగ్‌హామ్ నుండి బిజినెస్ అండ్ ఎకనామిక్స్‌లో డిగ్రీ పట్టా పొందిన కరిష్మా ఎప్పుడూ వ్యాపార వ్యూహాలను రూపొందిస్తూ ఉండేది. కెనడాలో డిగ్రీ పూర్తయిన ఆరు నెలల తర్వాత హ్యూమన్స్ ఆఫ్ న్యూయార్క్ నుంచి స్ఫూర్తి పొంది ముంబైలోని వ్యక్తుల కథలు, వారి జీవితాలను పరిచయం చేయడానికి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను ఏర్పాటు చేసింది. ఎటువంటి గుర్తింపు లేని వ్యక్తుల గురించి కథలు చెప్పాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ వెబ్‌సైట్ ద్వారా ఆరువేలకు పైగా కథనాలను అందించింది. ప్రతి వ్యక్తీ ప్రత్యేకమైన వారని, స్ఫూర్తిదాయకంగా ఉంటారని చూపించింది. నాలుగు లక్షలకు పైగా ఉండే సమూహాన్ని విజయవంతంగా నడిపిస్తోంది. ఫేస్‌బుక్‌లో మిలియన్‌కు పైగా ఫాలోవర్స్ ఉంటే ఇన్‌స్టాగ్రామ్‌లో రెండింతలకు పైగా ఉన్నారు. ఫ్రీలాన్స్ రైటర్‌గా టెడెక్స్ ప్రెజెంటర్‌గానూ రాణిస్తున్న కరిష్మాకు సామాన్యుల కథనాలను పరిచయం చేయడం పట్ల ఆమెకున్న అభిరుచి, వ్యవస్థాపక స్ఫూర్తి అత్యంత ప్రభావంతమైన వేదికగా రూపొందించడానికి ఉపయోగించుకుంది.

ఆమె ఈ ప్రయాణం అంత సాఫీగా ఏమీ జరగలేదు. ఎన్నో ఒడిదొడుకులనూ ఎదుర్కొంది. కాపీ క్యాట్ అనే పేరును సొంతం చేసుకుంది. వివాదాలను, సవాళ్లను స్వీకరించింది. అయినా, తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ సమాజంలో తన ఉనికిని, బాధ్యతనూ సమానంగా నిలబెట్టుకుంటున్నానని తన మాటలు, చేతల ద్వారా నిరూపిస్తున్న కరిష్మా అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

– నిర్మలారెడ్డి

నివాళి



పాటల పూలమాలి వెళ్లిపోయాడు

'బెహనో.. ఔర్ భాయియో'... ఈ గొంతుతో ప్రేమలో పడని రేడియో శ్రోత ఉండేవాడు కాదు. 'బినాకా గీత్‌మాల' టాప్ 13లో ఏ పాట నిలుస్తుందో చూద్దామని వారమంతా ఎదురుచూపులు. నవ్వుతూ నవ్విస్తూ గుంజిపారేసే ఆకర్షణీయమైన గొంతుతో దశాబ్దాల పాటు పాటలను పంచిన రేడియో ప్రెజెంటర్ అమిన్ సయానీ తన 91వ ఏట బుధవారం వీడ్కోలు తీసుకున్నాడు. ఇకపై భారతీయ సాంస్కృతిక ఆనవాలై అతను వెలగనున్నాడు.

పాటలు విరబూస్తాయి. అదిగో అల్లంత దూరాన ఒక చామంతి పూస్తుంది. ముళ్లను వెనక్కు నెడుతూ ఒక రోజా మెడ నిక్కి చూస్తుంది. గుబురు చాటున మల్లెమొగ్గ ఒకటి సిగ్గుతో మొహం దాచుకుంటుంది. గరిక పచ్చతావులో గడ్డిపూవు వర్ణనకు అందని రంగుతో కాంతి లీనుతుంది. వాటి మానాన అవి ఉన్నప్పుడు మన చూపు పడకపోవచ్చు. పడినా వాటి సౌందర్యమేమిటో తెలియకపోవచ్చు.

అప్పుడొక పూలమాలి వస్తాడు. ఒక పువ్వు సువాసన ఎంత ప్రత్యేకమైనదో చెబుతాడు. మరో పూలరెక్క వయ్యారాన్ని చూపి విస్మయపడతాడు. ఒక పువ్వును నాసిక దగ్గర చేర్చడమే భాగ్యమంటాడు. ఒక పువ్వునలా కొమ్మకు వదిలిపెట్టమని మారాము చేస్తాడు. అప్పుడా పూల మీద మనకు ప్రేమ కలుగుతుంది. మనమూ వాటికి మాలిగా మారాలనుకుంటాము. గుండెకు దగ్గరగా చేర్చుకుంటాము. హృదయంతో వాటి పోషణకు పూనుకుంటాము.

అమిన్ సయానీ చేసింది అదే.

రేడియో సిలోన్‌లో హిందీ సినిమా పాటలను శ్రోతలకు చేర్చడం. వాటిపై ప్రేమను పంచడం. వాటిని పాడుకుంటూ, కూనిరాగాలు తీస్తూ, ఆ మనోహర మాయలో చిక్కుకుంటూ జనం తమ బతుకు బాదరబందీని కాసేపు మరచిపోయేలా చేయడం. 1952 డిసెంబర్‌లో మొదటి షోగా మొదలైన 'బినాకా గీత్‌మాల' బినాకా టూత్‌పేస్ట్ వారి స్పాన్సర్డ్ ప్రోగ్రామ్. ప్రతి బుధవారం సాయంత్రం రేడియో సిలోన్‌లో ప్రసారమయ్యేది. టాప్ 13తో మొదలయ్యి టాప్ 1 వరకూ కౌంట్‌డౌన్‌గా పాటలు ప్రసారమయ్యే ఆ షో చివరలో తర్వాతి వారం కోసం 'లిస్ట్' అయిన పాటలను చెప్పి వాటిని శ్రోతలు ఏ వరుసలో మెచ్చుతారో రాసి పంపమనేవారు. టాప్ వన్‌గా నిలిచే పాటను ఎక్కువమంది దేనిని ఎంపిక చేస్తారో దానికి ఆ ర్యాంక్ ఇచ్చేవారు. టాప్ 1ను సూచించిన వారి పేర్ల నుంచి జాక్‌పాట్ తీసి ఒక శ్రోతకు 100 రూపాయల బహుమతి ఇచ్చేవారు. అమిన్ సయాని మొదటి షో చేసేసరికి ఎంత హిట్ అయ్యిందంటే మరుసటి వారానికి 9 వేల ఉత్తరాలు స్పందనగా అందాయి. సంవత్సరం గడిచే సరికి వారం వారం వచ్చే ఉత్తరాల సంఖ్య 65 వేలకు చేరుకుంది. పోస్టాఫీసు వాళ్లు, రేడియో స్టేషన్ వారూ పిచ్చెత్తి పోయేవారు. తర్వాత ఈ రెస్పాన్స్ తంతును ఆపేసి సయానీ ఎంపిక మీద, రికార్డుల అమ్మకాలను బట్టి టాప్ 1ను డిసైడ్ చేసేవారు.



ఏ జిందగీ ఉసీకి హై...

అమిన్ సయానీ చేసిన బినాకా గీత్‌మాలాలో ఏ వారం ఏ సింగర్ పాడిన పాట టాప్ సాంగ్‌గా నిలుస్తుందో తెలుసుకోవడం శ్రోతలకే కాదు సినీ రంగ దిగ్గజాలకు కూడా పెద్ద ఆసక్తిగా ఉండేది. బినాకా చార్ట్‌లో చోటు చేసుకోవడం గౌరవంగా భావించేవారు. ఇక కొన్ని పాటలైతే వారాల తరబడి టాప్ 1గా నిలిచి ఆ గాయకులకు, సంగీత దర్శకులకు క్రేజ్‌ను సంపాదించి పెట్టేవి. సంవత్సరం చివరలో అమిన్ సయానీ 'సాంగ్ ఆఫ్ ద ఇయర్' అంటూ ఒక పాటను ప్రకటించేవాడు. ఆ రోజుల్లో 'ఏ జిందగీ ఉసీకి హై' (అనార్కలీ– 1953), 'జాయెతో జాయె కహా' (టాక్సీ డ్రైవర్ – 1954), 'మేరా జూతా హై జపానీ' (ఆవారా – 1955), 'ఏ దిల్ ముష్కిల్ జీనా యహా' (సి.ఐ.డి – 1956)... ఇలా పాటలు శ్రోతల మెచ్చుకోలుతో వెలిగేవి. బినాకా గీత్‌మాలాలో ఎక్కువసార్లు టాప్ పొజిషన్‌లో నిల్చున్న గాయని లతా. ఆ తర్వాత రఫీ.

ఆ మృదుత్వం.. ఆ దగ్గరితనం

అమిన్ సయానీ గొంతు, వాడే సులభమైన భాష, ఉచ్చారణ, మధ్య మధ్య జోకులు, కొన్ని ఆసక్తికరమైన కథనాలు ఇవన్నీ కలిసి షోను విపరీతంగా హిట్ చేశాయి. అమిన్ రేడియో అనౌన్సర్లకు మార్గదర్శి అయ్యాడు. 'గోల్డెన్ వాయిస్ ఆఫ్ ఆల్ ఇండియా రేడియో' అనిపించుకున్నాడు. జీవితాంతం ఫ్రీలాన్సర్‌గానే అమిన్ రేడియో సిలోన్‌లో, వివిధ్ భారతిలో షోస్ చేశాడు. అలాగే ఎన్నో అడ్వర్‌టైజ్‌మెంట్లలో ఆయన గొంతు వినిపించేది. సినిమా వాళ్ల అవార్డు ఫంక్షన్లలో, మ్యూజిక్ ప్రోగ్రాముల్లో అమినే యాంకర్. అంటే ఇవాళ దేశంలో ఉన్న పాపులర్ అనౌన్సర్లకు, యాంకర్లకు సయానీ సిలబస్ సెట్ చేసి వదిలాడు. 'సినిమా పాటలే మన దేశంలో సగటు ప్రజలందరినీ కలిపి ఉంచాయి' అంటాడు అమిన్ సయానీ.

బొంబాయిలో పుట్టి పెరిగి ముంబైలోనే తుదిశ్వాస వదిలిన అమిన్ సయాని ఆల్ ఇండియా రేడియో ఉజ్వల రోజులను, గోల్డెన్ ఎరా ఆఫ్ హిందీ మ్యూజిక్‌ను ప్రస్తావించినప్పుడల్లా తన ప్రియమైన గొంతుతో పునరుత్థానం చెందుతూనే ఉంటాడు.

ఇకపై కూడా అందమైన పూలు ఎన్నో పూయవచ్చు. కాని వాటిని ఊరికూరికే చూస్తూ పదేపదే సంబరపడిపోయే ఒక మాలి మరి ఉండడు.

అదంతా గతం. సుందరమైన గతం. ఎంతో శ్రావ్యంగా పదిలపరుచుకునే గతం. అది సినీ సంగీతాన్ని ఇష్టపడే వారి సొంతమైన జ్ఞాపకం.

గెలుపు దారి

ఊరు మెచ్చిన ఊరగాయ

పేరు తెచ్చింది డబ్బులు తెస్తోంది!

మధ్యప్రదేశ్‌కు చెందిన సరోజ్ ప్రజాపతికి వీరాభిమానులు ఉన్నారు. అలా అని ఆమె సెలబ్రిటీ కాదు. 'ఆమె పచ్చడి చేస్తే పండగే' అన్నట్లుగా ఉండేది. తనలోని టాలెంట్‌ను 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌'లోకి కన్వర్ట్ చేసి, 19 సంవత్సరాల కుమారుడితో కలిసి 'మామ్ మ్యాజిక్ పికెల్ ఇండియా'ను స్టార్ట్ చేసింది. నెలకు రెండు లక్షల రూపాయల వరకు సంపాదిస్తోంది. 30 మంది మహిళలకు ఉపాధిని ఇస్తోంది.



సరోజ్ ప్రజాపతి

మధ్యప్రదేశ్‌లోని షాదోర అనే గ్రామంలో తన ఇంటిలో కాలక్షేపం కోసం టీవీ చానల్స్ మారుస్తోంది సరోజ్. ఈ క్రమంలో ఆమె దృష్టి ఒక బిజినెస్ ప్రోగ్రాంపై పడింది. పచ్చళ్ల వ్యాపారంలో విజయం సాధించిన బిహార్ లోని ఇద్దరు మహిళలకు సంబంధించిన ప్రోగ్రాం అది. ఈ ప్రోగ్రాం ఆసక్తిగా చూస్తున్నప్పుడు 'నేను మాత్రం వ్యాపారం ఎందుకు చేయకూడదు!' అనుకుంది తనలో తాను.

ఇద్దరు పిల్లలకు తల్లి అయిన సరోజ్‌కు 'శభాష్' అని అందరూ అభినందించే పని ఏదైనా చేయాలనే కోరిక ఎప్పటి నుంచో ఉండేది. కాని దారి ఏమిటో తెలిసేది కాదు. 'దారి ఏమిటో తెలియాలి అంటే ముందు నీలో ఉన్న శక్తి ఏమిటో నీకు తెలియాలి' అంటారు పెద్దలు. టీవీ ప్రోగ్రాం తనలోని శక్తి, నైపుణ్యాన్ని గుర్తు తెచ్చింది.



తన సిబ్బందితో సరోజ్ (ఎడమ నుంచి మూడో వ్యక్తి)

నా కుటుంబం నా బలం

కుటుంబ సహాయసహకారాలు తోడైతే అవలీలగా విజయం సాధించవచ్చు అని చెప్పడానికి నేనే ఉదాహరణ. ఊరగాయల వ్యాపారం స్టార్ట్ చేస్తే బాగుంటుంది అన్నప్పుడు మా ఆయన, అబ్బాయి ప్రోత్సాహకంగా మాట్లాడారు. 'నువ్వు రుచి మీద దృష్టి పెట్టు చాలు. మిగిలినవి మేము చూసుకుంటాం' అని ధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపించారు. ఒక టీవీ ప్రోగ్రాంలో విజేతల మాటలు విని ఆ స్ఫూర్తితో నేను కూడా వ్యాపారంలోకి దిగాను. దీనికి కారణం అప్పటికప్పుడు వచ్చిన ఉత్సాహం కాదు. నాకంటూ ఒక పేరు తెచ్చుకోవాలి అనే పట్టుదల. నా వల్ల ఇతర మహిళలు కూడా ఉపాధి పొందడం సంతోషంగా ఉంది.

– సరోజ్ ప్రజాపతి

కుమారుడు అమిత్ ప్రజాపతితో తనకు వచ్చిన ఆలోచనను చెప్పింది సరోజ్.

పందొమ్మిది సంవత్సరాల అమిత్ 'బ్రాండ్ బిల్డింగ్' అనే డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీ నడుపుతున్నాడు. 'మనకెందుకమ్మా వ్యాపారం. పెద్ద రిస్క్' అనే మాట అమిత్ నోట వినిపించి ఉంటే కథ కంచికి వెళ్లి ఉండేది.

గత సంవత్సరం 'మామ్స్ మ్యాజిక్ పికిల్ ఇండియా' పేరుతో ఊరగాయల వ్యాపారం మొదలుపెట్టింది సరోజ్. 'మామ్స్ మ్యాజిక్ పికిల్ ఇండియా బ్రాండ్' గురించి సోషల్ మీడియాలో ప్రచారం మొదలుపెట్టాడు అమిత్.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ డిమాండ్‌ల నేపథ్యంలో తమ ఇల్లు చాలదని దగ్గరలోని పెద్ద స్థలంలో ఊరగాయలు తయారు చేయడం ప్రారంభించారు.

'అమ్మ దగ్గర సంప్రదాయ వంటకాలతో పాటు ఊరగాయలు తయారు చేయడం నేర్చుకున్నాను. అది నన్ను వ్యాపారవేత్తను చేస్తుందని ఊహించలేదు. ఫస్ట్ ఆర్డర్ వచ్చినప్పుడు ఎంతో సంతోషంగా అనిపించింది మామిడి కాయలు, కూరగాయలను స్థానికంగా కొనుగోలు చేస్తాను. ఊరగాయల తయారీలో రసాయనాలను ఉపయోగించం.' అంటుంది సరోజ్. 'మామిడి సీజన్‌లో మా ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులు వెళుతున్నప్పుడు ఊరగాయ జాడీని తీసుకువెళతారు. ఊరగాయ రుచి చూసిన ప్రతి ఒక్కరూ అద్భుతం అంటారు.

ఇది గుర్తు తెచ్చుకొని మామ్ పికెల్స్ అనేది పర్‌ఫెక్ట్ బిజినెస్ ఛాన్స్ అనుకున్నాను. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లలో మా బిజినెస్‌కు సంబంధించిన పేజీలను క్రియేట్ చేశాను. మంచి స్పందన వచ్చింది. జాడీలను కొని లేబుల్స్ ప్రింట్ చేయించాను. మధ్యప్రదేశ్ నుంచే కాదు దేశం నలుమూలల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది' అంటాడు అమిత్.

పదిహేను సంవత్సరాల వయసులో తొలిసారిగా పచ్చి మామిడి కాయ పచ్చడి తయారు చేసి ఇంటిల్లిపాది 'అద్భుతం' అనేలా చేసింది సరోజ్.

ఆనాటి 'అద్భుతం' ఇప్పటికీ అద్భుతాలు చేయిస్తూనే ఉంది. కేవలం మామిడికాయ ఊరగాయలతో మొదలైన వ్యాపారం అనతికాలంలోనే పచ్చిమిర్చి, నిమ్మకాయ, మిక్స్‌డ్ వెజిటబుల్... మొదలైన వాటిలోకి విస్తరించింది. అమ్మ చేతి నైపుణ్యానికి కుమారుడి డిజిటల్ మార్కెటింగ్ స్కిల్స్ తోడు కావడంతో త్వరలోనే వ్యాపారం మంచి ఊపందుకుంది.

బ్యూటిప్స్



- రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసి సున్నితంగా మర్దన చేస్తే పెదవులు పగలకుండా గులాబీ రేకుల్లా మెరుస్తాయి.
- ముఖాన్ని రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టవల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివి రావు.
- లేతకొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడుతుంది.
- రకరకాల షాంపూల బదులు కుంకుడు కాయ రసం లేదా సీకాయ పొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిగలాడుతుంది.
- తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలు రావు.

వేగాన్ లెదర్ అంటే?

ఇలా చెప్పకుందాం!



పోక చెట్టు బెరడుతో...

ఒక చదరపు మీటరు లెదర్ తయారయ్యే ప్రక్రియలో విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్ ఎంతో ఊహించగలరా? అక్షరాలా 17 కిలోలు. లెదర్ బ్యాగ్‌లు, షూస్, బెల్టులు, పర్సులు, వాచ్‌ల మీద మనకున్న మక్కువ తక్కువేమీ కాదు. కానీ పర్యావరణానికి ఇంత చేటు చేస్తుందని తెలిసిన తర్వాత వాటి వాడకాన్ని ప్రోత్సహించలేం, మమకారాన్ని చంపుకోలేం. అన్నింటికీ పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నాం కదా! దీనికి కూడా ఓ మార్గం కనిపించకపోతుందా! సరిగ్గా ఇలాగే ఆలోచించిన మైథిలి పోక చెట్టు బెరడుతో ఓ ప్రత్యామ్నాయాన్ని మన ముందుకు తెచ్చారు. అదే వేగాన్ లెదర్. వేగాన్ లెదర్‌ని ఎకో ఫ్రెండ్లీ సస్టైయినబుల్ ఆల్టర్నేటివ్‌గా పరిచయం చేస్తున్నారు మైథిలి.

తిరిగి ఇచ్చేద్దాం!

మైథిలిది కర్నాటకలోని శృంగేరి. ఆమె భర్త సురేశ్‌తో కలిసి 'భూమి ఆగ్రో వెంచర్స్' పేరుతో వేగాన్ లెదర్ తయారీ పరిశ్రమను స్థాపించారు. ఈ ప్రయత్నం కేవలం పర్యావరణహితం కోసం, మనుషులను పర్యావరణహిత జీవనశైలి దిశగా నడిపించడమేనన్నారామె. కంప్యూటర్స్‌తో మొదలు పెట్టిన కెరీర్ వేగాన్ లెదర్ పరిశ్రమ వైపు మలుపు తీసుకోవడాన్ని వివరించారామె. మాది వ్యవసాయ కుటుంబం. కర్నాటకలో లక్షలాది ఎకరాల్లో పోక చెట్లను పెంచుతారు. మేము చదువు పూర్తయిన తర్వాత శివమొగ్గలో కంప్యూటర్ సేల్స్, సర్వీసెస్ వ్యాపారం మొదలుపెట్టాం. పాతికేళ్లపాటు విజయవంతంగా నిర్వహించాం. ఇక మా వంతుగా సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన సమయం వచ్చిందనే అభిప్రాయానికి వచ్చాం. అలాంటి సమయంలో ఓ సారి మా సొంతూరికి వచ్చినప్పుడు పోకచెట్టు బెరళ్లను చూసినప్పుడు ఈ ఆలోచన వచ్చింది.



సురేష్, మైథిలి

కప్పులే కాదు చెప్పులు కూడా!

పర్యావరణ ప్రేమికులు కొందరు పోకచెట్టు బెరడుతో ఫంక్షన్‌లలో భోజనం వడ్డించే ప్లేట్‌లు, పాయసం వడ్డించే కప్పుల వంటి వాటిని చేస్తున్నారు. పేపర్ ప్లేట్‌కు బదులు అరెక్కా (పోకచెట్టు) ప్లేట్ వాడడం వల్ల పేపర్ తయారీ సమయంలో జరిగే నీటికాలుష్యాన్ని నివారించిన వారమవుతాం. అయితే పోకచెట్టును ఇంకా విస్తృతంగా వినియోగంలోకి తీసుకు రాగలిగితే పర్యావరణానికి హానికారకంగా మారుతున్న అనేక పరిశ్రమలకు ఇది చక్కటి ప్రత్యామ్నాయం అవుతుందని ఆలోచించాం. అప్పుడు మాకు మొదటగా తోళ్ల పరిశ్రమ గుర్తువచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన త్జీరడ్ వీన్‌హోవెన్ కూడా తోళ్లకు ప్రత్యామ్నాయం కోసం మొక్కలపై ప్రయోగాలు చేస్తున్నట్లు తెలిసింది. మా పోకచెట్టు బెరడు ఆలోచన వీన్‌హోవెన్‌కు కూడా నచ్చింది. ప్రయోగాలు చేయగా చేయగా మా ప్రయత్నం విజయవంతం అయింది. ఇది జంతువులకు ప్రాణహానిని నివారించే లెదర్ కాబట్టి వేగాన్ లెదర్, పామ్ లెదర్ అంటున్నాం. రసాయన రహిత, భూమిలో కలిసిపోయే మెటీరియల్ ఇది. తేలికగా ఉంటుంది కూడా. ఇప్పుడు పెద్ద ఎత్తున వేగాన్ లెదర్‌ను ఎగుమతి చేస్తున్నాం. వీటితో పెన్‌హోల్డర్‌లు, చెప్పులు, పుస్తకాల అట్టలు, వ్యానిటీ బ్యాగ్ తదితరాలు తయారవుతున్నాయి. స్వయం సహాయక బృందాల మహిళలు ఇందులో చక్కటి సేవందిస్తున్నారు. గత ఏడాది మే–జూన్ నెలల్లో జీ 20 సదస్సుల సందర్భంగా స్టాల్ నిర్వహించాం. యానిమల్ లెదర్ తయారీలో కార్బన్ డయాక్సైడ్‌తోపాటు నీటి కాలుష్యం కూడా ఎక్కువే. యానిమల్ లెదర్ కోసం పాతిక వేల లీటర్ల నీరు అవసరమయ్యే చోట పామ్ లెదర్ తయారీకి నీటి వాడకం ఆరు వందల లీటర్లకు మించదు. పైగా పామ్ లెదర్ తయారీలో వాడిన నీటిని తిరిగి పంటలకు వినియోగించుకోవచ్చు కూడా. మేము సమాజానికి తిరిగి ఇవ్వాలనే ప్రయత్నంతో చేసిన ఆలోచన నుంచి పర్యావరణానికి మా వంతుగా సేవలందించే అవకాశం వచ్చింది. సంతోషాన్ని వర్ణించడానికి మాటలు చాలవు'' అన్నారు మైథిలి.



పుస్తకాల అట్టలు



ఎకో ఫ్రెండ్లీ పెన్ స్టాండ్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 332

గురువారం 22-2-2024



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



ఆసీస్‌ను గెలిపించిన డేవిడ్

ఆఖరి బంతికి ఫోర్ కొట్టిన ఆసీస్ బ్యాటర్.. తొలి టి20లో కివీస్ ఓటమి - 12లో



విదేశీ రోడ్లపై మన స్కూటర్లు

10 నెలల్లో 4,21,096 యూనిట్ల స్కూటర్లు ఎగుమతి - 13లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దద్దరిల్లిన సరిహద్దులు

కేంద్రంతో చర్చలు విఫలమవ్వడంతో రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. ఖనౌరీ సరిహద్దు వద్ద ఘర్షణలో ఓ రైతు మరణించాడు.

వివరాలు 6లో ▸



నారీమన్ కన్నుమూత

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలీ శామ్ నారీమన్(95) తుదిశ్వాస విడిచారు. ప్రధాని మోదీ సహా పలువురు సంతాపం తెలిపారు.

వివరాలు 6లో ▸



యూపీలో కాంగ్రెస్‌కు 17 సీట్లు

కాంగ్రెస్, సమాజ్‌వాదీల మధ్య ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో పొత్తు ఖరారైంది. యూపీలో కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేయనుంది.

వివరాలు 6లో ▸



గగన్‌యాన్ మిషన్‌లో మరో ఘనత

గగన్‌యాన్‌లో భాగంగా ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్‌కు కీలకమైన సీఈ20 క్రయోజనిక్ ఇంజన్‌ను ఇస్రో పరీక్షించింది.

వివరాలు 6లో ▸

బాబుకు రెస్ట్!

35 ఏళ్లుగా పోటీ చేస్తున్నారు.. విశ్రాంతి అవసరమన్న భార్య

ఈ సారి కుప్పంలో పోటీ చేయాలనుకుంటున్నానన్న భువనేశ్వరి

ఈ మాటల వెనక కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం చంద్రబాబుదే

'సిద్ధం' సభలకు వెల్లువలా వస్తున్న జనాన్ని చూసి వెన్నులో వణుకు

అధికారం అటుంచి... కుప్పంలో ఓడిపోతే పార్టీయే ఉండదని బెంబేలు

దీంతో కుదిరితే వేరొకచోట నుంచి.. లేకుంటే నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా!

ప్రతిస్పందన చూసేందుకు భార్య ద్వారా అలా మాట్లాడించిన బాబు

కుప్పంలో పడిపోయిన 'నారా' వారి గ్రాఫ్.. సొంత నియోజకవర్గానికి నీళ్లు కూడా ఇవ్వలేదని ఆగ్రహిస్తున్న జనం



(సాక్షి, అమరావతి–తిరుపతి–శాంతిపురం)

'జీవితంలో ప్రతి ఒక్కరికీ ఒక రోజు వస్తుంది. అప్పటిదాకా ఓపిక పట్టాలంతే!' అంటారు పెద్దలు. బహుశా! కుప్పం ప్రజలకు కూడా 35 ఏళ్ల తరవాత ఆ రోజు వచ్చినట్లుంది. దశాబ్దాలుగా తాము గెలిపిస్తున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఆ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని..

మిగతా 2వ పేజీలో ▶

రాజకీయాల్లో రిటైర్‌మెంట్ అవసరమే



చాలా మంది వయసు పైబడి అలసిపోయారు..

వారి అనుభవంతో కొత్త తరానికి అండగా ఉండాలి

డబ్బు ఖర్చు చేయకుండా రాజకీయం చేస్తానంటే కుదరదు

ఓట్లు కొంటారో.. ఏం చేస్తారో మీ ఇష్టం

భీమవరంలో పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ

2లో

ముమ్మాటికీ ఆర్థిక నేరస్తుడే

'మార్గదర్శి' పేరిట రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం

ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

నల్ల గురివింద
రామోజీ-1

- అవి అక్రమ డిపాజిట్లేనని సుప్రీంకోర్టులో ఆర్‌బీఐ వెల్లడి
- 2006 నాటికే రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు
- కేసులు విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్లు
- ఆ ముసుగులో భారీగా నల్లధనం దందా
- రామోజీ అక్రమాలకు చెక్ పెట్టిన నాటి వైఎస్సార్ ప్రభుత్వం
- అక్రమ డిపాజిట్లు తిరిగి చెల్లించేశామంటూ రాజగురువు బుకాయింపు
- ఎవరి నుంచి సేకరించారు.. ఎవరికి చెల్లించారో మాత్రం చెప్పరట
- నగదు రూపంలో డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమన్న ఐటీ శాఖ
- ఆర్బీఐ స్టేట్‌మెంట్ నేపథ్యంలో రామోజీకి శిక్షపై సర్వత్రా చర్చ

10లో

ఈనాడు పత్రికాధిపతి చెరుకూరి రామోజీరావు ఆర్థిక నేరస్తుడే అన్నది నిగ్గు తేలింది. టీడీపీ అధినేత చంద్రబాబు రాజగురువు రామోజీ ఆర్థిక ఉగ్రవాదేనన్నది స్పష్టమైంది. 'మార్గదర్శి' ముసుగులో భారీగా నల్లధనం దందా నిర్వహిస్తున్నారన్నదీ రూఢీ అయ్యింది. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు తొడుక్కున్న 'పత్రికా స్వేచ్ఛ' అనే ముసుగు తొలగిపోయింది. చట్టాలను ఉల్లంఘిస్తూ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ రామోజీ నిజ రూపంలో అవినీతి దిగంబరుడుగా నిలబడ్డారు.



ఫ్యాక్ట్‌చెక్

కోర్టులను మోసం చేసే రామోజీకి పోర్టుల గురించి

ఏం తెలుసు?

- వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్
- మరో రెండు నెలల్లో అందుబాటులోకి నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ
- రెండో దశలో మొదలైన మరో ఆరు ఫిషింగ్ హార్బర్ల పనులు
- అయినా ప్రభుత్వంపై విషం జిమ్ముతున్న రామోజీ
- 14 ఏళ్ళ సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్క పోర్టు కట్టకపోయినా ప్రశ్నించని వైనం

3లో

నిబంధనల ప్రకారమే డీఎస్సీ

- ఎటువంటి గందరగోళంలేదు.. అన్నీ స్పష్టంగా ఉన్నాయి
- 2018 డీఎస్సీ నిబంధనల ప్రకారమే ఇప్పుడూ నిర్వహణ
- విషయం తెలియకుండా 'ఈనాడు' తప్పుడు కథనం
- ఈడబ్ల్యూఎస్ ఆప్షన్ మొదటి నుంచే ఉంది
- డీఎస్సీ వెబ్‌సైట్‌కు సర్వర్ సమస్య ఎప్పుడూ లేదు
- అప్లికేషన్ ఎడిట్‌కు అవకాశం
- 'జర్నల్ నంబర్' రాకుంటే ఫీజు వారి ఖాతాలో తిరిగి జమ

11లో



విశాఖ శారదాపీఠంలో సంప్రదాయ దుస్తుల్లో రాజశ్యామల అమ్మవారి పూజల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్.. అమ్మవారికి హారతి ఇస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి. చిత్రంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి

2లో



గ్రూప్-2 ప్రిలిమ్స్

25నే..

ఏపీపీఎస్సీ షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 25న గ్రూప్– 2 పరీక్ష నిర్వహించనుంది. ఇప్పటికే 4.30 లక్షల మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఒకేరోజు జరిగే గ్రూప్–2, ఎస్‌బీఐ పరీక్ష రెండింటికీ 550 మందే దరఖాస్తు చేసినట్లు తేలింది. ఏపీపీఎస్సీ విజ్ఞప్తి మేరకు ఈ 550 మందికి మార్చి 4న పరీక్ష నిర్వహిస్తామని ఎస్‌బీఐ తెలిపింది. దీంతో గ్రూప్–2ను వాయిదా వేయించాలనుకున్న ఎల్లో బ్యాచ్‌కు ఎదురుదెబ్బ తగిలింది.

14లో

NABARD

ఏపీలో పంట సాగుదారుల

హక్కు చట్టం భేష్

'ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పంటసాగు హక్కుదారుల చట్టం బాగుంది. భూ యజమాని హక్కులకు నష్టం వాటిల్లకుండా, వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల హక్కుల పరిరక్షణకు ఈ చట్టం దోహదపడతోంది' అని నాబార్డు ఉన్నతాధికారుల బృందం ప్రశంసించింది. సీసీఆర్సీ చట్టం అమలును అధ్యయనం చేసేందుకు ఏపీకి వచ్చిన నాబార్డు బృందం తొలిరోజు గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో పర్యటించింది.

3లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఇన్నాళ్లకు ఓ గూడు దొరికింది



మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. గ్యాస్ డీలర్ వద్ద పని చేస్తున్నా. నాకొచ్చిన ఆదాయమే మా కుటుంబానికి ఆధారం. విజయనగరం జిల్లా మెరకముడిదాంలో మాకున్న పూరిల్లు పూర్తిగా కూలి పోవడంతో అద్దె ఇంట్లో నేను, నా భార్య, మా అమ్మ, నాన్న కలసి ఉండేవాళ్లం. జీవితంలో మాకు సొంతింటి యోగం ఉండదేమోనని ఆవేదన చెందేవాళ్లం. అదృష్టవశాత్తు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా మాకు ఇంటి స్థలం కేటాయించడమే గాకుండా ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు మంజూరు చేయడంతో ఇంటి నిర్మాణం చేపట్టాం. కొంత మొత్తం మేము కలిపి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని అందులో ఇప్పుడు కాపురం ఉంటున్నాం. ఇప్పుడు వర్షం వస్తే కారిపోతుందని గానీ, అద్దె చెల్లించాల్సిన అవసరం గానీ లేదు. ఇటీవలే మా నాన్న అప్పలనాయుడు కన్ను మూశారు. ఆయన బతికున్నంత వరకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. కౌలు రైతు భరోసా కింద రూ.38,500 వచ్చింది. మా అమ్మ ఎన్ను రాముకు వైఎస్సార్ ఆసరా కింద మొత్తంగా రూ. 31,200 వచ్చింది. నా భార్య సీత ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించింది. అప్పుడు ప్రభుత్వం రూ.8,500 అందించింది. ఇన్ని సౌకర్యాలు కల్పించిన ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఎన్ను సత్యం, మెరకముడిదాం
(సీహెచ్ వెంకట సత్యనారాయణరాజు, విలేకరి, మెరకముడిదాం)

'వెన్ను'తట్టిన నవరత్నాలు



నేను సన్నకారు రైతును. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరులో నాకున్న 15 కుంచాల పొలం సాగు చేసుకుంటూ కూలి పనులకు వెళ్లినా.. ముగ్గురు పిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉండేది. అందువల్ల తప్పనిసరి పరిస్థితుల్లో గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ కొద్దికాలం పనిచేసి ఆ తర్వాత స్వగ్రామం వచ్చాను. మళ్లీ కథ మొదటికొచ్చింది. కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఇబ్బందికరంగా మారాయి. ఆ సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకొచ్చారు. ఆయన తీసుకొచ్చిన నవరత్నాల పథకాలు మా కుటుంబంలో వెలుగులు నింపాయి. నా పెద్ద కొడుకు వీర వెంకట సత్యనారాయణస్వామి విద్యా దీవెన సాయంతో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదివాడు. ఏడాదికి రూ.18 వేలు చొప్పున మూడేళ్ల పాటు రూ.54 వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో అందింది. చిన్న కుమారుడికి అమ్మ ఒడి ద్వారా పదో తరగతి, ఇంటర్‌మీడియట్ రెండేళ్లు కలిపి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.45 వేలు వచ్చాయి. నాకు రైతు భరోసా కింద నాలుగేళ్లకు కలిపి రూ.54 వేలు, నా భార్య లక్ష్మికి జగనన్న చేయూత పథకం ద్వారా రెండేళ్లకు రూ.37 వేలు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా కింద రూ.90 వేలు వచ్చింది. నాకు సొసైటీలో సున్నా వడ్డీ రాయితీ ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు అందాయి. నాకు జగనన్న పింఛన్ కానుక కూడా వస్తోంది. ఇప్పుడు పిల్లల చదువుల గురించి మాకు ఎలాంటి బెంగ లేదు. అందుకు జగనన్నే కారణం.

– వెన్ను నాగేశ్వరరావు, పేకేరు
(గుమ్మడి ఆంజనేయులు, విలేకరి, ఇరగవరం)

నా కుమారుడికి ఆసరా దొరికింది



భర్త చనిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు అనారోగ్యంతో మంచాన పడ్డాడు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నాకు అండగా నిలిచింది. మేము పల్నాడు జిల్లా నరసరావుపేట పాతూరు శివాలయం ప్రాంతంలో ఉంటున్నాం. 28 ఏళ్ల క్రితం నాకు వివాహమైంది. మాకు ఒక అబ్బాయి ఉన్నాడు. చిన్నప్పుడే ఫిట్స్ వచ్చి అవయవాల్లో తేడా రావడంతో వెన్ను దెబ్బతింది. లేచి నిలబడలేడు. చెప్పేది వినపడదు. మాట్లాడలేడు. అనేక ఆస్పత్రుల చుట్టూ తిప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. నిత్యం అతడికి ఒక మనిషి సహాయంగా ఉండాలి. మా ఆయన 2015లో మృతి చెందడంతో నేను మా అబ్బాయిని తీసుకొని నరసరావుపేట వచ్చేశాను. నా సోదరులు ఆశ్రయం ఇవ్వడంతో చిన్న ఇంటిలో జీవనం కొనసాగిస్తున్నాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నా కుమారుడి పరిస్థితి వివరిస్తూ జన్మభూమి సభలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా పింఛను మంజూరు చేయలేదు. నాకు వచ్చే పింఛను, సోదరుల సహకారంతో తినీ తినక బతుకు బండి నడిపేదానిని. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నవరత్నాల పథకాలతో మా కష్టాలు తొలగిపోయాయి. మంచానికే పరిమితమైన నా కుమారుడికి బెడ్ పేషెంట్‌గా నెలకు రూ.5 వేలు పింఛను మంజూరైంది. నాకు కూడా కాపు నేస్తం కింద మూడేళ్ల నుంచి ఏడాదికి రూ.15 వేలు చొప్పున 45 వేలు వచ్చాయి. నా ఆర్థిక సమస్యలు తీరి సంతోషంగా ఉన్నాను. సీఎం జగన్‌కి రుణపడి ఉంటాం.

– అల్లంశెట్టి విజయలక్ష్మి, నరసరావుపేట
(సీహెచ్.వి.రమణారెడ్డి, విలేకరి, నరసరావుపేట)

వైభవంగా రాజశ్యామల యాగం

విశాఖ శ్రీశారదా పీఠంలో పూర్ణాహుతిలో పాలుపంచుకున్న సీఎం వైఎస్ జగన్





పీఠంలోని వేద విద్యార్థులను ఆప్యాయంగా పలుకరిస్తున్న సీఎం జగన్. రాజశ్యామల అమ్మవారికి పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- సంప్రదాయ వస్త్రధారణతో పీఠంలో రెండు గంటలు యాగం, పూజలు
- 30 నిమిషాలు అమ్మవారికి పూజలు..స్వహస్తాలతో హారతులు
- వేదపండితులను సత్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పెందుర్తి: విశాఖ శ్రీ శారదా పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో రాజశ్యామల యాగం వైభవోపేతంగా జరిగింది. యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలుపంచుకున్నారు. అంతకుముందు శారదా పీఠానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు పీఠం ప్రతినిధులు పూర్ణకుంభంతో వేద మంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలను కలిసి సీఎం జగన్ ఆశీస్సులు తీసుకున్నారు. సీఎం జగన్ సంప్రదాయ వస్త్రధారణతో స్వామీజీలతో కలిసి రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం స్వర్ణ మండపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దీక్ష పీఠం వద్ద విశేష పూజలు చేశారు. ప్రముఖ పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ స్వామీజీల సమక్షంలో దాదాపు 30 నిమిషాలు అమ్మవారికి సీఎం జగన్ ప్రత్యేక పూజలు చేసి స్వహస్తాలతో హారతులిచ్చారు. పీఠంలోని స్వయంజ్యోతి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి, దాసాంజనేయస్వామిలను దర్శించుకున్నారు. జమ్మి చెట్టుకు ప్రదక్షిణ చేసి పూజలు చేశారు. వేద పండితులను సీఎం జగన్ సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం నిర్వహించిన రాజశ్యామల యాగాన్ని దర్శించుకుని, పూర్ణాహుతిలో పాలుపంచుకున్నారు. యాగ భస్మాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి సీఎం నుదిటిన దిద్దారు. 2 గంటలకు పైగా సీఎం వైఎస్ జగన్ యాగం, పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. పీఠంలోని వేద విద్యార్థులతో ముచ్చటించారు. సీఎం వెంట వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స, విడదల రజిని, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు డాక్టర్ బీశెట్టి సత్యవతి, ఎం.వి.వి.సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, పెట్ల ఉమాశంకర్ గణేష్, విశాఖ మేయర్ హరివెంకటకుమారి ఉన్నారు.

మేం 'సిద్ధం'జగనన్నా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విశాఖ ప్రజల ఘన స్వాగతం

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విశాఖ శ్రీ శారదా పీఠంలో రాజశ్యామల యాగానికి వచ్చిన సీఎం జగన్‌కు విశాఖ ప్రజలు ఘన స్వాగతం పలికారు. విశాఖ విమానాశ్రయం నుంచి శ్రీ శారదా పీఠం వరకు రోడ్డుకు ఇరువైపులా నిలబడి 'నిన్ను మరోసారి గెలిపించడానికి మేం సిద్ధం జగనన్నా'అంటూ స్వాగతం పలికారు. ప్రజలు, మహిళలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఎండను సైతం లెక్క చేయకుండా రోడ్డుకు ఇరువైపులా నిల్చొని జెండాలు, సిద్ధం ప్లకార్డులు ప్రదర్శించారు. ఒక అభిమాని కాన్వాయ్ వెంట ప్లకార్డు ప్రదర్శిస్తూ పరుగులు తీశాడు. సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ, అక్క చెల్లెమ్మలను పలకరిస్తూ శ్రీ శారదా పీఠానికి వెళ్లారు.

రాజశ్యామల యాగాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించే ఏకైక పీఠం ఇదే: స్వామీజీ

దేశంలో రాజశ్యామల యాగాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించే ఏకైక పీఠం విశాఖ శ్రీ శారదా పీఠమని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ చెప్పారు. ఏపీతో పాటు తెలంగాణ, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల సీఎంలు సైతం ఇక్కడ రాజశ్యామల యాగంలో పాల్గొన్న వారే అని తెలిపారు. శ్రీ శారదా పీఠంలో కొలువుదీరిన రాజశ్యామల మాత అత్యంత శక్తివంతమైన దేవత అని స్వామీజీ తెలిపారు. సీఎం జగన్ శ్రీ శారదా పీఠం వార్షికోత్సవాల్లో పాల్గొనడం, రాజశ్యామల యాగాన్ని దర్శించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు.

బాబుకు రెస్ట్!

▶ మొదటి పేజీ తరువాయి



రెండేళ్ల కిందటిదాకా కనీసం సొంతిల్లు కూడా కట్టుకోలేదని వాళ్లకి అర్థమయింది. బ్రాంచ్ కెనాల్ ద్వారా నీళ్లు తెస్తానని ఇన్నాళ్లూ మోసపు మాటలు చెప్పారే తప్ప.. ఆ పనిని చేసి చూపించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని వాళ్లకు అనుభవంలోకి వచ్చింది. అందుకే రాబోయే ఎన్నికల్లో బాబుకు బైబై చెప్పేందుకు వాళ్లంతా సిద్ధమవటంతో.. 40 ఇయర్స్ ఇండస్ట్రీ నక్కజిత్తుల నారా వారు తనను ఓడించక ముందే ఆ నియోజకవర్గానికి 'బై' చెప్పటానికి సిద్ధమయ్యారు.

"35 ఏళ్లుగా మీరు చంద్రబాబు నాయుడు గారిని గెలిపిస్తున్నారు. ఇక ఆయనకు రెస్ట్ ఇవ్వాలనిపిస్తోంది. అందుకే ఈ సారి ఇక్కడి నుంచి నేను పోటీ చేయాలనుకుంటున్నాను" అంటూ చంద్రబాబు నాయుడి భార్య నారా భువనేశ్వరి బుధవారం కుప్పంలో ఓ బహిరంగ సభలో స్పష్టంగా చెప్పారు. స్కిల్ కుంభకోణంలో వేల కోట్లు నేరుగా విత్‌డ్రా చేసుకుని మింగేసిన కేసులో ఈ మధ్య చంద్రబాబు నాయుడిని పోలీసులు అరెస్టు చేయటంతో ఆయన జైలుకు వెళ్లటం తెలిసిందే. అది జరిగిన 10–15 రోజుల తరవాత కూడా ఆయన జైలు జీవితాన్ని చూసి తట్టుకోలేక కొందరు మరణించారన్నది టీడీపీ-ఎల్లో మీడియా వ్యాఖ్యానం. వారందరికీ సాయం చెయ్యడానికి నేరుగా నారా భువనేశ్వరి ఓ యాత్ర చేస్తున్నారు. ఆమేమీ రాజకీయ నాయకురాలు కాదు. దీంతో యాత్రలో భాగంగా ఎక్కడికి వెళ్లాలి? ఎవరెవరిని కలవాలి? ఎవరికి చెక్కులివ్వాలి? ఏమేం మాట్లాడాలి? అనేది మొత్తం స్క్రిప్టు ప్రకారమే చేస్తున్నారు. బుధవారం మాట్లాడిన మాటలు కూడా ఆ స్క్రిప్టులో భాగమే. కళ్లెదుట ఓటమి స్పష్టంగా కనిపిస్తుండడంతో ఏదో ఒక వంకతో అక్కడి నుంచి పోటీ చేయకుండా జారుకోవాలనేది బాబు పన్నాగమని, అందుకే భార్య చేత ఆ మాటలు మాట్లాడించారు తప్ప అవేమీ చమత్కారమో, యథాలాపమో కావని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

కుప్పంలో పడిపోయిన బాబు గ్రాఫ్...

కుప్పం బరి నుంచి పక్కకు తప్పుకొని వేరే నియోజకవర్గం చూసుకోవాలని, లేకపోతే ఈ సారి ఎన్నికల్లో పోటీయే చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరించాలని బాబు ఆలోచిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కుప్పంలో బాబు గ్రాఫ్ అంతకంతకూ దారుణంగా పడిపోవటం దీనికి మొదటి కారణం. నిజానికి 2019 ఎన్నికల్లోనే ఆయన మెజారిటీ బాగా తగ్గిపోవటం నుంచి ఈ గ్రాఫ్ పతనం మొదలయింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు చేతి నుంచి కుప్పం జారిపోయింది. మున్సిపల్ ఎన్నికల్లో కుప్పం మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంది. 25 వార్డుల్లో టీడీపీ కేవలం 7 వార్డుల్లో గెలవగా మిగిలిన 18 వార్డుల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అంతకుముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 89 పంచాయతీలకు గాను 70 పంచాయతీలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. నాలుగు జెడ్పీటీసీలు, నాలుగు ఎంపీపీ స్థానాల్లో కూడా టీడీపీ ఓడిపోయింది. ఈ ఫలితాలన్నీ కుప్పంలో చంద్రబాబు పని అయిపోయినట్లేనని స్పష్టంగా చెప్పాయి.

వాస్తవానికి తనను ఏడుసార్లు గెలిపించిన కుప్పం నియోజకవర్గాన్ని చంద్రబాబు ఎప్పుడూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆ ప్రాంతానికి మేలు చేయలేదు. కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా హంద్రీనీవా నీళ్లు తెస్తానని మోసం చేశారే తప్ప పని చేయలేదు. కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా ద్వారా నీళ్లు వచ్చినా, దాన్ని మున్సిపాలిటీగా మార్చినా, రెవెన్యూ డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేసినా.. అవన్నీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే జరిగాయి. ఇక్కడ 20వేల మందికి ఇళ్ల పట్టాలివ్వటంతో పాటు వాటిలో 10వేల ఇళ్ల నిర్మాణం కూడా పూర్తయింది. దాదాపు 90 శాతం ఇళ్లకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. సుదీర్ఘకాలం సీఎంగా ఉన్నా బాబు ఈ స్థానాన్ని పట్టించుకోలేదు సరికదా... కనీసం సొంతిల్లు కూడా కట్టుకోలేదు. వరస పరిణామాలతో కుప్పం తనకు గుడ్‌బై చెప్పబోతోందని అర్థమై ఏడాది క్రితం సొంతిల్లు కట్టడం మొదలుపెట్టారు. అయినా పరిస్థితి మారకపోవటంతో ఓటమిని తప్పించుకోవటానికి కుప్పం నియోజకవర్గానికి గుడ్‌బై చెప్పే ఆలోచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

'సిద్ధం' సభలతో ఉక్కిరి బిక్కిరి

చంద్రబాబు ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోనూ 'రా... కదలిరా' పేరిట సభలు నిర్వహించారు. మరో వైపు లోకేశ్ 'శంఖారావం' పేరుతో సభలు పెట్టారు. ఇక నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' అంటూ సమావేశాలు పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ తరపున వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే... 'సిద్ధం' అంటూ సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. బాబు...లోకేశ్... భువనేశ్వరి సభలన్నిట్లోనూ కలిపినా... రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వచ్చిన జనాల్లో సగం కూడా రాలేదు. 'సిద్ధం' సభలు మూడూ ఒకదాన్ని మించి మరొకటి జనసంద్రాలయ్యాయి. జనం నాడి అర్థమైన చంద్రబాబుకు వణుకు మొదలైంది. అందుకే పొత్తులతోనైనా ఎలాగోలా పరువు నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుప్పంలో కూడా తాను ఓడిపోతే పరిస్థితి దయనీయంగా మారుతుందని, పార్టీ చేజారిపోతుందని అర్థమై.. ఈ సారికి వేరే చోట నుంచి పోటీ చెయ్యడమో... లేకపోతే ఎక్కడా పోటీ చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌లా వ్యవహరించి పరువు నిలుపుకోవటమో చేయాలని చూస్తున్నారన్నది పార్టీ వర్గాల మాట.

నేనే పోటీచేద్దామనుకుంటున్నా..

- కుప్పంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కీలక వ్యాఖ్యలు
- ఓటమి భయంతోనే.. బాబు అలా పలికించారనే ప్రచారం

"కుప్పానికి వచ్చాను. ఇక్కడ నాకొక కోరిక ఉంది. నా మనస్సులో ఎప్పటి నుంచో ఆ కోరిక ఉంది, నేనేమీ మిమ్మల్ని కొట్టను.. తిట్టను.. 35 ఏళ్లుగా చంద్రబాబు గారు కుప్పం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇప్పుడు నాకొక కోరిక ఉంది. ఆయన్ను రెస్ట్ తీసుకోమని చెబుతున్నా. నేనే ఇక్కడి నుంచి పోటీ చేద్దామని అనుకుంటున్నా" - నారా భువనేశ్వరి

సాక్షి, తిరుపతి/శాంతిపురం: నారా భువనేశ్వరి చేసిన కీలకమైన వ్యాఖ్యలు టీడీపీలో దుమారాన్ని రేపుతున్నాయి. ఆమె సరదాగా చేసిన వ్యాఖ్యలే అనుకుంటే పొరబడ్డట్టేనని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఆమె ఎప్పుడూ బహిరంగ సభలో ప్రసంగించలేదు. చంద్రబాబు అరెస్ట్ తరువాత జనంలోకి వచ్చిన నారా భువనేశ్వరి ఏం మాట్లాడాలో స్క్రిప్ట్ రాసిస్తారు. ఆ స్క్రిప్ట్‌ని ఆమె బట్టీ పట్టి సభలో మాట్లాడుతారని టీడీపీలోని ఓ ముఖ్య నేత స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో రెండు రోజులుగా పర్యటిస్తున్న నారా భువనేశ్వరి బుధవారం శాంతిపురంలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. ఆమె ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలపై టీడీపీలో చర్చ జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక.. 35 ఏళ్ల కాలంలో చంద్రబాబు కుప్పానికి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేకపోయారని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు చేయలేని ఎన్నో అభివృద్ధి పనులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించడంతో పాటు.. కుప్పం వాసుల కలగా మిగిలిన హంద్రీ–నీవాకు కృష్ణా జలాలు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్ కేవలం ఐదేళ్ల కాలంలో కాలువ పనులు పరుగెత్తించి నీరు తీసుకురావడంతో కుప్పం వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కుప్పాన్ని మున్సిపాలిటీతో పాటు రెవెన్యూ డివిజన్‌గా చేశారు. చంద్రబాబు చేయలేని ఎన్నో కార్యక్రమాలు సీఎం వైఎస్ జగన్ వల్లే కావడంతో కుప్పం వాసుల్లో మార్పు కనిపించింది. అందులో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పట్టారు. కుప్పంలో నాలుగు జెడ్పీటీసీ స్థానాలు, ఎంపీపీలు, మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. పంచాయతీల్లోనూ అత్యధికంగా వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే విజయం సాధించారు. కుప్పంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటించిన సమయంలో స్థానికుల నుంచి అనూహ్య స్పందన లభించడం వంటి పరిణామాలు చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టించాయి. అప్పటి నుంచి చంద్రబాబు నియోజకవర్గాన్ని మార్చాలని భావించారు. అందులో భాగంగా స్థానిక, జిల్లా, రాష్ట్ర నాయకులతో పలుమార్లు ఈ విషయం గురించి చర్చించారు.

అలా చెప్పించడం వెనుక మర్మం అదే

ఎన్నికలకు సరిగ్గా రెండు నెలలు కూడా లేని సమయంలో నిజం గెలవాలి అనే కార్యక్రమం పేరుతో తన సతీమణి భువనేశ్వరిని కుప్పానికి పంపించారు. కుప్పంలో ఏం మాట్లాడాలో స్క్రిప్ట్ రాసి పంపారని, అందులో భాగంగా భార్యతో స్పష్టంగా చెప్పించారని టీడీపీ నేతలు చెబుతున్నారు. జైల్లో ఉన్నప్పుడు చంద్రబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారని కోర్టుకు నివేదికలు సమర్పించిన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు. అనారోగ్యం, ఆపై వయస్సు మీద పడడంతో వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు తప్పుకోవడమే మేలని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కుప్పంలో పోటీచేసి ఓడిపోతే మొదటికే మోసం వస్తుందనే భయంతో భార్యతో చెప్పించారని, ఆ తరువాత పార్టీతో ప్రకటన చేయించే ఆలోచనలో ఉన్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. నారా భువనేశ్వరి చేసిన ప్రకటనతో చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో అస్త్ర సన్యాసం చేస్తారని సొంత జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

రేపు ఒంగోలులో సీఎం జగన్ పర్యటన

నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఒంగోలులో పర్యటించనున్నారు. నగర పరిధిలోని నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొంటారు. ఇందుకోసం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి ఒంగోలు మండలం ఎన్.అగ్రహారానికి సీఎం చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లికి చేరుకుంటారు.



సీట్ల కోసం ఇంకేం తినాల్సి వస్తుందోనని భయంగా ఉంది సార్!!

భువనేశ్వరి పోటీ చేసినా ఓటమి తప్పదు

- మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పోటీ చేసినా కుప్పంలో ఓటమి తప్పదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు టీడీపీ కుర్చీని ఎప్పుడో మడత పెట్టేశారని, రాజ్యసభలోనూ, కుప్పంలోనూ సీటు ఖాళీ అయిందని ఎద్దేవా చేశారు. సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబు కుప్పం ప్రజలకు మంచినీళ్లు కూడా ఇప్పించలేక పోయారన్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం కుప్పం ప్రజలకు మంచినీళ్లు ఇస్తోందని చెప్పారు. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మరో 50 రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, టీడీపీ పని అయిపోయిందని ప్రజలకు అర్థమైందన్నారు.

రాజకీయాల్లో రిటైర్‌మెంట్ అవసరమే

భీమవరంలో జనసేన అధ్యక్షుడు పవన్ స్పష్టీకరణ

సాక్షి, భీమవరం: వయసు మళ్లిన నాయకులు పదవుల కోసం పాకులాడటం పద్ధతి కాదని, రాజకీయాల్లోనూ రిటైర్‌మెంట్ తీసుకుని కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో బుధవారం ఆయన పలువురు టీడీపీ, బీజేపీ నాయకులను మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం కాళ్ల మండలం పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక వయసు వచ్చాక రాజకీయాల్లో ఉండకూడదని చెప్పారు. 80–90 ఏళ్ల వయసు వచ్చే వరకు రాజకీయం చేస్తామంటే కొత్త వాళ్లకు అవకాశాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. అలాంటి వారు రిటైర్‌మెంట్ తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. తాను కూడా 30 ఏళ్ల వయసులోనే సినిమా రంగం నుంచి రిటైర్‌మెంట్ తీసుకుని కొత్త తరానికి అవకాశం ఇచ్చేందుకు ప్రణాళిక రచించుకున్నానని చెప్పారు. నేటి సమాజంలో డబ్బులేని రాజకీయాలు సాధ్యం కావని, డబ్బులు ఖర్చు చేయకుండా రాజకీయాలు చేయాలని తాను ఏనాడూ చెప్పలేదని తెలిపారు. ఎవరికీ భోజనాలు పెట్టకుండా రాజకీయం చేసేస్తానంటే కుదరదన్నారు. డబ్బులు ఖర్చులు పెట్టాలన్న విషయాన్ని ఇప్పటికే నాయకులకు చెప్పానని తెలిపారు. ఓట్లు కొంటారో.. ఏం చేస్తారో తాను చెప్పనని, అది మీరే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కులపరంగా జరిగే గొడవలను పార్టీలకు అంటగట్టడం మంచిది కాదని, కులంలో ఒకరు తప్పుచేస్తే ఆ తప్పును మొత్తం కులంపై మోపుతున్నారన్నారు. ఈ సందర్భంగా భీమవరంలో కాపులు–రాజుల మధ్య, తూర్పుగోదావరి జిల్లాలో కాపు–శెట్టిబలిజ కులాల మధ్య ఉన్న గొడవలను పవన్‌కళ్యాణ్ ప్రస్తావించారు. ఇదిలా ఉండగా, జనసేన పార్టీ.. అన్ని కులాలను సమ దృష్టితో చూస్తుందని చెప్పిన పవన్.. వేదికపై కాపు, క్షత్రియ సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు నేతలకు మాత్రమే స్థానం కల్పించడం.. బీసీ, ఎస్సీ నాయకులెవరికీ అవకాశం ఇవ్వకపోవడం అక్కడ చర్చనీయాంశంగా మారింది. కాగా, రాజకీయాల్లో రిటైర్‌మెంట్ విషయం చంద్రబాబును ఉద్దేశించేనని, ఏదో వ్యూహం మేరకే కుప్పంలో భువనేశ్వరి, ఇక్కడ పవన్ ప్రస్తావించారని పలువురు నేతలు చర్చించుకున్నారు.

రాజ్యసభ అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర కోటాలోని మూడు రాజ్యసభ స్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డికి బుధవారం శాసనసభ భవనంలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి యం.విజయరాజు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబసభ్యులతో పాటు సహాయ రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ వనితా రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ తరఫున రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

నారీమన్ మృతి పట్ల సీఎం జగన్ సంతాపం

ప్రఖ్యాత న్యాయ కోవిదుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలీ ఎస్ నారీమన్ మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నారీమన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. - సాక్షి, అమరావతి

క్లుప్తంగా...

ఆ ఉద్యోగ ప్రకటనతో సంబంధం లేదు

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సర్వశిక్ష అభియాన్ లోగోతో 'గవర్నమెంట్ స్కూల్స్‌లో 841 ఒకేషనల్ ట్రైనర్స్' కాంట్రాక్టు పోస్టులంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలతో తమకు సంబంధం లేదని సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతను మోసం చేసే క్రమంలో కొంతమంది ఇలాంటి అసత్య ప్రకటనలతో డబ్బు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి ప్రకటనలపై యువత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

సీఐఐ విజయవాడ జోన్ చైర్మన్‌గా డీవీ రవీంద్రనాథ్

సాక్షి, అమరావతి: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విజయవాడ జోన్ చైర్మన్‌గా శివ సిస్టమ్స్ డైరెక్టర్ డీవీ రవీంద్రనాథ్, వైస్ చైర్‌పర్సన్‌గా ఐఎంఐఎస్ ఫార్మాస్యూటికల్ ఎండీ డాక్టర్ వి.నాగలక్ష్మి ఎంపికయ్యారు. బుధవారం విజయవాడలో జరిగిన సమావేశంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు.

మార్చి 3న పల్స్‌పోలియో

వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా మార్చి 3వ తేదీన 53.35లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. బుధవారం సచివాలయంలో పల్స్‌పోలియో–2024 స్టేట్ టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల సమన్వయంతో ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేస్తామన్నారు. అంగన్‌వాడీలు, గ్రామ వార్డు సచివాలయాల వలంటీర్లతో ఏఎన్ఎంలు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

అనేక సవాళ్లను ఎదుర్కొని మరీ ముందుకు..

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగుతున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు అస్తవ్యస్తమైన టీడీపీ ప్రభుత్వ పాలనలో అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. రాజధాని, పారిశ్రామిక వాడలు, పోలవరం, రాయలసీమలోని పలు ప్రాజెక్టులను మధ్యలోనే వదిలేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కరోనాతో పాటు, ఆర్థిక ఇబ్బందులన్నింటినీ అధిగమిస్తూ పలు ప్రాజెక్టులను పూర్తి చేశామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనూ ఇప్పటి వరకు 99 శాతం అమలు చేసినట్టు తెలిపారు. మన దేశంలో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే అమలు చేసిందని వెల్లడించారు.

పరిపాలనలో అద్భుతాలు సాధించారు

సీఎం జగన్‌పై మంత్రి ధర్మాన ప్రశంసలు



శ్రీకాకుళం రూరల్: పిట్టకొంచెం.. కూత ఘనం అన్న చందాన.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వయసులో చిన్నే.. కానీ పరిపాలనలో అద్భుతాలు సాధించారని, దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నాలుగో స్థానంలో నిలిపారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశంసించారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలు రోడ్డులోని సిస్టం కళాశాలలో బుధవారం నిర్వహించిన వలంటీర్లకు సన్మాన సభలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పాలనలో 14వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను సీఎం జగన్ 4వ స్థానంలోకి తీసుకొచ్చారంటే ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలేనని స్పష్టం చేశారు. చంద్రబాబు మోసపూరిత హామీలు ఇవ్వడం వల్లే 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు. జగన్ అందించిన సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేని చంద్రబాబు.. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అవుతోందని చెప్పారని, అదే చంద్రబాబు ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ జగన్ అందిస్తున్న పథకాలన్నింటినీ కొనసాగించడమే కాకుండా వాటికి రెట్టింపు పథకాలు అందిస్తామని చెప్పారని అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్న వలంటీర్ వ్యవస్థను కొందరు పెద్దమనుషులు, సినిమా స్టార్లు కించపరిచి మాట్లాడడం తగదని హితవు పలికారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బరు

కోర్టులను మోసం చేసే రామోజీకి పోర్టుల గురించి ఏం తెలుసు?

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వంపైన అసత్య కథనం

'ఈనాడు' వక్రీకరణలపై అసలు వాస్తవాలివిగో..

'అసలే కోతి.. ఆ పైన కల్లు తాగింది.. ఆ తర్వాత దానికి పిచ్చెక్కింది.. తర్వాత దానికి దయ్యం పట్టింది.. ఇక ఈ కోతి చేష్టల గురించి ప్రత్యేకంగా చెప్పాలా?.. పచ్చ పత్రిక ఈనాడు అధినేత రామోజీరావు కూడా ఇలాగే వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికల్లో అఖండ విజయంతో అధికారంలోకి వచ్చిననాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై ప్రతి అంశంలోనూ విషం జిమ్మడమే రామోజీ పనిగా పెట్టుకున్నారు. నిత్యం ప్రభుత్వంపై అసత్యాలు, అబద్ధాలు, వక్రీకరణలతో కూడిన కథనాలను అచ్చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఇందులో భాగంగానే బుధవారం 'రేవూ.. రేవూ.. ఎందుకు పూర్తికావు' అంటూ ఈనాడులో ఒక విష కథనాన్ని వండివార్చారు. అభూత కల్పనలతో, అసత్యాలతో సాగిన ఈ కథనానికి సంబంధించి అసలు వాస్తవాలివీ..

- సాక్షి, అమరావతి

దేశంలో గుజరాత్ తర్వాత అత్యధిక సముద్ర తీరం 974 కి.మీ ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రాభివృద్ధికి సుదీర్ఘ సముద్ర తీరాన్ని ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో తీర ప్రాంతం వెంట లక్షల్లో నివసిస్తున్న మత్స్యకారుల సంక్షేమంపై ముందుగా దృష్టి సారించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు చేపల వేటకు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. గుజరాత్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వలసపోయేవారు. ఈ క్రమంలో పాకిస్థాన్ కోస్టుగార్డుకు మన మత్స్యకారులు చిక్కారు. ఇలాంటి దుస్థితిని అరికట్టడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరుతో వారికి ఆర్థిక సాయం కూడా అందిస్తోంది. అంతేకాకుండా వలసలను నివారించడానికి రాష్ట్రంలోనే పది ఫిషింగ్ హార్బర్లను నిర్మించాలని తలపెట్టింది. వీటిలో ఇప్పటికే జువ్వలదిన్నె హార్బర్ నిర్మాణం పూర్తి చేసుకుని వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేసుకుని ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం అందుబాటులోకి రానున్నాయి. రెండో దశ కింద మరో ఆరు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. అయితే ఇంత జరుగుతున్నా రామోజీరావు మాత్రం కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తున్నారు.

ఏకంగా రూ.4 వేల కోట్ల వ్యయంతో..

మత్స్యకారులు ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన దుస్థితికి చెక్ పెడుతూ ఏకంగా రూ.4 వేల కోట్ల వ్యయంతో పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఏకంగా 60 వేల మత్స్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూరేలా.. వారు స్థానికంగానే ఉపాధి పొందేలా మినీ పోర్టుల స్థాయిలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ, మంచినీళ్లపేట, బుడగట్లపాలెం, పూడిమడక, ఓడరేవు, బియ్యపుతిప్ప, కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తోంది. అదేవిధంగా విశాఖపట్నం జిల్లా భీమిలి, అనకాపల్లి జిల్లా రాజయ్యపేట, దొండవాక, విజయనగరం జిల్లా చింతపల్లి, తిరుపతి జిల్లా రాయదరువు, కాకినాడ జిల్లా ఉప్పలంకల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను అభివృద్ధి చేస్తోంది. 12,000 బోట్లను సురక్షితంగా నిలుపుకోవడమే కాకుండా అక్కడే చేపలను వేలం వేసుకోవడం, శీతలీకరణ, ఎండబెట్టుకోవడం, మార్కెటింగ్ వంటి అన్ని సౌకర్యాలను సమకూరుస్తోంది. అలాగే ఈ ఫిషింగ్ హార్బర్ల పక్కనే ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులను కూడా అభివృద్ధి చేస్తోంది.

అందుబాటులోకి తొలి దశ హార్బర్లు

తొలి దశలో రూ.1,523 కోట్లతో అభివృద్ధి చేస్తున్న నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. ఇప్పటికే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయి వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధమవుతుండటంతో రామోజీ కడుపుమంటతో తట్టుకోలేకపోయారు. మిగిలిన మూడు హార్బర్లలో నిర్మాణ పనులు 65 శాతంపైగా పూర్తయినా కేవలం 30 శాతమే అయ్యాయంటూ ఎప్పటిలానే అబద్ధాలను అచ్చేశారు. దాదాపు రెండేళ్లపాటు కరోనా, మధ్యలో భారీ వర్షాలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలను అధిగమిస్తూ ప్రభుత్వం పనులను వేగంగా పూర్తి చేస్తోంది.



హార్బరు భవనాలు సిద్ధం

ఫిషింగ్ హార్బర్	ప్రాజెక్ట్ వ్యయం (రూ.కోట్లలో)	లబ్ధి పొందే మత్స్యకార కుటుంబాలు	బోట్లు నిలిపే సామర్థ్యం
జువ్వలదిన్నె	288.80	6,100	1,250
నిజాంపట్నం	451	9,000	1,600
మచిలీపట్నం	422	3,300	550
ఉప్పాడ	361	17,700	2,500
మంచినీళ్లపేట	డీపీఆర్ దశలో ఉంది		
బుడగట్లపాలెం	365.80	3,840	780
పూడిమడక	392.53	4,870	930
కొత్తపట్నం	392.53	4,200	820
ఓడరేవు	417.55	9,500	1,650
బియ్యపుతిప్ప	429.43	2,348	441
మొత్తం	3,520.64	60,858	10,521



రోడ్లు రెడీ..

ఇంటర్ హాల్‌టికెట్ల విడుదల



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్లను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ విడుదల చేశారు. బుధవారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్లను ఆయన విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది బోర్డు పరీక్షలకు ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 10,52,221 మంది హాజరవుతున్నారన్నారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు–నేడు కార్యక్రమం కింద మౌలిక సదుపాయాలను పునరుద్ధరిస్తోందని, ఇప్పటికే పనులు పూర్తయిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను చూసి ప్రైవేట్ యాజమాన్యాలు ఆశ్చర్యపోతాయన్నారు.

ప్రభుత్వ యాప్‌లపై అవగాహన పెంచాలి

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 'భాషిణి, డిజీ లాకర్' వంటి యాప్స్ ప్రత్యేకతను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేసి వారికి వాటిపై అవగాహన పెంపొందించాలని ప్రవీణ్ ప్రకాశ్ అధికారులను ఆదేశించారు. సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్టీ, ఎఫ్ఎల్ఎన్, సాల్ట్, ప్రథమ్, ఎల్ఎఫ్ఈ, శామో, టోఫెల్ నిర్వహణ తదితర విభాగాల ప్రతినిధులతో బుధవారం ఆయన సమీక్ష జరిపారు. విజయవాడలోని ఐబీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ..'భాషిణి' యాప్ ద్వారా ఇతర భాషల నుంచి వాయిస్, టెక్స్ట్ మెసేజ్‌గా అనువాదం చేసుకోవచ్చన్నారు. ఫార్మెటివ్ సమ్మెటివ్ పరీక్షల మార్కులను డిజీ లాకర్ యాప్ ద్వారా తల్లిదండ్రులు తెలుసుకునేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీలోని 40 యాజమాన్య పాఠశాలలను ఎస్‌సీఈఆర్టీ, ఐబీ బృందాలు పరిశీలిస్తాయని చెప్పారు. ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు జరిగే ఈ ప్రక్రియలో పాఠశాలల్లోని విద్యా కార్యక్రమాల తీరును అధ్యయనం చేస్తాయన్నారు.

బెదిరించిన విలేకరితో వాదించడమూ తప్పేనా?

- పల్నాడు జిల్లా అమరావతిలో న్యూస్‌టుడే విలేకరిని చంపేందుకు యత్నం అంటూ రామోజీ రోత రాతలు
- కొద్ది రోజులుగా టీడీపీ నేతల ప్రోద్బలంతో అసత్య కథనాలు రాస్తూ ఆ విలేకరి బ్లాక్‌మెయిలింగ్
- ఇసుక రవాణా నిలిపివేసినా అక్కడ ఉన్న వాహనాల ఫొటోలు తీస్తూ బెదిరింపులు
- నిలదీసి ప్రశ్నిస్తే తనపై దాడి చేశారంటూ గగ్గోలు
- మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి ప్రోద్బలంతో సొంతంగా గాయం చేసుకొని నాటకం

సాక్షి, నరసరావుపేట: నిత్యం ప్రభుత్వంపై విషం చిమ్మే పచ్చ పత్రిక ఈనాడులో బుధవారం ప్రచురితమైన 'పత్రికలపై పగబట్టిన వైకాపా' వార్త పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో రాసిందే. అందులో పల్నాడు జిల్లా అమరావతి మండల న్యూస్‌టుడే విలేకరి పరమేశ్వరరావుపై దాడి చేశారని, చంపబోయారంటూ కట్టుకథలు అల్లారు. వాస్తవానికి ఆ విలేకరి సంఘ విద్రోహశక్తిగా పేరున్న టీడీపీ నేత దండా నాగేంద్రతో సాన్నిహిత్యంగా ఉంటూ అతని కనుసన్నల్లో ఇసుక సరఫరాపై నిత్యం తప్పుడు కథనాలు వండి వారుస్తున్నాడు. నాగేంద్ర పీడీ యాక్ట్‌పై జైలుకెళ్లి ఇటీవల విడుదలైన సంగతి అందరికీ తెలిసిందే. ప్రశాంతంగా ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలో రాజకీయంగా అల్లర్లు సృష్టించేందుకు ఆ టీడీపీ నేత గత కొన్ని నెలలుగా కుట్రలు చేస్తున్నాడు. పరమేశ్వరరావు ఒక పత్రికలో విలేకరిగా పనిచేస్తూ అక్రమాలకు పాల్పడడంతో అతన్ని తొలగించారు. ఈ క్రమంలో అతనికి ఏడాది క్రితం నాగేంద్ర సిఫార్సుతో ఈనాడు విలేకరిగా అవకాశం కల్పించారు. అప్పటినుంచి స్వామిభక్తి చాటుకుంటూ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా తప్పుడు కథనాలు రాస్తున్నాడు.

దౌర్జన్యంగా ప్రవేశించి బెదిరింపులు..

ఈ నెల 13న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి స్వయంగా మల్లాది ఇసుక రీచ్‌కు వచ్చి పరిశీలించివెళ్లారు.ఇసుక తవ్వకాలు ఆపమని జిల్లా, మండల స్థాయి అధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోవటంతో మరుసటి రోజు యథావిధిగా ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఉదయం 10.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి గ్రామస్థాయి అధికారులు వచ్చి వెంటనే ఇసుక తవ్వకాలు ఆపేయాలని నిర్వాహకులకు తెలిపారు. అప్పటికే పది ఇసుక వాహనాలకు లోడ్ చేయటానికి బిల్లులు రాశారు. బిల్లులు రాయకుండా ఉన్న 15 వాహనాలను వెనుకకు పంపారు. బిల్లులు రాసి లోడైన ఆరు వాహనాలు బయటకు వెళ్లాయి. ఈ సమయంలో మల్లాది గ్రామానికి చెందిన ఈనాడు కంట్రిబ్యూటర్ పరమేశ్వరరావు ఇసుకరీచ్‌లోకి వచ్చి నదిలో ఇసుక లోడ్ అవుతున్న నాలుగు వాహనాల ఫొటోలు, వీడియోలు తీశారు. ఈ సమయంలో రీచ్‌లో కూలీకి పనిచేస్తున్న మల్లాది యువకులు తమ ఊరు వాడే కదా అనే చనువుతో ఏంటబ్బాయి ఫొటోలు, వీడియోలు తీస్తున్నావని అడగగా.. నేను ఈనాడు విలేకరిని, మాకు మా యాజమాన్యం నుంచి ఆదేశాలు అలాగే ఉన్నాయి, అయినా మీకు చెప్పాలా, మీ పర్మిషన్ తీసుకుని రావాలా ఏంటీ, అన్ని వాహనాలు సీజ్ చేయిస్తానంటూ దురుసుగా మాట్లాడాడు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈనాడు విలేకరి కవ్వింపు చర్యలకు పాల్పడటంతో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఇసుక తవ్వకాలు జరిపే కంపెనీ విజిలెన్స్ అధికారి రాంబాబు వారిని విడదీసి విలేకరిని ద్విచక్రవాహనంపై దగ్గరుండి పంపించారు. కిందపడ్డ పరమేశ్వరరావు సెల్‌ఫోన్‌ను తరువాత అక్కడకు చేరుకున్న సీఐ బ్రహ్మం తీసుకు వచ్చి అతనికి అప్పగించారు. సంఘటన జరిగిన తరువాత విజిలెన్స్ అధికారి మీడియాకు ఈ విషయాన్ని వివరించారు.

వాస్తవాలు దాచిపెట్టి ఈనాడు కథనం

సంఘటన జరిగిన సమయంలో తాను అక్కడే ఉన్నానని, అయితే జరిగింది ఒకటైతే ఈనాడు పత్రికలో వచ్చింది మాత్రం మరొకటని ఇసుక కంపెనీ విజిలెన్స్ అధికారి రాంబాబు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఈనాడు కంట్రిబ్యూటర్ పరమేశ్వరరావు ఇసుక రీచ్‌లోకి ప్రవేశించి అక్కడ ఉన్న వారితో వాగ్వివాదానికి దిగాడన్నారు. దీంతో ఈ విషయంపై ఇద్దరి మధ్య తోపులాట జరిగిందన్నారు. అంతేగాని పెట్రోల్ తీసుకురండి.. తగలెట్టేద్దాం వంటి మాటలు అనటం, దాడి చేసి నిర్బంధించినట్లు రాయడం అవాస్తవమన్నారు. ఇసుక రీచ్‌కి సంబంధించిన సిబ్బంది ఎక్కడా వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే శంకరరావు పేరు ప్రస్తావించలేదని చెప్పారు. దాడి జరిగిన వెంటనే మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వచ్చి పరామర్శించి, దీనికి రాజకీయ రంగు పులిమారు. అమరావతి నుంచి దండా నాగేంద్ర కారులో పరమేశ్వరరావు గుంటూరు ఈనాడు కార్యాలయానికి చేరి.. అక్కడ అల్లిన కట్టుకథే ఈనాడులో ప్రచురితమైంది.

మీ భర్త హయాంలో మహిళలపై కిరాతకాలు కనిపించలేదా?

- కాల్‌మనీ, సెక్స్ రాకెట్, రిషితేశ్వరి, వనజాక్షి ఉదంతాల్లో ఎందుకు స్పందించలేదు?
- మహిళలపై బాలకృష్ణ అసభ్య వ్యాఖ్యలను ఖండించారా?
- నారా భువనేశ్వరిపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ ధ్వజం



సాక్షి, అమరావతి: ఆడపిల్ల అర్ధరాత్రి నడవాలంటే మంచి ప్రభుత్వం రావాలంటున్న భువనేశ్వరికి ఆమె భర్త చంద్రబాబు పాలనలో మహిళలపై జరిగిన కిరాతకాలు కనిపించలేదా అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ నిలదీశారు. తన భర్త హయాంలో మహిళలపై అనేక దురాగతాలు జరిగినప్పుడు భువనేశ్వరి ఎక్కడున్నారు? అని ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పద్మజ మీడియాతో మాట్లాడారు. కాల్‌మనీ, సెక్స్‌రాకెట్‌లో టీడీపీ నేతలు దాదాపు 200 మంది మహిళల్ని లైంగికంగా హింసించి.. బెదిరించి నీలిచిత్రాలు తీసినప్పుడు భువనేశ్వరి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తహశీల్దార్ వనజాక్షిపై నాటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాడి చేస్తే ఇది తప్పని ఎందుకు చెప్పలేదన్నారు. రిషితేశ్వరి అనే విద్యార్థినిని చిత్రహింసలకు గురి చేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపిస్తే చంద్రబాబును ఎందుకు నిలదీయలేదు? అని ప్రశ్నించారు. కుప్పంలో ఓ బీసీ మహిళ వైఎస్సార్‌సీపీ మీటింగ్‌కు హాజరైందని.. ఆమెను వివస్త్రను చేసి వీడియోలు చిత్రించి హింసించిన సంగతి భువనేశ్వరికి తెలియదా? అని నిలదీశారు. పెందుర్తిలో ఓ దళిత మహిళ.. తన అసైన్డ్ స్థలాన్ని లాక్కోవద్దని కాళ్లు పట్టుకుని ప్రాధేయపడితే నాటి టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ ఎలా కిరాతకంగా ప్రవర్తించాడో చూడలేదా? నందమూరి బాలకృష్ణ.. ముద్దైనా పెట్టాలి.. కడుపైనా చేయాలని మాట్లాడినప్పుడు ఇది తప్పని ఎందుకు ఖండించలేదు? అని ప్రశ్నించారు. ఎక్కడో తెలంగాణలో జరిగిన అత్యాచార ఘటనను రాష్ట్రానికి ముడిపెట్టడానికి సిగ్గుండాలన్నారు. వీటన్నింటికి భువనేశ్వరి బహిరంగ క్షమాపణ చెప్పాలని పద్మజ డిమాండ్ చేశారు. భువనేశ్వరి అక్క పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్నారని.. అలాగే, టీడీపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు భువనేశ్వరి చేపడితే బాగుంటుందేమోనన్నారు. ఎందుకంటే అబద్ధాలు అల్లి ప్రచారం చేయడంలో తన భర్త, కొడుకును ఆమె మించిపోయారని ఎద్దేవా చేశారు.

తండ్రీకొడుకు వెక్కివెక్కి ఏడుస్తున్నారు..

చంద్రబాబు విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందంటూ ఆయన భార్య నారా భువనేశ్వరి మీడియా ముందుకొచ్చి మరోసారి ధ్రువీకరించారని పద్మజ గుర్తు చేశారు. తన భార్యను ఎవరూ ఏమీ అనకుండానే చంద్రబాబు వెక్కి వెక్కి ఏడ్చారని.. ఇప్పుడు మా నాన్నను ముసలోడంటున్నారని లోకేశ్ కూడా వెక్కివెక్కి ఏడుస్తున్నాడని ఎద్దేవా చేశారు. అయినా ప్రజల నుంచి ఆశించినంత స్పందన రావడం లేదన్నారు. దీంతో చివరికి కుర్చీలు మడత పెట్టుకునే పనిలో పడ్డారన్నారు.

డీవోపీ నియామక విధానం తప్పు

నాలుగు నెలల్లో కొత్త డీవోపీని నియమించండి: హైకోర్టు

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీవోపీ)గా జె.సుదర్శన్‌రెడ్డి నియామకాన్ని హైకోర్టు రద్దు చేసింది. ఆయన నియామకం చట్ట నిబంధనలకు విరుద్ధమని వెల్లడించింది. ప్రాసిక్యూషన్స్ నుంచి వచ్చిన వ్యక్తినే డీవోపీగా నియమించాలని స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి నాలుగు నెలల్లో కొత్త డీవోపీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పటి వరకు డీవోపీగా సుదర్శన్‌రెడ్డి కొనసాగవచ్చంది. ఆ లోపు కొత్త డీవోపీ నియామకం పూర్తి కాకుంటే ఆయన కొనసాగడానికి వీల్లేదని వెల్లడించింది. ఆయనకు రాజకీయ నేపథ్యం ఉంది కాబట్టి డీవోపీ పోస్టుకు అనర్హుడిగా ప్రకటించాలన్న పిటిషనర్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. సుదర్శన్‌రెడ్డి ఎంపీపీగా ఎన్నికయ్యారని, అయితే డీవోపీగా నియమితులయ్యే ముందే ఆయన ఆ పదవికి రాజీనామా చేశారని గుర్తు చేసింది. ఈ పోస్టు చేపట్టడానికి ముందు సుదర్శన్‌రెడ్డి రాజకీయ సంబంధాలు ఆయనను డీవోపీ పోస్టు చేపట్టడానికి ఎంత మాత్రం అనర్హుడిని చేయవని తేల్చిచెప్పింది. సుదర్శన్‌రెడ్డి నియామకాన్ని రద్దు చేసిన పక్షంలో డీవోపీగా తనను నియమించేలా ఆదేశాలు ఇవ్వాలన్న అదనపు డీవోపీ బి.రామకోటేశ్వరరావు అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ మేరకు ఆయన దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది.

సహేతుక, పారదర్శక విధానం అవసరం..

డీవోపీగా సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ గతేడాది మే 22న జారీ చేసిన జీవో 522ని సవాల్ చేస్తూ అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బి.రామకోటేశ్వరరావు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు డిసెంబర్ 21న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పు వెలువరించింది. 'రాష్ట్రస్థాయి నియామక బోర్డు చేపట్టే ప్రత్యక్ష నియామక విధానం డీవోపీకి వర్తించదు. సీఆర్‌పీసీలోని సెక్షన్ 25ఏ డీవోపీని నియమించడానికి ఉన్న ఏకైక మార్గం. ఈ సెక్షన్ కేవలం డీవోపీ అర్హతలనే చెబుతుంది. సుదర్శన్‌రెడ్డిని డీవోపీగా నియమించే సమయంలో ఈ విషయాలను పట్టించుకోలేదు' అని ధర్మాసనం తెలిపింది. 'డీవోపీ పోస్టు నిర్దిష్ట కాల పరిమితితో ఉంటుందని అడ్వొకేట్ జనరల్ చెబుతున్నారు. అయితే ఇందుకు సంబంధించిన ఎలాంటి ప్రొసీడింగ్స్‌ను కోర్టు ముందుంచలేదు. రాష్ట్రస్థాయి పోస్టును భర్తీ చేసే విషయంలో ప్రభుత్వం పారదర్శక విధానాన్ని అనుసరించాలి. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలి. సుదర్శన్‌రెడ్డి నియామకం విషయంలో అలాంటిది ఏమీ చేయలేదు. డీవోపీ పరీక్ష ఏమీ అవసరం లేదు. సహేతుక, పారదర్శక విధానాన్ని అనుసరిస్తే చాలు. కోర్టు వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని డీవోపీ నియామకం విషయంలో నిర్దిష్ట విధానాన్ని ఖరారు చేయాలి. నియామకం ప్రతిభ ఆధారంగానే జరగాలి' అని ధర్మాసనం పేర్కొంది.

ఏపీలో పంట సాగుదారుల హక్కు చట్టం భేష్

- భూయజమానుల హక్కులకు ఎలాంటి నష్టం లేదు..
- అదే సమయంలో కౌలు రైతుల హక్కుల పరిరక్షణ
- రాష్ట్ర ప్రభుత్వానికి నాబార్డ్ కితాబు
- కౌలు రైతులున్న రాష్ట్రాల్లో ఇలాంటి చట్టంతో ప్రయోజనం



ఏలూరు జిల్లా కొప్పాక వద్ద కౌలు రైతులతో మాట్లాడుతున్న నాబార్డు బృందం సభ్యులు


సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పంటసాగు హక్కుదారుల చట్టం–2019 బాగుందని నాబార్డు ఉన్నతాధికారుల బృందం కితాబిచ్చింది. భూ యజమాని హక్కులకు ఏలాంటి నష్టం వాటిల్లకుండా, వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల హక్కుల పరిరక్షణకు ఈ చట్టం దోహదపడతోందని పేర్కొంది. భూ యజమాని అనుమతితో పంటసాగు హక్కు పత్రాలు(సీసీఆర్సీ) జారీ చేసి కౌలుదారులకు పంట రుణాలతో పాటు, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అమలు చేస్తుండటం హర్షణీయమంది. రాష్ట్రంలో సీసీఆర్సీ చట్టం అమలు తీరును అధ్యయనం చేసేందుకు ముంబైలోని నాబార్డు మేనేజర్లు బెంజమిన్ థామస్, అరవింద్‌కుమార్, నాబార్డు కన్సల్టెంట్ ప్రణవ్‌ఖాత్రిల సారథ్యంలోని ఉన్నతాధికారుల బృందం రాష్ట్రంలో మూడురోజుల పర్యటనకు శ్రీకారం చుట్టింది. తొలిరోజు గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి భూ యజమానులు, కౌలు రైతులతో ముఖాముఖిలో పాల్గొంది. చట్టం అమలు తీరుపై అధ్యయనం చేసింది.

పకడ్బందీగా అమలు చేస్తే మరింత మేలు

సీసీఆర్సీ కార్డుల జారీ, రుణాలతో పాటు సంక్షేమ ఫలాల అమల్లో ఎదురయ్యే ఇబ్బందులను బృందం సభ్యులు తెలుసుకున్నారు. ఈ చట్టం వల్ల తమకెన్నో ప్రయోజనాలున్నాయని, అయితే అంగీకార పత్రాలపై సంతకాలు చేయడానికి భూయజమానులు వెనుకంజవేస్తున్నారని కౌలు రైతులు నాబార్డు బృందం దృష్టికి తెచ్చారు. సీసీఆర్సీ కార్డులున్న వారికి పంట రుణాల మంజూరులో కొంత మంది బ్యాంకర్లు ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. మరోవైపు, ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తే భవిష్యత్‌లో లేనిపోని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందేమోనన్న ఆందోళన తమకుందని భూ యజమానులు చెప్పారు. సీసీఆర్సీ చట్టం రూపకల్పన చాలా బాగుందంటూ నాబార్డు బృందం సభ్యులు ప్రశంసించారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తే మెజార్టీ కౌలు రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. చట్టంపై కౌలు రైతులతో పాటు భూ యజమానులకూ అర్థమయ్యే రీతిలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే రీతిలో కౌలుదారులు ఎక్కువ సంఖ్యలో ఉండే రాష్ట్రాల్లోనూ ప్రత్యేక చట్టాలు తీసుకొస్తే మంచి ఫలితాలొస్తాయని అభిప్రాయపడ్డారు.

25.93 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులు

చట్టం అమల్లోకి వచ్చాక రాష్ట్రంలో దాదాపు 25.93 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులిచ్చామని అధికారులు వివరించారు. 14.13 లక్షల మందికి బ్యాంకర్ల ద్వారా రూ.8,346 కోట్ల వ్యవసాయ రుణాలు మంజూరు చేయించగలిగినట్టు తెలిపారు. అత్యధికంగా ఈ ఏడాది 8.31 లక్షల మందికి సీసీఆర్సీలు జారీ చేయగా, వీరిలో 5.48 లక్షల మందికి రూ.1908 కోట్ల రుణాలు మంజూరైనట్టు తెలిపారు. పంట రుణాలే కాదు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులతో పాటు వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా పరిహారం, పంట నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) వంటి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. రుణాల మంజూరులో లక్ష్యాలను నిర్దేశిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కొంతమంది బ్యాంకర్లు చూపే సాంకేతిక కారణాలతో నూరు శాతం కార్డుదారులకు రుణాలు మంజూరు చేయలేకపోతున్నామని వివరించారు. పర్యటనలో నాబార్డు ఏపీ ఏజీఎం స్మారక్ మోహంతి, డీడీఎం అనిల్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఉన్నది ఒకటే మంచి. జ్ఞానం.
ఉన్నది ఒకటే చెడు. అజ్ఞానం.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 22 ఫిబ్రవరి 2024

'సర్వోన్నత' న్యాయం!

వ్యవస్థలు నిర్మాణం కావటానికి సమయం పట్టినట్టే అవి భ్రష్టుపట్టడానికి కూడా ఎంతో కొంత వ్యవధి పడుతుంది. అప్రమత్తంగా వుండి సకాలంలో దాన్ని గమనించుకుంటే వాటిని రక్షించుకోవటం సులభమవుతుంది. గత నెల 30న జరిగిన చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక విషయంలో సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తీసుకున్న అసాధారణ నిర్ణయం ఆ కారణం రీత్యా హర్షించదగింది. ఆ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆప్ అభ్యర్థి కులదీప్ కుమార్‌ను మేయర్‌గా ప్రకటిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పు వక్రమార్గాల్లో విజయం సాధించటానికి అలవాటుపడిన రాజకీయ నేతలకూ, వారికి దాసోహమయ్యే అధికారులకూ చెంపపెట్టు. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన అనిల్ మాసీ కనీసం సీసీ కెమెరాలున్నాయన్న వెరపు కూడా లేకుండా ఆప్ అభ్యర్థికి పడిన ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై స్వహస్తాలతో గీతలు పెట్టి అవి చెల్లని ఓట్లుగా లెక్కేసి బీజేపీ అభ్యర్థిని విజేతగా ప్రకటించారు. ఆయన వ్యవహారశైలి పూర్తిగా చట్టవిరుద్ధమని ధర్మాసనం తేల్చిచెప్పటంతోపాటు అఫిడవిట్‌లో సైతం ఆ అధికారి బొంకటం నేరంగా పరిగణించి ఆయనపై సీఆర్‌పీసీ సెక్షన్ 340 కింద విచారణ జరపాలని నిర్ణయించటం మంచి పరిణామం.

నిజానికి ఏ ఇతర నగరాలతో పోల్చినా చండీగఢ్ మేయర్ పదవి ఏమంత ప్రాధాన్యత వున్నది కాదు. కేంద్ర పాలిత ప్రాంతంగా వున్న ఆ నగరానికి మేయర్ అయినవారు కార్పొరేషన్ సమావేశాలు నిర్వహించటం, ఎజెండాను రూపొందించటం మాత్రమే చేయగలరు. పైగా ఆ పదవీకాలం ఏడాది మాత్రమే. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బీజేపీ నాయకత్వం ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్ వరకూ ఎవరి దారి వారిదే అని ప్రకటించిన ఆప్... అందరినీ ఆశ్చర్యపరుస్తూ మేయర్ ఎన్నికలో మాత్రం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ 13 వార్డుల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ ఏడింటిని గెలుచుకుంది. బీజేపీకి 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. చండీగఢ్ లోక్‌సభ ఎంపీగా గెలిచిన బీజేపీ నేత కిరణ్ ఖేర్, ఒకే ఒక్క సభ్యుడున్న శిరోమణి అకాలీదళ్ కౌన్సిలర్‌ను కూడా కలుపుకొంటే బీజేపీ బలం 16. కనుక 36 మంది సభ్యులున్న కార్పొరేషన్‌లో 20 మంది సభ్యులున్న ఆప్–కాంగ్రెస్ కూటమి గెలుపు ఖాయం. కానీ ఏం చేసైనా నెగ్గి తీరాలనుకున్న బీజేపీ వ్యూహానికి అనిల్ మాసీ వంతపాడారు. ఆది నుంచీ మేయర్ ఎన్నికను ఆయన ప్రహసన ప్రాయంగా మార్చారు. షెడ్యూల్ ప్రకారం వాస్తవానికి గత నెల 18న మేయర్ ఎన్నిక జరగాలి. కానీ ఆప్, కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశం కోసం వెళ్లాక మాసీ అస్వస్థులయ్యారంటూ దాన్ని కాస్తా వాయిదా వేశారు. కేంద్రపాలిత పాలనావ్యవస్థ ఈ ఎన్నికను ఫిబ్రవరి 6న జరపాలని నిర్ణయించింది. దీన్ని సవాలు చేస్తూ ఆప్ అభ్యర్థి కులదీప్ కుమార్ పంజాబ్ హరియాణా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయటంతో న్యాయస్థానం దీన్ని జనవరి 30న జరపాలని ఆదేశించింది. ఈ క్రమం అంతా పరిశీలిస్తే, 30న జరిగిన తతంగం గమనిస్తే నాయకులు, అధికారులు ఎంత నిస్సిగ్గుగా కుమ్మక్కయ్యారో అందరికీ స్పష్టంగా అర్థమవుతుంది. ఈనెల 5న ఈ కేసు విచారణకొచ్చినప్పుడు మాసీ వ్యవహరించిన తీరును జస్టిస్ చంద్రచూడ్ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఇది ప్రజాస్వామ్యాన్ని వంచించటం, హత్య చేయటం తప్ప మరేమీ కాద'ని ఆయన అన్నారు. నిజానికి ప్రజలకు బాధ్యత వహించాల్సిన స్థానంలో, వారి విశ్వాసాన్ని పొందాల్సిన స్థానంలో వున్న రాజకీయ పార్టీలకు ఈ స్పృహ వుండాలి. రేపన్న రోజు అధికారంలోకొచ్చే మరో పార్టీ కూడా ఇదే తీరులో గెలుపును తస్కరించే ప్రమాదం వున్నదని గుర్తించాలి. అన్నిటికన్నా ముఖ్యంగా ప్రజల దృష్టిలో ఈ ఎన్నికల తతంగం మొత్తం గుప్పెడుమంది బలవంతులు చేసే వంచనాత్మక విన్యాసమన్న అభిప్రాయం స్థిరపడితే తమ మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్న ఎరుక వుండాలి. కానీ సమస్యాత్మకంగా వున్న బడి పిల్లలకు ఉపాధ్యాయులు చీవాట్లు పెట్టే రీతిలో సర్వోన్నత న్యాయస్థానం కలగజేసుకుని చెప్పవలసిరావటం అధికారుల, నేతల పరువు ప్రతిష్ఠలకే తలవంపు. దాన్ని కనీసం గుర్తించలేని స్థితిలోనే మన నాయకగణం వున్నదని ఆదివారం నాటి పరిణామాలు చెబుతున్నాయి. మేయర్ ఎన్నికను సుప్రీంకోర్టు రద్దు చేసి, మళ్లీ ఎన్నికకు ఆదేశిస్తుందన్న అంచనాతో బీజేపీ నాయకులు ఫిరాయింపులకు తెరలేపి, ముగ్గురు ఆప్ సభ్యులను బుట్టలో వేసుకున్నారు. దాంతో ఆప్–కాంగ్రెస్ కూటమి బలం 17కి పడిపోగా, బీజేపీ బలం 19కి పెరిగింది.

ఒకపక్క చండీగఢ్ మేయర్ ఎన్నిక వ్యవహారం సుప్రీంకోర్టు పరిశీలనలో వుండి, దేశమంతా దానిపై దృష్టిపెట్టిన తరుణంలో ఈ తరహా జుగుప్సాకర చేష్టలకు పాల్పడటం భావ్యంకాదన్న ఇంగితజ్ఞానం లోపించటం నిజంగా బాధాకరం. మేయర్‌గా పార్టీ అభ్యర్థి నెగ్గటంపైనే తమ భవిష్యత్తంతా ఆధారపడి వుందనుకోవటం దివాలాకోరుతనం. మాసీ మాయోపాయంవల్ల మేయర్ అయిన మనోజ్ సోంకార్ రాజీనామా చేశారు గనుక తిరిగి ఎన్నికకు ఆదేశించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనను తోసిపుచ్చి 142వ అధికరణ కింద సంక్రమించిన అధికారాన్ని వినియోగించి ఆప్ అభ్యర్థిని విజేతగా నిర్ణయించటాన్ని చూసైనా అటు నాయకులూ, ఇటు అధికార గణమూ కళ్లు తెరవాలి. అక్రమాలతో, అన్యాయాలతో గెలవాలని చూడటం ప్రజాస్వామ్యానికి తీవ్ర అపచారం చేయటమేనని అందరూ గుర్తించాలి. అసాధారణమైన ఈ తీర్పు మన వ్యవస్థలకు భయభక్తులు నేర్పాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి: శు.త్రయోదశి ప.1.45 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుష్యమి సా.5.14 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.10.17 నుండి 11.05 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, అమృత ఘడియలు: ఉ.10.22 నుండి 12.04 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.59
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

అధికార పార్టీని ఆపడం సాధ్యమేనా?

విశ్లేషణ



రాధికా రామశేషన్

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 స్థానాలనూ, తన నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 400 స్థానాలనూ గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం ప్రాంతీయ పార్టీలనూ, గుర్తింపు రాజకీయాల మూలాలున్న పార్టీలనూ కూడా ఆకర్షించి తమతో కలుపుకోవడానికి ప్రయత్నిస్తోంది. దీనివల్ల సీట్ల పంపకంపై సర్వత్రా వాగ్వివాదాలు తలెత్తవచ్చు. అయితే బీజేపీ వ్యూహకర్తలకు అలాంటి చిక్కులను అధిగమించే నేర్పు ఉంది. మరోవైపు శక్తిమంతమైన బీజేపీని ఎదుర్కోవాల్సిన ఇండియా కూటమిని ఎవరు నడిపిస్తారు అనే ప్రశ్న ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. పైగా అవి ఒక ఉమ్మడి ఆదేశం మీద పనిచేయడంలో విఫలమవుతున్నాయి. కాంగ్రెస్ తన గొప్పతనపు భ్రమలను విడిచిపెట్టేవరకు, ఇండియా కూటమిపై పెద్ద ఆశలు లేవు.

లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ చదరంగంలో పావులు కదులుతున్న వేళ... తర్కాలు, ఔచిత్యాలు తలకిందులవుతున్నాయి. పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన మేరకు బీజేపీ 370 లోక్‌సభ స్థానాలను (ఎన్డీయే కూటమికి 400) లక్ష్యంగా పెట్టుకుంది. 'ఇండియా' కూటమి సంకీర్ణానికి భారీగా బలాన్నిచ్చే ప్రతిపక్ష పార్టీలను తుడిచిపెట్టడానికి గర్వాతిశయంతో కూడిన అధికార పార్టీ నిశ్చయంగా ప్రయత్నిస్తుంది. దీనికి వ్యతిరేకంగా తన శ్రేణులను బలోపేతం చేయడానికి ఇండియా కూటమికి ఎన్ని మిత్రపక్షాలైనా అవసరమే. విపత్తులను (ఉదాహరణకు, తమిళనాడు వరదలు) ఎదుర్కోవడానికి కేంద్రం నుండి తగినంత సహాయం అందించని ఆర్థిక అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, 'కేంద్రం వర్సెస్ రాష్ట్రాలు' అనే చర్చను ఇండియా కూటమి లేవనెత్తుతోంది. అలాగే అక్రమాల పేరుతో ఎంపిక చేసిన మంత్రులపై కేంద్రం అణచివేత చర్యలకు పాల్పడటాన్ని కూడా విమర్శిస్తోంది.

మంది ఎక్కువైతే వచ్చే చిక్కులు

మరోవైపు బీజేపీ శక్తిమంతమైన నాయకత్వం కలిగివుంది. తన తోటి నేతలను అవలీలగా అధిగమించగలిగే ప్రజాకర్షక ప్రధాన మంత్రి, చట్టబద్ధమైన సంస్థలపై పట్టు, బలీయమైన పార్టీ యంత్రాంగం వంటి అంశాలతో ఆ పార్టీ క్షీణిస్తున్న ప్రతిపక్షాల కూటమితో పోలిస్తే ఎంతో బలంగా ఉంది. ప్రాంతీయ పార్టీలకు వంశపారంపర్య లేదా గుర్తింపు రాజకీయాలలో మూలాలున్నప్పటికీ, ఎన్డీయేలోకి సాధ్యమైనన్ని ప్రాంతీయ శక్తులను ఆకర్షించి, కలుపుకోవడానికి బీజేపీ చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో అత్యున్నత అభాస ఉంది. ఇది పార్టీపరంగా చూస్తే బీజేపీకి ఎంతమాత్రం పొసగనిది. గత ఐదేళ్లలో, అవిభక్త శివసేన, జనతాదళ్ (యునైటెడ్), శిరోమణి అకాలీదళ్ వంటి ఒకప్పటి విలువైన భాగస్వాములను బీజేపీ కోల్పోయింది. అయితే, చిన్న పార్టీలను చేర్చుకోవడంతో ఎన్డీయే పరిధి ఇప్పుడు విస్తృతమైంది. బీజేపీ తన అపారమైన యుక్తుల ద్వారా, మహారాష్ట్రలో అసలు నాయకుడు ఉద్ధవ్ ఠాకరే నుంచి శివసేనను విభజించింది. శరద్ పవార్ నుంచి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలోని మెజారిటీ విభాగాన్ని స్వాధీనం చేసుకుంది. శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గం ఇప్పుడు ఎన్డీయే ఆస్తి. శరద్ పవార్, ఉద్ధవ్ ఠాకరేలపై బీజేపీ మోపిన ఆరోపణలకు అజిత్ పవార్, శివసేనను చీల్చిన ఏక్‌నాథ్ శిందే ఆమోదయోగ్యతను కల్పించారు. 'లౌకిక' సంకీర్ణ ప్రభుత్వ పతనానికి దారితీసిన నాటకీయ తిరుగుబాటులో జేడీ(యూ)ను బీజేపీ తిరిగి పొందింది. విశ్వసనీయత కోల్పోయిన నితీష్ కుమార్ నాయకత్వంలో తిరిగి బిహార్‌లో అధికారంలోకి వచ్చింది. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీని ఎదుర్కోవడానికి శిరోమణి అకాలీదళ్‌తో చర్చలను పునఃప్రారంభించింది.



ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ)ని బుజ్జగించడం బీజేపీ సంకీర్ణ కూటమికి సంబంధించి అత్యంత ఆసక్తికరమైన అంశం. ఇది రాష్ట్రంలోని పశ్చిమ ప్రాంతంలో తన ప్రయోజనాలను పటిష్టం చేయడానికేనని స్పష్టం. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఈ ప్రాంతం బీజేపీని ఎన్నడూ నిరాశపరచలేదు. గత జూన్‌లో బీజేపీని సవాలు చేయడానికి ఉమ్మడి ఫ్రంట్ ద్వారా తీవ్రంగా ప్రయత్నించిన ప్రతిపక్షాన్ని ఖాళీ చేయించాలనే ఆలోచనలో ఇది భాగం. అయితే ఇండియా కూటమిని ఎవరు నడిపిస్తారు? కాంగ్రెసా లేదా ప్రాంతీయ నాయకుడా అనే ప్రశ్న ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. గత డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఓడించి, హిందీ మాట్లాడే ప్రధాన భూభాగంపై తన ఆధిపత్యాన్ని బీజేపీ తిరిగి నెలకొల్పిన తర్వాత, ఇండియా కూటమి నాయకత్వ శూన్యత గణనీయంగా ఎత్తి చూపబడింది. ఓటములతో కంగుతిన్న కాంగ్రెస్, ఇప్పుడు తమిళనాడు, కేరళలో ఉన్న బలమైన మిత్రపక్షాల అండదండలతో దక్షిణాది వైపు చూస్తోంది.

దక్షిణాదిలో సాపేక్షంగా స్వల్పంగానే ఉనికిలో ఉన్నప్పటికీ వెరవకుండా, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత, దాదాపుగా దేవెగౌడ వంశానికి చెందిన ఒక ప్రైవేట్ ఎస్టేట్ అయిన జనతాదళ్ (సెక్యులర్)తో కలిసి బీజేపీ ముందుకు సాగుతోంది. ఇక తెలంగాణలో మాత్రం భారత రాష్ట్ర సమితితో పొత్తుపై బీజేపీ అధినాయకత్వం సందిగ్ధంలో ఉంది.

ఇలాంటి పరిస్థితుల్లో– బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని మిత్రపక్షాల బలాధిక్యతతో బీజేపీ పుష్కలంగా నాయకులు ఉండటం అనే సమస్యను ఎదుర్కొంటోంది. మరోవైపున జేడీ(యూ), ముఖ్యమైన కాంగ్రెస్ నాయకులు, తాజాగా మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ నిష్క్రమణ తర్వాత ఇండియా కూటమి నాయకుల కరువు నెదుర్కొంటోంది. ఎన్డీయేలో సీట్ల పంపకంపై సర్వత్రా వాగ్వివాదాలు తలెత్తవచ్చు. అయితే బీజేపీ వ్యూహకర్తలకు అలాంటి చిక్కులను అధిగమించే నేర్పు ఉంది.

ఇండియా కూటమికి కాలం ఎందుకు అననుకూలంగా మారింది? కాంగ్రెస్ లేదా ప్రాంతీయ పార్టీలు తమ సమీకరణాలను సరిగ్గా నిర్వచించుకోలేక పోవడం వల్ల, కూటమి సంకట పరిస్థితి ఆరంభంలోనే నిర్ణయమైపోయినట్టు అనిపించింది. జేడీ(యూ), తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ తమను తాము కాంగ్రెస్ పార్టీతో సమానంగా భావించాయి. అయితే మాటల్లో చెప్పకుండానే కాంగ్రెస్ అధిష్ఠానం తానే నాయకత్వం చేపట్టాలనుకుంది. మరోవైపు ప్రాంతీయ పార్టీలు ఒక ఉమ్మడి ఆదేశంపై పనిచేయలేకపోయాయి. నితీష్ కుమార్‌ను కూటమికి కన్వీనర్‌గా నియమించాలనే ప్రతిపాదనను తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వ్యతిరేకించాయి. ఈ పదవి ఆయనను భారతదేశ ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలో ఉంచడానికి ఒక నిచ్చెన మెట్టు అని ఈ పార్టీల నాయకులు అనుమానించారు. తన వంతుగా రాహుల్ గాంధీ, తాను ప్రధాని పదవికి పోటీలో ఉన్నాననే ఊహాగానాలను ఎన్నడూ కొట్టివేయలేదు.

సంకీర్ణం ఒక క్రీడ కాదు

కాంగ్రెస్ ఆకాంక్షలు దాని క్షేత్ర బలానికి చాలా అసమానంగా ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, మూడు హిందీ ప్రధాన రాష్ట్రాలలో దాని తిరోగమనం... కాంగ్రెస్‌కు సమర్థవంతంగా తలుపులు మూసివేశాయి. కాంగ్రెస్ మూడింట రెండు రాష్ట్రాలను కైవసం చేసుకున్నట్లయితే, అది న్యాయబద్ధంగా ఇండియా కూటమికి నాయకత్వం వహించగలిగేది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో అధికారాన్ని కోల్పోవడానికీ, మధ్యప్రదేశ్‌ను తిరిగి కైవసం చేసుకోవడంలో విఫలం కావడానికీ తెలంగాణలో గెలవడం అనేది పరిహారం కాదు.

సంకీర్ణ నిర్మాణం కాంగ్రెస్‌కు ఎప్పుడూ లేదు. లోక్‌సభలో మెజారిటీ సాధించలేక పోయినప్పుడు, అది బీజేపీయేతర సంకీర్ణాలకు అయిష్టంగానే మద్దతిచ్చింది. అది ఒక క్రీడగా భావించి వాటిని విచిత్రంగా పడగొట్టడానికి మాత్రమే మద్దతిచ్చింది. రాహుల్ గాంధీ ఈ సంప్రదాయానికి తగ్గట్టుగా ఉన్నారు. ఇండియా కూటమిలో నితీష్ అశాంతితో ఉన్నారనీ, ఆర్ఎల్‌డీ నూతన అవకాశాలను కోరుకున్నదనీ జనానికి తెలుసు. వారు ఎందుకు అసంతృప్తిగా ఉన్నారో, వారికి ఏం కావాలో తెలుసుకునేందుకు రాహుల్ ప్రయత్నించలేదు. మిలింద్ దేవరా వంటి సన్నిహిత సహచరుడితోపాటు తన పార్టీ ఇతర సహచరుల నిష్క్రమణ పట్ల కూడా ఆయన ఉదాసీనంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తన గొప్పతనం మీద భ్రమలను వీడేంతవరకూ, ఇండియా కూటమిపై పెద్దగా ఆశలు లేవు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అనుకున్నట్టుగానే...



పాకిస్తాన్ సైన్యం ఒక బలహీన సంకీర్ణ ప్రభుత్వాన్ని కోరుకుంటోంది... చూస్తుంటే సరిగ్గా అదే జరుగుతోంది.

– మహీరా అఫ్జల్, స్కాలర్

ఇదొక హింస



సాత్విక 'అహింస' రాజకీయాలు: 1. ప్రతిఘటించే వరకూ జనాల్ని దూషించాలి. 2. తర్వాత వారిని 'న్యాయ' బుల్‌డోజర్‌తో శిక్షించాలి. 3. అటుపై ఇంటికెళ్లి 'స్వచ్ఛమైన' శాకాహార భోజనాన్ని నెయ్యి వేసుకొని ఆరగించాలి.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

అలా పోస్తేనే...



నాకు టెక్నాలజీ అంటే ఎంతో ఆసక్తి. కానీ జిలేబీలను త్రీడీ ప్రింటర్ నాజిల్‌తో చేయడం చూశాక, మిశ్రమ భావాలు కలిగాయి. జిలేబీలంటే నాకు ఎంతో ఇష్టం. అలా చేత్తో వాటిని నూనెలో పోయడం కూడా ఒక కళారూపం. చూస్తుంటే నేను అనుకున్నదానికన్నా కూడా నేను పాతకాలపు మనిషిని...

– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

ఎలా ప్రతిఫలిస్తుంది?



అయోధ్య ప్రాణప్రతిష్ఠ తాలూకు సాంస్కృతిక పవర్‌ను తక్కువ అంచనావేయొద్దు. నేను వింటున్నదాన్ని బట్టి చాలామంది జనాలు ఆ తతంగాలు, ప్రధానమంత్రి ఉపవాస దీక్ష, ఇతర దేవాలయాలను దర్శించుకోవడం లాంటివాటికి నిజంగానే ప్రభావితమయ్యారు.

– వసుంధర సిర్నాటే, కాలమిస్ట్

బాల్యపు గొంతు



అమీన్ సయానీ సాబ్! మీ ఆత్మకు శాంతి కలగాలి. మా చిన్నతనం మొత్తం మీ గొంతును ఆనందించాం. ప్రతివారం మీ షో కోసం ఎదురుచూశాం. ఇంకో దిశలో మీ ప్రయాణం సురక్షితంగా సాగాలి. మీ కోసం ప్రార్థిస్తాం. (అమీన్ సయానీ రేడియో అనౌన్సర్; 'బినాకా గీత్ మాలా'తో ఖ్యాతికెక్కారు.)

– ఆదిల్ హుస్సేన్, నటుడు

న్యాయ కోవిదుడు



దేశ అంతరాత్మకు కావలి కాసిన లెజెండ్ ఫాలీ ఎస్. నారిమన్ ఇక మనతో లేరు. 1975లో అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు ఆయన దేశ అడిషినల్ సొలిసిటర్ జనరల్‌గా రాజీనామా చేశారు. ఆఖరికి సుప్రీంకోర్టును విమర్శించడానికి కూడా ఆయన వెనుకాడలేదు. న్యాయ కుటుంబానికి ఇది చాలా పెద్ద నష్టం. ఆయన ఆత్మకు దేవుడు శాంతి కలిగించుగాక!

– ఫైజాన్ ముస్తఫా, లీగల్ స్కాలర్

పనికి రావా?



పిల్లలు బంగ్లా వర్ణమాల నేర్చుకోవడానికి ఇస్లామిక్ బంగ్లాదేశ్ ఒక పాఠ్యపుస్తకం ముద్రించింది. అందులో సంగీతం మంచిది కాదు, కళ మంచిది కాదు, వినోదం మంచిది కాదు అని ఉంది. అంటే మంచి విషయాలేవీ 'హలాల్' (అంగీకారమైనవి) కావు. ఇలాంటివి చిన్నారుల మెదళ్లలో నూరిపోస్తున్నారు. ఇస్లామిక్ ఆటవికతను తిరస్కరించాల్సిన సమయం ఇది.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

ఇన్ బాక్స్

వ్యాపారీకరణ నిజమేనా?

దాదాపు కోటి మందికి పైగా హాజరయ్యే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర వ్యాపారీకరణకు గురయ్యిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2010 సంవత్సరం కన్నా ముందు కూడా 50 లక్షల లోపు భక్తులు మేడారం జాతరకు హాజరయ్యేవారు. 2020 నుండి ఈ భక్తుల సంఖ్య కోటికి చేరింది. దీనికి కారణాలు: సమ్మక్క, సారలమ్మలపై భక్తులకు ఉన్న అపార నమ్మకం, విశ్వాసం, కోరిన కోర్కెలను తీర్చే తల్లులుగా ఈ వన దేవతల గురించి విశేష ప్రచారం జరగడం. ఈ జాతర దట్టమైన అడవిలో ఉన్న కుగ్రామంలో జరగడం కూడా నగర ప్రజలను ఆకర్షించింది.

అయితే, ఈ మేడారం జాతర ప్రక్రియలో గిరిజన సంస్కృతీ, ఆచార, సంప్రదాయాలలో ఇప్పటి వరకు ఏమాత్రం మార్పు రాలేదు. కాకపోతే, పెరుగుతున్న భక్తుల సంఖ్యను సొమ్ము చేసుకునేందుకు దేవాదాయ శాఖ తీసుకున్న చర్యలు వ్యాపారీకరణ నిజమేననుకొనేలా చేస్తున్నాయి. ఏ మాత్రం రూపం లేని గద్దెల వద్ద అమ్మవార్ల ప్రతిమలను పెట్టడం, గద్దెల ప్రాంగణం చుట్టూ హిందూ దేవాలయాల మాదిరిగా నిర్మాణాలను చేయడం, సమ్మక్క సారలమ్మ ప్రసాదాలను ప్రవేశ పెట్టడం, పోస్టు ద్వారా కూడా అమ్మవార్ల ప్రసాదం పంపిణీ చేయడం, సామాన్య భక్తులకు ఏమాత్రం అనుకూలంగా లేకుండా వీఐపీలకు దర్శనంలో ప్రాధాన్యత ఉండేలా చూడటం వంటి ప్రభుత్వ చర్యలు విమర్శలకు గురవుతున్నాయి.

అయితే ఇప్పటికీ సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులను వనం నుండి గద్దెల వరకు తేవడం, తిరిగి వనప్రవేశం చేయించడం, పూజాదికాలు ఆదివాసీ సంప్రదాయం ప్రకారమే జరగడం ముదావహం. గిరిజన సంస్కృతికి ఆదివాసీలు దూరమవుతున్నారనీ, ఆదివాసీలను హైందవీకరిస్తున్నారనీ, జాతరను వ్యాపారీకరిస్తున్నారనీ విమర్శలు వస్తున్నప్పటికీ; సామాన్య గిరిజన, జానపదులు మాత్రం ఇవేమీ లెక్క చేయకపోవడం విశేషం.

– కన్నెకంటి వెంకట రమణ, హైదరాబాద్

విద్యా సాధికారత దిశగా అడుగులు

అభిప్రాయం



ఓరుగంటి సుబ్బారావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎడెక్స్' (ఈడీఈఎక్స్) కార్యక్రమాన్ని ఆరంభించడం ద్వారా ఉన్నత విద్యను అందరికీ అందుబాటులో ఉంచే దిశగా ఒక కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం ద్వారా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎమ్ఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రపంచ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల నుండి రెండు వేల కోర్సులు ఉచితంగా అందించబడుతున్నాయి. ఇది నిజానికి రాష్ట్రంలోని యువతకు ఇస్తున్న గొప్ప పెట్టుబడి. ఇది భారత రాజ్యాంగం, మానవ హక్కుల చట్టాలు ప్రోత్సాహించే విద్యా హక్కును మరింత బలోపేతం చేస్తుంది.

భారతీయ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం, 6 నుండి 14 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఉచితంగా, నిర్బంధంగా విద్యను అందించాలి. అంతర్జాతీయ కోర్సులను కలిగిన ఉన్నత విద్యను అందరికీ అందుబాటులో ఉంచడం ద్వారా, ఏపీ ప్రభుత్వం నాణ్యమైన విద్య కేవలం కొన్ని వర్గాలకు పరిమితం కాకుండా 'సమాన విద్యా హక్కు'ను గుర్తించింది. మానవ హక్కుల ప్రకటనలోని 26వ ఆర్టికల్ పేర్కొంటున్న 'ప్రతి ఒక్కరికీ విద్య హక్కు, అర్హత ఆధారంగా ఉన్నత విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి' అన్న అంశాన్ని ఏపీ ప్రభుత్వం కార్యరూపంలోకి తెచ్చినట్లయింది.

'ఎడెక్స్' కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులకు, ముఖ్యంగా ఆర్థికంగా వెనకబడిన వర్గాల నుండి వచ్చిన వారికి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలలో ఉన్నత విద్యను అభ్యసించే కలను నిజం చేస్తుంది. సామాజిక, సాంస్కృతిక శాస్త్రాల నుండి శాస్త్ర, సాంకేతిక రంగాల వరకు వివిధ విషయాలలో ఉచిత కోర్సు లను అందించడం ద్వారా ఈ కార్యక్రమం కేవలం విద్యా పరిధిని విస్తరించడమే కాకుండా, విభిన్న నైపుణ్యాలను కలిగి ఉన్న ప్రపంచ స్థాయి కార్మిక శక్తిని సిద్ధం చేస్తుంది.

అంతర్జాతీయ సంస్థలలో ఉన్నత విద్య అందించే 'ఎడెక్స్' ప్రోగ్రామ్ మూలంగా యువత తమ ప్రతిభను ప్రపంచ వేదికపై ప్రదర్శించే అవకాశాలను పొందుతుంది. విద్యా రంగంలో ఈ రకమైన ప్రగతి కారక అడుగులు, సమాజంలో ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించడానికి తప్పనిసరిగా దోహదపడతాయి. విద్యార్జన వంటి మౌలిక హక్కును అందరికీ అందించడం వల్ల వ్యక్తులు తమ సామర్థ్యాలను గుర్తించి, వాటిని పరిపూర్ణంగా వాడుకోవడానికి వీలవుతుంది. ఇది వారికి ఉత్తమ ఉద్యోగ అవకాశాలను అందించడమే కాకుండా, వారి కుటుంబాలు, సమాజాలలో ఆర్థిక స్థితిని మెరుగు పరచడంలో కూడా సహాయపడుతుంది. విద్య ద్వారా సాధించే ఈ పరివర్తన నిరంతరం కొనసాగాలి. అందుకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు... వెరసి సమాజం మొత్తం సహకరించాలి. ఈ సమన్వయం ద్వారానే, మనం ఒక సంక్షేమ సమాజం నిర్మాణంలో పాల్గొనగలం.



ఎడెక్స్ ప్రతినిధులతో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

చివరగా, 'ఎడెక్స్' పథకం వంటి సంకల్పాలు సామాజిక న్యాయం, సమానత్వం అనే భారతీయ రాజ్యాంగ ఆదర్శాలను బలపరుస్తూ, ప్రతి విద్యార్థికీ విద్యా అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇది సమాజంలో ఆర్థిక, సాంస్కృతిక వైవిధ్యాలను గౌరవిస్తూ, అన్ని వర్గాల నుండి వచ్చిన విద్యార్థులకు సమాన విద్యా అవకాశాలను కల్పించి, వారిలో సమాజం పట్ల బాధ్యత ప్రపంచ సమస్యలపై స్పందించే సామర్థ్యం నెలకొల్పుతుంది. 'ఎడెక్స్' వంటి పథకాలు కేవలం విద్యార్థులకు మాత్రమే కాకుండా, ఉపాధ్యాయులు, విద్యా సంస్థలు, ప్రభుత్వంలోని ఇతర భాగాలకు కూడా లాభదాయకం. వీటి ద్వారా, విద్యా రంగంలో సమగ్రత, నవీనీకరణ, సామర్థ్యపూర్వక ప్రగతి సాధించడం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ నేషనల్ వర్కింగ్ చైర్మన్ ı 90001 77777

స్వచ్ఛ సమాజం కోసం...

తన జీవితాంతం పరిశుభ్రత కోసం కృషి చేసిన సంత్ గాడ్గే బాబా గొప్ప సంఘసంస్కర్త, భిక్షువు కూడా. జంతువులకు రక్షణ, నిరుద్యోగులకు ఉపాధి, నిస్సహాయులకు ఆలంబన, పేద యువతీ యువకులకు వివాహం జరపడం వంటి సేవా కార్యక్రమాలు జీవితమంతా నిర్వహించారు. తన భక్తులను పాఠశాలలు, ధర్మశాలలు, శరణాలయాలు, గోశాలలు, ఆస్పత్రులు, విద్యార్థినుల వసతి గృహాలు నిర్మించేలా ప్రోత్సహించారు. సంచార సన్యాసిగా ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురికిని, చెత్తను చీపురుతో శుభ్రపరిచేవారు. ఆయన పరిశుభ్రతకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేరు పొందారు. గ్రామాలలో అపరిశుభ్రతను రూపుమాపేందుకు 'చీపురు దండు'ను నెలకొల్పారు.



సంత్ గాడ్గే బాబా

భారతదేశ వ్యాప్తంగా వివిధ రాజకీయ పక్షాలూ, సేవాసంస్థలూ ఆయనను స్ఫూర్తిగా స్వీకరిస్తున్నాయి. ఆయన అసలుపేరు దేవీదాస్ దేబూజీ. మహారాష్ట్రలో షేన్గావ్ గ్రామంలోని రజక కుటుంబంలో 1876 ఫిబ్రవరి 23న జన్మించారు. చిన్నతనం నుంచీ భజనమండళ్లలో కీర్తనలు, పాటలు పాడుతూ చుట్టుపక్కల గ్రామాలలో ప్రఖ్యాతిపొందారు. దేబూజీ తన 29వ ఏట కుటుంబాన్ని అర్ధరాత్రివేళ విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆ సమయంలో ఆయనకు తల్లి, తాత, భార్య, పిల్లలు ఉన్నారు. వందకు పైగా పాఠశాలలను ఆయన నెలకొల్పారు. ఇళ్ళులేని, ఆధారంలేని వృద్ధులను ఆదరించేందుకు వృద్ధాశ్రమాలు నిర్మించారు. సమాజం నుంచే కాకుండా అత్యంత సన్నిహితుల నుంచి కూడా దూరమై వివక్షను అనుభవిస్తున్న కుష్ఠురోగులకు సేవచేసేందుకు గాడ్గే బాబా వారికి సేవాశాలలు నిర్మించి సేవ చేశారు. 1956 డిసెంబరు 20న అమరావతి వెళుతుండగా పేఢీ నదీతీరాన వలగావ్ దగ్గర తనువు చాలించారు.

– సంపత్ గడ్డం (రేపు సంత్ గాడ్గే బాబా జయంతి)

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం

ఏకకాలంలో 45 శిఖరాలకు 95 కలశాలతో అభిషేకం / క్రతువు నిర్వహణలో కంచికామకోటి పీఠాధిపతి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో మహాకుంభాభిషేక మహోత్సవం వైభవంగా కొనసాగింది. బుధవారం ప్రధానమైన మహాకుంభాభిషేక క్రతువులను కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి మహాస్వామి, శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి, కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి చేతుల మీదుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శాంతి హోమం, పాష్టిక హోమం, మహాపూర్ణాహుతి, పునరుద్ధరించిన ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠలు, శివలింగ-నందీశ్వరుల ప్రతిష్ఠలు, శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ జరిపారు. అనంతరం 9.45 గంటలకు ఉభయ దేవాలయాల గర్భాలయ విమానాలకు, గోపురాలకు, మూలమూర్తులకు, ఇతర దేవతామూర్తులకు మహాకుంభాభిషేక క్రతువులు నిర్వహించారు. అవభృథం, జగద్గురువులకు గురువందనం, మహదాశీర్వచనం, వేదసభ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఏకకాలంలో 45 ఆలయ శిఖరాలకు 95 కలశాలతో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయశాఖ ప్రత్యేక కార్యదర్శి కరికాల వలవన్, కమిషనర్ సత్యనారాయణ, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మల్లికార్జున స్వామి గర్భాలయ శిఖరానికి కుంభాభిషేకం చేస్తున్న కంచికామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి

సీఎం జగన్ సంకల్పంతోనే మహాకుంభాభిషేకం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతోనే శ్రీశైలం మహాక్షేత్రంలో మహాకుంభాభిషేకం జరిగిందని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. భ్రమరాంబ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పరమేశ్వరుని అనుగ్రహంతో మహాకుంభాభిషేకం దిగ్విజయంగా పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పుస్తక రూపంలో తయారు చేయించి శివరాత్రి రోజున విడుదల చేస్తామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలకు భవిష్యత్తులో వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు.


మహాకుంభాభిషేకంలో పీఠాధిపతులతో మంత్రి కొట్టు సత్యనారాయణ తదితరులు

24న తిరుమలలో పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 24న పౌర్ణమి సందర్భంగా గరుడసేవ జరుగనుంది. ఇందులో భాగంగా రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మిరప నామ సంవత్సరం-2024

- మిరపలో కొత్త వంగడాల రూపకల్పన..నాణ్యమైన దిగుబడులే లక్ష్యం
- ఇయర్ ఆఫ్ చిల్లీని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

సాక్షి, అమరావతి: 2024వ సంవత్సరాన్ని మిరప నామ సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించింది. మిరపలో కొత్త వంగడాల రూపకల్పన, సాగువిస్తరణ, నాణ్యమైన దిగుబడులు, విలువ జోడింపు ఉత్పత్తుల తయారీ, ఎగుమతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇయర్ ఆఫ్ చిల్లీ కార్యక్రమాన్ని వర్చువల్‌గా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. డిసెంబర్ వరకు చేపట్టనున్న కార్యాచరణను విడుదల చేశారు. మిరప ఉత్పత్తి, ఉత్పాదకత, ఎగుమతులలో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని మంత్రి చెప్పారు. మిరపలో అధిక దిగుబడులనిచ్చే 21 వంగడాలను విడుదల చేయడమే కాకుండా, రైతులకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతను రూపొందిస్తూ, అత్యుత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తోన్న ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీని అభినందించారు. మిరపలో ప్రాసెసింగ్ కు, ఫ్లేక్స్, సాస్ తయారీకి అనువైన రకాలను తయారు చేయాలని సూచించారు. వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్ మాట్లాడుతూ మిరపపై పరిశోధనలు ప్రారంభించి వందేళ్లు పూర్తి చేసుకున్న ఘనత గుంటూరు లాంలోని ఉద్యాన పరిశోధన స్థానానికి ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ కమిషనర్ డా.ఎస్.ఎస్.శ్రీధర్, జాతీయ కూరగాయల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా. టీకే. బెహరా, అఖిలభారత కూరగాయల సమన్వయ పథకం అధిపతి డాక్టర్ రాజేష్ కుమార్, వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.నారం నాయుడు పాల్గొన్నారు.

ఇయర్ ఆఫ్ చిల్లీ యాక్షన్ ప్లాన్

- మేలైన సస్యరక్షణ పద్ధతులు, పంటకోత అనంతరం యాజమాన్యం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఆర్బీకేల ద్వారా రైతులకు నెలవారీగా శిక్షణ
- మిరపసాగులో నూతన సాంకేతికతపై రైతులు-శాస్త్రవేత్తల ముఖాముఖి చర్చలు
- జిల్లాల వారీగా మిరప రైతులు,ఉద్యానశాఖ అధికారులకు సదస్సులు, సమ్మేళనాలు
- వర్సిటీ పరిధిలోని కళాశాలలు, పరిశోధనా స్థానాలు, కేవీకేలలో ప్రత్యేక మిరప ఉద్యాన మేళాలు
- మన గ్రామం..మన విశ్వవిద్యాలయం ద్వారా దత్తత గ్రామాల్లో మిరపసాగుపై ఆర్బీకేల ద్వారా శిక్షణ కార్యక్రమాలు
- మిరప సదస్సుల నిర్వహణ ద్వారా మిరపపై పరిశోధనలు చేసే జాతీయ,అంతర్జాతీయ శాస్త్రవేత్తలను రైతుల చెంతకు తీసుకురావడం.


ఇయర్ ఆఫ్ చిల్లీ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

29 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ వెల్లడి

కొరిటిపాడు(గుంటూరు): ఏపీలో ఈ నెల 29 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు భారత పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ తెలిపారు. 2024 ఎఫ్‌సీవీ పొగాకు పంట వేలం అమ్మకాల నిర్వహణ ప్రారంభ తేదీలను నిర్ధారించడానికి పొగాకు రైతులు, వ్యాపారులతో గుంటూరు జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు రైతు భవన్‌లో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం ఆయన సమావేశమయ్యారు. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, ఇండియన్ టుబాకో అసోసియేషన్ (ఐటీఏ), పొగాకు తయారీదారులు, ఎగుమతిదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అందుకనుగుణంగా ఎఫ్‌సీవీ పొగాకు పంట వేలం అమ్మకాల నిర్వహణ తేదీలను నిర్ణయించారు. తొలి ఫేజ్‌లో 29న ఒంగోలు-1, కొండపి వేలం కేంద్రాల్లో, 2వ ఫేజ్ క్రింద మార్చి 6న కందుకూరు-1, కందుకూరు-2, వెల్లంపల్లి వేలం కేంద్రాల్లో, 3వ విడత క్రింద మార్చి 14న ఒంగోలు-2, టంగుటూరు, కలిగిరి, డీసీపల్లి, కనిగిరి, పొదిలి, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, 2 వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమావేశంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

చెన్నైలో రూ.27 కోట్ల కొకైన్ పట్టివేత

సాక్షి, చెన్నై: చెన్నై విమానాశ్రయంలో మంగళవారం రాత్రి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు రూ.27 కోట్ల విలువైన 2.7 కిలోల కొకైన్ పట్టుకున్నారు. స్కూట్ ఎయిర్‌వేస్ విమానంలో సింగపూర్ నుంచి వచ్చిన ఇండొనేసియా జాతీయుడి వద్ద దీన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడు ఇండొనేసియా నుంచి లావోస్‌కు, అక్కడి నుంచి సింగపూర్‌కు వెళ్లి చెన్నై వచ్చినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ కార్టెల్స్‌లో భాగమా, ఇక్కడి డ్రగ్స్ డీలర్లు దీన్ని తెప్పించారా అనే కోణంలో ప్రయాణికుడిని విచారిస్తున్నట్లు చెప్పారు.

నైపుణ్యం ఉంటే ఏ రంగంలోనైనా రాణింపు

- గ్రామీణ, పేద విద్యార్థులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ తరగతులు
- చదవాలన్న ఆసక్తి ఉండి చదువుకోలేకపోయినవారికి సీఎం జగన్ ప్రభుత్వం అండ
- మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

సాక్షి, అమరావతి/భవానీపురం(విజయవాడ పశ్చిమ): గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తూ యువతకు ఉపాధి కల్పనలో సీడాప్(సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ), డీడీయూ-జీకేవై (దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన) కీలకపాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి జోగి రమేష్ అన్నారు. విజయవాడలో బుధవారం సీడాప్, డీడీయూ-జీకేవైలో శిక్షణ పొందిన యువత అపూర్వ ఆత్మీయ కలయిక అలుమిని మీట్ 2024ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి జోగి రమేష్ మాట్లాడుతూ పేద విద్యార్థుల్లో చదవాలన్న ఆసక్తి ఉండి చదువుకోలేకపోయిన లక్షలాది మందికి జగనన్న ప్రభుత్వం చుక్కానిలా నిలిచిందన్నారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్య శిక్షణ ఉచితంగా అందించి పేరున్న సంస్థల్లో ఉపాధి పొందేలా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆర్థిక స్థోమత సహకరించక చదువును మధ్యలోనే ఆపివేసిన వారికి సైతం శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడం సంతోషకరమన్నారు. మన రాష్ట్రంలో 2019 నుంచి ఇప్పటి వరకు 76 వేలకు పైగా యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వగా.. వారిలో 56 వేలకు పైగా యువత ఉపాధి పొందినట్టు తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో ఒక స్కిల్ యూనివర్సిటీ, రాష్ట్రవ్యాప్తంగా 27 స్కిల్ ట్రైనింగ్ కాలేజీలు, నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్కిల్ ట్రైనింగ్ సెంటర్(స్కిల్ హబ్)ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఎంపీ కేశినేని మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధిపై సీఎం జగన్ దృష్టి సారించారని చెప్పారు. చదువులో నూరు శాతం ఉత్తర్ణత సాధించినా నైపుణ్యం లేకపోవడం వల్ల ఉద్యోగాలు రావడం లేదన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడటం, రాయటం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సంస్థ ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదనరెడ్డిలు మాట్లాడారు. ఈ సందర్భంగా మేథా లాంగ్వేజ్ థియేటర్, వాద్వాని ఫౌండేషన్, టాటా ట్రెస్ట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సీడాప్ చైర్మన్ ఎస్.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, ప్రభుత్వ సలహాదారులు జి.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి రాగిపిండి పంపిణీ

బహిరంగ మార్కెట్‌లో కిలో రాగిపిండి రూ.40కిపైగా..

- కార్డుదారులకు రూ.11కే అందించాలని నిర్ణయం
- తొలుత ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పంపిణీ
- కార్డుదారులకు పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- స్థానిక రైతుల నుంచి రాగులు, జొన్నలు కొనుగోలు
- వాటినే తిరిగి రేషన్ లబ్ధిదారులకు..
- ఫలితంగా రైతులకు సంపూర్ణ మద్దతు ధర..
- వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు



సాక్షి, అమరావతి: వచ్చే నెల 1 నుంచి రేషన్ లబ్ధిదారులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రాగిపిండిని పంపిణీ చేయనుంది. తద్వారా ప్రభుత్వం పౌష్టికాహార భద్రతకు పెద్దపీట వేయనుంది. ముందు వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో బలవర్ధక ఆహారంగా రాగి పిండిని సరఫరా చేయాలని నిర్ణయించింది. మార్చి 1 నుంచి కిలో ప్యాకెట్ల రూపంలో దీన్ని అందించనుంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రాగిపిండి రూ.40పైనే పలుకుతుండగా ప్రభుత్వం లబ్ధిదారులకు కిలో రూ.11కే పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. తొలుత శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం, రాయలసీమలోని వైఎస్సార్, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాగా ఒక్కో కార్డుకు ప్రస్తుతం ఇస్తున్న బియ్యంలో కిలో బియ్యం బదులు రాగులు/జొన్నలను అందజేస్తోంది. ఈ క్రమంలోనే కార్డుదారులు వాటిని మిల్లింగ్ చేసుకుని వినియోగించుకుంటున్నారు. ఇకపై లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా.. పౌరసరఫరాల శాఖ చరిత్రలో తొలిసారిగా రాగి పిండి పంపిణీకి శ్రీకారం చుడుతోంది.

నేరుగా రైతుల నుంచే కొనుగోలు

రేషన్ లబ్ధిదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడంలో భాగంగా స్థానిక రైతులకు సంపూర్ణ మద్దతు కల్పిస్తూ పౌరసరఫరాల సంస్థ రాగులు, జొన్నల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ శాఖ ద్వారా రైతులను చిరుధాన్యాల సాగువైపు తీసుకెళ్తోంది. ఇందులో భాగంగానే రాయితీపై చిరుధాన్యాల విత్తనాలను అందిస్తోంది. కొర్రల కొనుగోలుకు సైతం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మరీ మద్దతు ధరల జాబితాలో చేర్పించింది. కొర్రలు కోతలకు వచ్చే సమయంలో వాటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇప్పుడు శ్రీసత్యసాయి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో రాగులు, అనంతపురం, నంద్యాల, వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో జొన్నల కొనుగోలును చేపడుతోంది. ఆర్బీకేల ద్వారా ఈ-క్రాప్ ప్రామాణికంగా వ్యవసాయ క్షేత్రం నుంచే పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ రైతుకు బాసటగా నిలుస్తోంది. వాటిని ప్రాసెసింగ్ చేసి తిరిగిన స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీ చేస్తోంది. దీంతోపాటు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి రాగులును దిగుమతి చేసుకుంటోంది. ఈ ఖరీఫ్‌లో ఇప్పటివరకు రాగులు, జొన్నలు కలిపి సుమారు 6,500 టన్నులకుపైగా సేకరించింది.

మరో 20 వేల టన్నుల జొన్నలు..


నంద్యాల జిల్లాలో జొన్నలు మంచి దిగుబడులు వచ్చాయి. రైతుల నుంచి డిమాండ్ ఉండటంతో అదనంగా జొన్నల కొనుగోలుకు పౌరసరఫరాల సంస్థ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. దీని ప్రకారం మరో 20వేల టన్నుల వరకు జొన్నలను సేకరించనుంది. ఇందులో రాష్ట్ర అవసరాలకు పోనూ మిగిలిన వాటిని ఎఫ్‌సీఐకి అందించనుంది. తద్వారా రాష్ట్ర రైతులకు పూర్తి మద్దతు ధర దక్కేలా చర్యలు చేపడుతోంది.

గోధుమ పిండికి డిమాండ్.

పీడీఎస్‌లో అందిస్తున్న ఫోర్టిఫైడ్ గోధుమ పిండికి మంచి డిమాండ్ ఉంది. ప్రతి నెలా 2,500 టన్నుల నుంచి 5 వేల టన్నుల వరకు వినియోగం ఉంటోంది. ఇదే గోధుమ పిండిని కేంద్ర ప్రభుత్వం భారత్ బ్రాండ్ పేరుతో కిలో రూ.27.50కు ఇస్తుంటే.. రాష్ట్రంలో కిలో రూ.16కే అందిస్తున్నారు. మార్కెట్ రేటు కంటే తక్కువకే నాణ్యమైన గోధుమపిండి లభిస్తుండటంతో కార్డుదారులు తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

పౌష్టికాహారం అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యం..

పీడీఎస్‌లో పౌష్టికాహారం అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యం. అందుకే నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు రాగులు, జొన్నలు, ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని సరఫరా చేస్తున్నాం. రాగులకు వినియోగదారుల్లో మంచి డిమాండ్ ఉంది. అయితే వాటిని మిల్లింగ్ చేసుకుని వాడుకునేందుకు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు వచ్చాయి. అందుకే రాగిపిండిని ఇవ్వాలని నిర్ణయించాం. కిలో ప్యాకెట్ల రూపంలో రూ.11కే మార్చి నుంచి అందుబాటులోకి తెస్తున్నాం. రాగులను ప్రాసెసింగ్ చేసి.. పిండి ఆడించి, ప్యాకింగ్, రవాణా చేసేందుకయ్యే ఖర్చులను మాత్రమే రేటుగా నిర్ధారించాం. – హెచ్.అరుణ్ కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ



క్రయోజనిక్ ఇంజన్‌ను పరీక్షిస్తున్న దృశ్యం.(ఇన్‌సెట్లో) ఇంజన్

‘సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్’ టెస్టు సక్సెస్

గగన్‌యాన్ మిషన్‌లో మరో ఘనత సాధించిన ఇస్రో

చెన్నై: భారత్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు పడింది. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంలో మానవ సహిత అంతరిక్ష యాత్రలకు తోడ్పడే ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్ తయారీలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో ఘనత సాధించింది. ఈ లాంచ్ వెహికల్‌కు గుండెకాయ లాంటి ‘సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్’ను విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని ఇస్రో బుధవారం వెల్లడించింది. తమ పరీక్షలో క్రయోజనిక్ ఇంజన్ పూర్తి సంతృప్తికరమైన పనితీరు కనబర్చిందని, అంతరిక్ష యాత్రలకు అర్హత సాధించిందని వెల్లడించింది. గగన్‌యాన్ యాత్రకు ఈ ఇంజన్ అనువైందని తేలినట్లు స్పష్టం చేసింది. పలు రకాల కఠిన పరీక్షల తర్వాత ఈ క్రయోజనిక్ ఇంజన్ భద్రతా ప్రమాణ పత్రాన్ని పొందిందని పేర్కొంది. మానవ రహిత గగన్‌యాన్-1 యాత్రను 2024లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రయోగం సఫలమైతే మానవ సహిత యాత్ర చేపట్టనున్నారు. ముగ్గురు వ్యోమగాములను భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలోకి చేర్చి, మళ్లీ క్షేమంగా వెనక్కి తీసుకురావడం గగన్‌యాన్ మిషన్ లక్ష్యం. మొత్తం మూడు రోజుల్లో ప్రయోగం పూర్తవుతుంది. ఈ ప్రయోగంలో వ్యోమగాములను ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్‌లో అంతరిక్షంలోకి చేర్చాలని నిర్ణయించారు. ఇందులో ఘన, ద్రవ, క్రయోజనిక్ దశలు ఉంటాయి. ఈ క్రయోజనిక్ దశలో లాంచ్ వెహికల్‌ను గమ్యస్థానానికి చేర్చడంలో సీఈ20 ఇంజిన్ పాత్ర అత్యంత కీలకం. ఈ ఇంజన్‌పై ఏడో వాక్యూమ్ టెస్టును ఈ నెల 14న తమిళనాడు మహేంద్రగిరిలోని హై ఆల్టిట్యూడ్ టెస్ట్ ఫెసిలిటీలో నిర్వహించినట్లు ఇస్రో వెల్లడించింది. గగన్‌యాన్ మిషన్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని అధిగమించామని బుధవారం ‘ఎక్స్’లో పోస్టు చేసింది. సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్ యాక్సెప్టెన్స్ టెస్టులు, ఫైర్ టెస్టులు ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయి.

రష్యాకు ఎదురుదెబ్బ

శిక్షణాప్రాంతంపై క్షిపణి దాడుల్లో 60 మంది సైనికుల దుర్మరణం

కీవ్: ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యాకు బుధవారం భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒక కమాండర్ రాక కోసం శిక్షణా ప్రాంతం వద్ద గుమిగూడిన సైనికులపై రెండు క్షిపణులు వచ్చి పడ్డాయి. దీంతో 60 మంది రష్యా సైనికులు మరణించారని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. అయితే ఈ ఘటనపై రష్యా రక్షణ మంత్రి సెర్గియో షాయిగూ నోరు మెదపలేదు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీకి కొద్దిసేపటికి ముందే ఈ దాడి జరగడం గమనార్హం. ఇతర ప్రాంతాల్లో రష్యా సైన్యం విజయాలను పుతిన్‌కు వివరించిన సెర్గియో ఈ దాడి వివరాలను మాత్రం వెల్లడించలేదు. రష్యా ఆక్రమణలో ఉన్న ఉక్రెయిన్ తూర్పు ప్రాంతం డొనెట్క్స్ రీజియన్‌లో ఈ దాడి ఘటన చోటుచేసుకుంది. సెర్బియా ప్రాంతంలో ఉండే 36వ రైఫిల్ బ్రిగేడ్ ట్రుడోవ్‌స్కె గ్రామంలో ఒక మేజర్ జనరల్ రాకకోసం వేచి చూస్తుండగా ఈ దాడి జరిగింది. ఒకే చోట డజన్లకొద్దీ జవాన్లు విగతజీవులుగా పడి ఉన్న వీడియో ఒకటి అంతర్జాతీయ మీడియాలో ప్రసారమైంది. అమెరికా తయారీ హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్(హిమార్స్) నుంచి దూసుకొచ్చిన మిస్సైళ్లే ఈ విధ్వంసం సృష్టించాయని రష్యా చెబుతోంది. మరోవైపు రష్యా వ్యతిరేకంగా సైనిక వార్తలు రాసే బ్లాగర్ ఆండ్రీ మొరజోవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన టెలిగ్రామ్ చానెల్‌కు లక్ష మంది చందాదారులు ఉన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో చాలా ప్రాంతాల్లో రష్యా తోకముడిచిందంటూ, వేల మంది సైనికులు చనిపోయారని తాను రాసిన విశ్లేషణాత్మక కథనాలను వెంటనే తొలగించాలంటూ రష్యా సైన్యం నుంచి ఈయన చాన్నాళ్లుగా ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాడు. ఇంకెవరో వచ్చి చంపే బదులు తానే కాల్చుకుని చస్తానని తన బ్లాగ్‌లో రాశాడని వార్తలొచ్చాయి. ఇప్పటిదాకా యుద్ధంలో రష్యా 45వేలకుపైగా సైన్యాన్ని కోల్పోయిందని ‘బీబీసీ రష్యా’ తెలిపింది.



శంభు సరిహద్దు వద్ద రైతులపైకి ప్రయోగించిన భాష్పవాయు గోళం పేలిన దృశ్యాలు

దద్దరిల్లిన సరిహద్దులు

చర్చలు విఫలం.. మళ్లీ రోడ్డెక్కిన రైతులు

- శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- బాష్పవాయు గోళాలు ప్రయోగించిన పోలీసులు
- ‘ఢిల్లీ చలో’కి రెండు రోజుల విరామం
- మరోసారి చర్చలకు ఆహ్వానం

చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, వ్యవసాయ రుణాల రద్దుతో సహా ఇతర డిమాండ్లపై రైతు సంఘాలు, కేంద్ర మంత్రుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. రెండు రోజుల విరామం తర్వాత బుధవారం నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సమస్యలు పరిష్కారం అయ్యేదాకా తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. రైతులు, పోలీసుల మధ్య ఘర్షణలతో పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్లు దద్దరిల్లిపోయాయి. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీ సంఖ్యలో ట్రాక్టర్ ట్రాలీలు, మినీ వ్యాన్లు, జేసీబీలపై నిరసనకారులు తరలివచ్చారు. సరిహద్దుల్లో వేలాది మంది గుమికూడారు. రక్షణ వలయాన్ని ఛేదించుకొని ముందుకు దూసుకెళ్లడానికి ప్రయత్నించారు. వాహనాలతో బారీకేడ్లను ధ్వంసం చేసే ప్రమాదం ఉందని పోలీసులు అనుమానించారు. నిరసనకారులను చెదరగొట్టడానికి హరియాణా పోలీసులు డ్రోన్‌తో బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. శంభు బోర్డర్ పాయింట్ వద్ద బుధవారం మూడుసార్లు బాష్పవాయువు ప్రయోగం చోటుచేసుకుంది. డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా పెంచారు. ఖనౌరీలోనూ రైతుల ఆందోళన కొనసాగింది. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఢిల్లీ వెళ్లడానికి తమను అనుమతించడానికి డిమాండ్ చేశారు. పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి, వారిని చెదరగొట్టారు. బాష్పవాయువు ప్రభావం నుంచి తప్పించుకోవడానికి చాలామంది రైతులు మాస్కులు, కళ్లద్దాలు ధరించారు. రైతుల ఆందోళన మళ్లీ ప్రారంభం కావడంతో దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లోనూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పలు రహదారులపై ఆంక్షలు విధించారు. మరోవైపు ‘ఢిల్లీ చలో’ కార్యక్రమాన్ని రెండు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రైతు సంఘం నాయకుడు శర్వన్ సింగ్ చెప్పారు. తదుపరి కార్యాచరణను శుక్రవారం సాయంత్రం ఖరారు చేస్తామని తెలిపారు.

ఘర్షణలో యువ రైతు మృతి

ఖనౌరీ బోర్డర్ పాయింట్ వద్ద రైతులు, పోలీసులు మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. రైతులు ముందుకెళ్లకుండా పోలీసు అడ్డుకున్నారు. ఈ ఘటనలో పంజాబ్‌లోని భటిండా జిల్లా బాలోక్ గ్రామానికి చెందిన శుభ్‌కరణ్ సింగ్(21) అనే రైతు మరణించాడని, మరికొందరు గాయపడ్డారని రైతు సంఘాల నేతలు చెప్పారు. ఈ నెల 13న ‘ఢిల్లీ చలో’ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత ఘర్షణలో రైతు మృతి చెందడం ఇదే మొదటిసారి అని తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లో నిప్పంటించుకున్న రైతు

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఓ రైతు ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించాడు. రైతులు బుధవారం ఇక్కడ భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న బ్రిజ్‌పాల్ అనే రైతు తనను తాను నిప్పంటించుకున్నాడు. మిగిలిన రైతులు వెంటనే అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. అతడిని ఆసుపత్రికి తరలించారు. బ్రిజ్‌పాల్‌కు ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు చెప్పారు.

నేతలను గ్రామాల్లోకి రానివ్వం: తికాయత్

రైతులను ఢిల్లీకి వెళ్లనివ్వకపోతే ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులను గ్రామాల్లోని రానివ్వబోమని భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) అధికార ప్రతినిధి రాకేశ్ తికాయత్ హెచ్చరించారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మీరట్‌లో రైతులు బుధవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తికాయత్ మాట్లాడారు.

చర్చలకు రండి: మంత్రి

డిమాండ్ల సాధనకు రైతులు మళ్లీ ఆందోళనకు దిగడంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా బుధవారం స్పందించారు. రైతు నేతలతో ఐదో విడత చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

చెరకు ఎఫ్‌ఆర్‌పీ క్వింటాల్‌కు రూ.340

న్యూఢిల్లీ: చెరకు పంటకు ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్(ఎఫ్‌ఆర్‌పీ)ని క్వింటాల్‌కు మరో రూ.25 పెంచనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో క్వింటాల్ చెరకు ఎఫ్‌ఆర్‌పీ రూ.340కి చేరుకోనుంది. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే 2024–25 సీజన్‌లో ఈ ధరను అమలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సమావేశంలో బుధవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. చెరకు రైతులకు చక్కెర మిల్లులు చెల్లించే కనిష్ట ధరనే ఎఫ్‌ఆర్‌పీ అంటారు. అంతరిక్ష రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.



బినాకా గీత్‌మాలా

అమీన్ సయానీ ఇకలేరు

ముంబై: నాలుగు దశాబ్దాలకుపైగా కోట్లాది మంది భారతీయ రేడియో శ్రోతలను తన గాత్రంతో కట్టిపడేసిన దిగ్గజ అనౌన్సర్ అమీన్ సయానీ ఇక లేరు. 91 ఏళ్ల సయానీ ముంబైలో మంగళవారం సాయంత్రం గుండెపోటు కారణంగా తుదిశ్వాస విడిచారని ఆయన కుమారుడు రాజిల్ చెప్పారు. ‘‘సాయంత్రం ఆరింటపుడు గుండెపోటు రాగానే హుటాహుటిన హెచ్ఎన్ రిలయన్స్ ఆస్పత్రికి తరలించాం. ఎంతగా ప్రయత్నించినా వైద్యులు ఆయనను కాపాడలేకపోయారు’’ అని కుమారుడు రాజిల్ వెల్లడించారు.

బినాకా గీత్‌మాలాతో దేశవ్యాప్తంగా ఖ్యాతి

‘నమస్తే బెహ్నో ఔర్ భాయియో, మై ఆప్కా దోస్త్ అమీన్ సయానీ బోల్ రహా హూ’’ అంటూ మొదలయ్యే ఆయన గాత్రరుచికి మంత్రముగ్ధులు కానివారే లేరు. రేడియో సిలోన్‌లో 1950వ దశకం ఆయనకు స్వర్ణయుగం. 1952 డిసెంబర్‌లో మొదలైన ‘బినాకా గీత్‌మాలా’ కార్యక్రమాన్ని అద్భుతమైన తన గాత్రంతో కోట్లాది మంది శ్రోతలకు ఫేవరెట్ ప్రోగ్రామ్‌గా మార్చేశారు. అలనాటి మేటి హిందీ సినిమా పాటలను పరిచయం, ప్రసారంచేస్తూ సాగే ఈ కార్యక్రమం 1952 నుంచి 1988దాకా నిరాటంకంగా ప్రతి బుధవారం ప్రసారమయ్యేది. 1988లో బినాకా గీత్‌మాలాను ఆలిండియా రేడియో వారి వివిధ్ భారతిలోకి మార్చారు. 1994దాకా ఆ కార్యక్రమం అత్యంత ప్రజాదరణ పొందిన ప్రోగ్రామ్‌గా కీర్తి గడించిందంటే దానికి కారణం సయానీయే. అత్యంత ఎక్కువకాలం నడిచిన కార్యక్రమంగానూ అది రికార్డు సృష్టించింది. ప్రసారమయ్యే పాటల్లోని విశిష్టతను తనదైన విశ్లేషణతో చెబుతూ శ్రోతలను ఆకట్టుకుంటూ ‘రేడియో మ్యాస్ట్రో’గా ప్రసిద్ధికెక్కారు.

50,000 ప్రోగ్రామ్‌లు, 19వేలకుపైగా జింగిల్స్

1932 డిసెంబర్ 21వ తేదీన ముంబైలో ‘బహుభాషా’ కుటుంబంలో జన్మించిన సయానీ 13 ఏళ్ల వయసులోనే తల్లికి ‘రెహ్బర్’ పక్షపత్రికలో రచనలో సాయపడేవారు. ఆలిండియా రేడియో బాంబేలో చిన్నారుల కార్యక్రమంలో పాల్గొనేవారు. కెరీర్ మొదట్లో ఇంగ్లిష్ బ్రాడ్‌కాస్టర్‌గా పనిచేశారు. స్వాతంత్ర్యం సిద్ధించాక హిందీలోకి మారారు. రేడియోలో ఏకంగా 50,000 ప్రోగ్రామ్‌లు, 19వేలకుపైగా జింగిల్స్ చేశారు. తన సోదరుడు హమీద్ మరణం తర్వాత ఆయన నుంచి బాధ్యతలు తీసుకుని ఎనిమిదేళ్లపాటు బోర్న్‌వీటా క్విజ్ పోటీని విజయవంతంగా నిర్వహించారు. సంగీత శిఖరాలు లతా మంగేష్కర్, కిశోర్ కుమార్‌లతో ఈయన చేసిన ఇంటర్వ్యూలు ఆనాడు అమిత ఆదరణ పొందాయి. సయానీ మరణంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీసహా పలు రంగాల ప్రముఖులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

● ప్రత్యేక కథనం ‘ఫ్యామిలీ’లో..

పాకిస్తాన్‌లో సంకీర్ణమే

- చేతులు కలిపిన పీఎంఎల్-ఎన్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ
- నూతన ప్రధానిగా షహబాజ్ షరీఫ్, అధ్యక్షుడిగా జర్దారీ
- ఇరు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం



షహబాజ్



జర్దారీ

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితికి ఎట్టకేలకు తెరపడింది. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు, అధికార పంపకంపై పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్(పీఎంఎల్-ఎన్), పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) ఎట్టకేలకు తుది ఒప్పందానికి వచ్చాయి. నూతన ప్రధానమంత్రిగా పీఎంఎల్-నేత షహబాజ్ షరీఫ్(72), అధ్యక్షుడిగా పీపీపీ సీనియర్ నాయకుడు అసిఫ్ అలీ జర్దారీ(68) బాధ్యతలు చేపట్టనున్నారు. రెండు పార్టీల మధ్య మంగళవారం అర్ధరాత్రి కీలక చర్చలు జరిగాయి. అనంతరం పీపీపీ చైర్మన్ బిలావల్ భుట్టో మీడియాతో మాట్లాడారు. పీఎంఎల్-ఎన్, పీపీపీ భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే సంకీర్ణ ప్రభుత్వ ప్రధానిగా షహబాజ్ షరీఫ్, అధ్యక్షుడి పదవికి తమ ఉమ్మడి అభ్యర్థిగా అసిఫ్ అలీ జర్దారీ పేర్లను ఖరారు చేసినట్లు ప్రకటించారు. తమ కూటమికి పార్లమెంట్‌లో తమకు సంఖ్యా బలం ఉందని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలమని బిలావల్ భుట్టో స్పష్టం చేశారు. అయితే, ఎంతమంది ఎంపీలు మద్దతు ఇస్తున్నారన్న విషయాన్ని ఆయన బహిర్గతం చేయలేదు. ఒప్పందం ప్రకారం.. జాతీయ అసెంబ్లీలో స్పీకర్ పదవికి పీఎంఎల్-ఎన్ పార్టీకి, డిప్యూటీ స్పీకర్ పదవి పీపీపీకి, సెనేట్‌లో చైర్మెన్ పదవి పీపీపీకి లభించనుంది. చర్చలు సానుకూలంగా ముగించినందుకు పీఎంఎల్-ఎన్, పీపీపీ నేతలకు షహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి పదవుల విషయంలో పీపీపీ నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని అన్నారు. అసిఫ్ అలీ జర్దారీ 2008 నుంచి 2013 దాకా పాకిస్తాన్ అధ్యక్షుడిగా పనిచేశారు. మరోసారి అదే పదవికి చేపట్టబోతున్నారు. నవాజ్ షరీఫ్ సోదరుడైన షహబాజ్ షరీఫ్ సైతం గతంలో ప్రధానమంత్రిగా సేవలందించారు. పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీకి ఫిబ్రవరి 8న జరిగిన ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్ జరిగిందని, ఈ ఎన్నిలను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలంటూ మాజీ సైనికాధికారి అలీ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఇలాంటి పిటిషన్ పబ్లిసిటీ స్టంట్ అంటూ కొట్టేసింది.

తూర్పు లద్దాఖ్‌పై భారత్, చైనా సైనిక చర్చలు

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో మూడున్నరేళ్ల క్రితం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను సడలించేందుకు భారత్, చైనా 21వ విడత సైనిక చర్చలు జరిపాయి. చర్చల్లో ఎలాంటి కీలకమైన ఉమ్మడి నిర్ణయాలు తీసుకోలేకపోయారు. వాస్తవాధీన రేఖ వెంబడి ఛుషుల్-మోల్డో బోర్డర్ పాయింట్ వద్ద చైనా వైపు భూభాగంలో ఫిబ్రవరి 19వ తేదీన ఈ చర్చలు జరిగాయి. భారత్ తరఫున లేహ్ కేంద్రంగా ఉన్న 14వ కోర్ లెఫ్టినెంట్ జనరల్ రషీమ్ బాలీ, చైనా తరఫున దక్షిణ గ్జిన్‌జియాంగ్ సైనిక జిల్లా కమాండర్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. కోర్ కమాండర్ స్థాయిలో జరిగిన ఈ చర్చల్లో ఇరు దేశాల సైనికుల మొహరింపును ఉపసంహరించుకోవడంపై ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే సైనిక, దౌత్య కమ్యూనికేషన్లను ఇకమీదటా కొనసాగించాలని నిర్ణయించారు. స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగాయని భారత విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది. దెస్పాంగ్, దెమ్‌చోక్ ప్రాంతాల్లో బలగాల ఉపసంహరణ అంశమూ చర్చకొచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అక్టోబర్‌లో 20వ విడత చర్చలు జరిగాయి. తూర్పు లద్దాఖ్‌లో సరిహద్దు వెంట సున్నితమైన పరిస్థితులు నెలకొన్నాయని జనవరిలో ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే వ్యాఖ్యానించడం తెల్సిందే. 2020 ప్రథమార్థంలో తూర్పు లద్దాఖ్‌లో ఉన్న సాధారణ స్థాయికి ప్రస్తుత ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నాయి.

మోదీ రామరాజ్యంలో దళితులు, బీసీలకు దక్కని ఉద్యోగాలు

కాన్పూర్/ఉన్నావ్(యూపీ): జనాభాలో దాదాపు 90 శాతమున్న బీసీలు, దళితులు, మైనార్టీలకు మోదీ ‘రామరాజ్యం’లో సరైన ఉద్యోగాలు దక్కలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్‌జోడో న్యాయ్‌యాత్రలో భాగంగా బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో కార్యకర్తలు, మద్దతుదారులనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. ‘‘ జనాభాలో 50 శాతం బీసీలు, 15 శాతం దళితులు, 8 శాతం గిరిజనులు, 15 శాతం మైనారిటీలు ఉన్నారు. మొత్తంగా దాదాపు 90 శాతం జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వీరికి సరైన ఉద్యోగాలు దక్కనపుడు ఇదేమీ మోదీ రామరాజ్యం?’ అని ప్రశ్నించారు. ‘‘ కులం పేరిట దళితులు, బీసీలు వివక్షకు గురికావడంతో మీడియాలో, పెద్ద పరిశ్రమల్లో, ఉన్నతోద్యోగాల్లో వారికి సరైన ప్రాధాన్యత లేదు. అణగారిన వర్గాలు ఆకలికి అలమటించి మరణిస్తున్నారు. అయోధ్యలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం చూశారుగా. ఆరోజు విచ్చేసిన అతిథుల్లో వెనకబడివారు, దళితులు, గిరిజనులు ఎంతమంది?. గిరిజనురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, దళితుడైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లకు ఆరోజు లోనికి అనుమతి లేదు. అందుకే వెనకబడిన వర్గాల సంక్షేమం, వారి ఆర్థిక స్థితిగతులు తెల్సుకునేందుకే కులగణన చేపట్టదలిచాం. ఇది దేశాభివృద్ధిలో విప్లవాత్మకమైన ముందడుగు’’ అని రాహుల్ అన్నారు. ‘‘ అదానీ, అంబానీ, టాటా, బిర్లా.. ఇలా దేశంలో ఒక రెండు, మూడు శాతం మంది వ్యక్తుల వద్దే దేశ సంపదలో సింహభాగం పోగుబడింది. వీళ్లే నూతన భారతావనికి మహారాజులు’’ అని ఆరోపించారు. 2016లో పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, అగ్నివీర్ పథకంలపైనా రాహుల్ విమర్శలు గుప్పించారు. ‘‘ కొన్నిసార్లు మీ ప్రశ్నాపత్రం లీక్ అవుతుంది. ఇంకొందరు ఉద్యోగాలు కోల్పోతారు. హఠాత్తుగా జీఎస్‌టీ అని కొత్త పన్నుల విధానం ఒకటి వస్తుంది. పెద్ద నోట్లను రద్దు చేసి ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తారు. తీరా సైన్యంలో అయినా చేరదామంటే అగ్నివీర్ యోజన పేరిట శాశ్వత నియామకాలకు చిల్లుచీటీ పాడుతారు’’ అని రాహుల్ విమర్శించారు.

ఫిబ్రవరి 26- మార్చి 1 దాకా యాత్రకు బ్రేక్

ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 దాకా న్యాయ్ యాత్రకు బ్రేక్‌పడనుంది. బ్రిటన్‌లో తాను చదువుకున్న కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో రాహుల్ ప్రసంగం, ఢిల్లీలో పార్టీ కీలక సమావేశాల నేపథ్యంలో న్యాయ్‌యాత్రకు విరామం ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ చెప్పారు. నేడు, రేపు సైతం యాత్ర కొనసాగదు. ఫిబ్రవరి 24వ తేదీన మొరాదాబాద్‌లో యాత్ర మొదలవుతుంది. ఫిబ్రవరి 27, 28న కేంబ్రిడ్జ్‌లో రాహుల్ ప్రసంగిస్తారు. మార్చి రెండో తేదీన ధోల్‌పూర్‌లో యాత్ర పునఃప్రారంభమవుతుంది. మార్చి ఐదున ఉజ్జయిని మహాకాలేశ్వర్ ఆలయాన్ని దర్శిస్తారు.

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు 17 సీట్లు

లక్నో: విపక్షాల ‘ఇండియా’ కూటమిలో మిత్రపక్షాలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల పొత్తు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో ఓ కొలిక్కి వచ్చింది. చాన్నాళ్లుగా సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిగి చివరకు బుధవారం తమ సీట్ల పంపకాలపై ప్రకటన చేశాయి. ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉండగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ కాంగ్రెస్‌కు 17 చోట్ల పోటీచేసే అవకాశం ఇచ్చింది. ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ ఉత్తమ్ పటేల్, ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర చౌదరి, కాంగ్రెస్ యూపీ చీఫ్ అజయ్ రాయ్, ఏఐసీసీ యూపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ అవినాశ్ పాండేల భేటీ తర్వాత ఈ ప్రకటన వెలువడింది. ‘మేం 17 చోట్ల పోటీ చేస్తాం. మిగతా 63 స్థానాల్లో ఎస్పీ, ఇతర కూటమి భాగస్వామ్య పార్టీలు బరిలో నిలుస్తాయి’’ అని కాంగ్రెస్ నేత వినాశ్ పాండే చెప్పారు.


ప్రియాంకా గాంధీ చొరవతో కుదిరిన ఒప్పందం

యూపీలో సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఒక అడుగు ముందుకేసి ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌తో ఫోన్‌లో మంతనాలు జరిపారని, దీంతో సీట్ల పంపకాల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శ్రవస్తీ నియోజకవర్గంలో తామే పోటీ చేస్తామని పట్టుబట్టి ఎస్పీ సాధించింది. కాంగ్రెస్ అదనంగా సీతాపూర్, బారాబంకీల్లో పోటీచేసే అవకాశం సాధించింది. వీటితోపాటు అమేథీ, రాయ్‌బరేలీ, కాన్పూర్ నగర్, వారణాసి, షహరాన్‌పూర్, అమ్రోహా, సిక్రీ, మహారాజ్‌గంజ్, బన్స్‌గావ్, బులంద్‌షెహర్, ఘజియాబాద్, మథుర, ప్రయాగ్‌రాజ్, దేవరియా, ఝాన్సీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పోటీచేయనుంది. మరోవైపు, మధ్యప్రదేశ్‌లో ఖజురహోలో మాత్రమే ఎస్పీ పోటీచేయనుంది. మిగతా 28 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు ఎస్పీ మద్దతు ఇవ్వనుంది.

అమెరికా విమానంలో వ్యక్తి అలజడి..

టేపుతో కట్టేసిన తోటి ప్రయాణికులు

వాషింగ్టన్: అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలో ఓ ప్రయాణికుడు తీవ్ర అలజడి సృష్టించాడు. విమానం గాల్లో ఎగురుతుండగానే అత్యవసర ద్వారం తెరిచేందుకు ప్రయత్నించాడు. తోటి ప్రయాణికులు భయాందోళనతో గట్టిగా అరుస్తున్నా పట్టించుకోలేదు. దాంతో వారంతా అతడిని బంధించి, బలంతంగా సీట్లో కూర్చోబెట్టి, మళ్లీ లేవకుండా టేపుతో కట్టేశారు. అమెరికాలో న్యూమెక్సికో రాష్ట్రంలోని అల్బుక్వెర్కీ సిటీ నుంచి షికాగోకు బయలుదేరిన 1219 విమానంలో(బోయింగ్ 737) ఇటీవలే ఈ ఘటన చోటుచేసుకుంది. అల్బుక్వెర్కీ ఎయిర్‌పోర్టు నుంచి విమానం బయలుదేరిన 30 నిమిషాలకు సదరు ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్ తెరిచేందుకు ప్రయత్నించాడు. తోటి ప్రయాణికులంతా అప్రమత్తమై అతడిని అడ్డుకున్నారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించి, అల్బుక్వెర్కీ ఎయిర్‌పోర్టులో దించారు. గందరగోళానికి కారణమైన ప్రయాణికుడిని కిందికి దించి, పోలీసులకు అప్పగించారు. అతడు ఎందుకలా చేశాడన్నదానిపై పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.



న్యాయ కోవిదుడు నారీమన్ కన్నుమూత

- ఎమర్జెన్సీని ఎదిరించి ఏఎస్‌జీగా రాజీనామా
- కీలక కేసుల వాదనలో కీలకపాత్ర

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలీ శామ్ నారీమన్ (95) మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. న్యాయ నిపుణుడుగా పేరుగాంచిన నారీమన్ 1929లో పార్సీ దంపతులైన బైరాంజీ నారీమన్, బానో నారీమన్‌లకు మయన్మార్‌లో జన్మించారు. బాంబేలో ప్రాథమిక విద్యాభ్యాసంతోపాటు ప్రభుత్వ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. బాంబే హైకోర్టులో న్యాయవాద వృత్తి ప్రారంభించిన నారీమన్ 1971లో సుప్రీంకోర్టులో సీనియర్ హోదా పొందారు. 1972 మే నుంచి 1972 జూన్ 25 వరకూ సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్ పనిచేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తన పదవికి మరుసటి రోజే రాజీనామా చేశారు. పలు కీలక కేసులు వాదించిన నారీమన్‌ను కేంద్ర ప్రభుత్వం 2007లో పద్మభూషణ్‌తో సత్కరించింది. 1999లో రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రపతి నామినేట్ చేశారు. 1991లో బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా 1994లో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ కమర్షియల్ ఆర్బిట్రేషన్ అధ్యక్షునిగా ఉన్నారు. 1998లో లండన్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌లో సభ్యుడయ్యారు. 1995 నుంచి 1997 వరకూ ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్ కార్యనిర్వాహక కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు. ఫాలీ నారీమన్ కుమారుడు రోహింగ్టన్ నారీమన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు.

నిర్ణయమే శాసనం

ఫాలీ నారీమన్ చివరి వరకూ తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారుగానీ లాయర్‌గా రాజీ పడలేదు. ఎమర్జెన్సీ సమయంలో కేంద్రాన్ని కాదని అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా రాజీనామా చేసిన ఆయన నర్మద రిహాబిలిటేషన్ కేసులో గుజరాత్ ప్రభుత్వం తరపు న్యాయవాదిగా ఉంటూ క్రిస్టియన్లపై దాడులు నిరసిస్తూ ఆ కేసు నుంచి తప్పుకొన్నారు. తొలుత తాను మానవతావాదినని తర్వాతే న్యాయవాదిని అని ఆ సమయంలో అభిప్రాయపడ్డారు. ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని ఎదిరించినందుకు నారీమన్‌కు ఇల్లు అద్దెకు ఇవ్వడానికి ఢిల్లీలో ఎవరూ ముందుకురాకపోవడంతో స్థిరమైన నివాసం కోసం ఎంతో కష్టపడ్డారు. ‘వెన్నెముక లేనితనం కంటే నిరాశ్రయమే మేలు’ అని నారీమన్ వ్యాఖ్యానించారు. డిసెంబరు 2009లో జస్టిస్ ప్రసాద్, జస్టిస్ దినకరన్‌ల నియామకాల సమయంలో హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుల సమీక్ష, బహిరంగ చర్చ అనంతరమే న్యాయ నియామకాలకు సిఫార్సులు చేపట్టాలని భావిస్తున్నట్లు జ్యూడీషియల్ అకౌంటబిలిటీపై కమిటీ పేర్కొంది. ఈ ప్రకటనపై రాం జఠ్మలానీ, శాంతి భూషణ్, అనిల్ దివాన్, కామిని జైశ్వాల్, ప్రశాంత్ భూషణ్‌లతోపాటు నారీమన్ సంతకం చేశారు.

> “ఫాలీ నారీమన్ అత్యుత్తమ న్యాయవాదులు, మేధావుల్లో ఒకరు. సామాన్య పౌరులకు న్యాయం జరిగేలా తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన మృతి నన్నెంతో బాధించింది. నారీమన్ ఆత్మకు శాంతి కలగాలి”
> - ప్రధాని నరేంద్ర మోదీ

> “నారీమన్ మరణానికి సంతాపం తెలుపుతున్నా. చట్టంలో గొప్ప దిగ్గజమైన నారీమన్ మృతి చాలా విచారకరం”
> సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

కీలక కేసులు వాదన

తన సుదీర్ఘ కెరియర్‌లో నారీమన్ అనేక కీలక కేసులు వాదించారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కేసులో ఆమె బెయిలు పొందడంలో కీలకవాదనలు చేశారు (అనంతరం ఆ బెయిలు రద్దయింది). భోపాల్ గ్యాస్ ఘటనలో యూనియన్ కార్బైడ్ తరఫున వాదించిన నారీమన్ తన తప్పును తదనంతరం అంగీకరించడానికి వెనకాడలేదు. 47 కోట్ల డాలర్ల పరిహారం కోర్టు వెలుపల బాధితులకు అందించేలా సంస్థతో ఒప్పందం కుదర్చడంలో కీలకపాత్ర పోషించారు. ఏఓఆర్ అసోసియేషన్ కేసులో తన వాదనా పటిమ అనంతరమే ఉన్నత న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తుల నియామకం సుప్రీంకోర్టు చేపట్టడం ప్రారంభించింది. అయితే తదనంతరం తన ఆత్మకథ ‘బిఫోర్ మెమరీ ఫేడ్స్’లో మాత్రం న్యాయమూర్తుల నియామక విషయంలో ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు క్లోజ్ సర్క్యూట్ కాకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరినీ సంప్రదించాలని అభిప్రాయపడ్డారు.

ఫొటోలు తీసుకోవడం మహా పాపం

అఫ్గానిస్తాన్ సీనియర్ అధికారి స్పష్టీకరణ

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో 1996 నుంచి 2001 దాకా తాలిబన్లు అధికారం చెలాయించారు. అప్పట్లో దేశమంతటా టీవీలు, ఫొటోలపై నిషేధం అమలు చేశారు. మనుషులతో సహా జీవించి ఉన్న ప్రాణులను ఫొటోలు తీయడాన్ని, వాటిని ప్రదర్శించడాన్ని నిషేధించారు. ఇస్లాం ధర్మం ప్రకారం అది పాపమని తేల్చిచెప్పారు. అతిక్రమించినవారికి కఠిన శిక్షలు విధించారు. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితులు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా దళాలు వెనక్కి వెళ్లిపోయిన తర్వాత 2021లో అఫ్గానిస్తాన్‌ను తాలిబన్లు ఆక్రమించారు. తమదైన శైలిలో పరిపాలన సాగిస్తున్నారు. కాబూల్‌లో మంగళవారం జరిగిన ఓ సదస్సులో జర్నలిస్టులు ఫొటోలు తీస్తుండగా, న్యాయ శాఖ సీనియర్ అధికారి మొహమ్మద్ హాషీం షహీద్ వ్రార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు పెద్ద పాపం చేస్తున్నారు అంటూ హెచ్చరించారు. ‘మీడియా మిత్రులకు, అఫ్గానిస్తాన్ పౌరులకు ఒక విషయం చెప్పదల్చుకున్నా. ఫొటోలు తీసుకోవడంలో మీరంతా బిజీగా కనిపిస్తున్నారు. అనైతికత వైపు మళ్లుతున్నారు. ఫొటోలు తీసుకోవడం పాపకార్యం’ అని తేల్చిచెప్పారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



జ్యోతి ప్రజ్వలన

భవానీపురం: విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బుధవారం డీడీయు-జీకేవై, అలుమిని మీట్‌ను మంత్రి జోగి రమేష్, ఎంపీ కేశినేని నాని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.



ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ బుధవారం విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. -8లో▸



కోలాహలంగా తిరునాళ్ల

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల కోలాహలంగా కొనసాగుతోంది. ఆలయ ప్రవేశం చేసిన అమ్మవారిని బుధవారం వేకువ జాము నుంచే భక్తులు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

షూటింగ్ పోటీల్లో ఉమామహేష్‌కు రజతం



విజయవాడ స్పోర్ట్స్: ఖేలో ఇండియా జాతీయ అంతర విశ్వ విద్యాలయాల రైఫిల్ షూటింగ్ పోటీల్లో విజయవాడ షూటర్ మద్దినేని ఉమామహేశ్వరరావు రజత పతకం సొంతం చేసుకున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి అసోంలోని గువహటీలో జరుగుతున్న ఈ పోటీలకు కేఎల్ యూనివర్సిటీ నుంచి ఉమామహేష్ ప్రాతినిధ్యం వహించారు. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో 63.6 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగి, బుధవారం జరిగిన ఫైనల్స్‌లో టాప్-8 రెండో స్థానంలో నిలిచి రజత పతకం అందుకున్నారు. జాతీయ వర్సిటీ పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారుడు ఉమామహేష్‌ను కేఎల్ వర్సిటీ వీసీ ప్రదీప్‌వర్మ, స్పోర్ట్స్ డీన్ కె.హరికిషోర్ తదితరులు అభినందించారు.

బాడీబిల్డింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక




పెనమలూరు: జాతీయ స్థాయిలో జరగనున్న జూనియర్స్ మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేశామని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.మనోహర్, తాళ్లూరి అశోక్ తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు తమిళనాడులో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అశోక్ జిమ్‌లో బుధవారం ఎంపికలు నిర్వహించామని వివరించారు. 60 కిలోల విభాగంలో సీహెచ్.దినేష్ రెడ్డి, 65 కిలోల విభాగంలో ఎస్‌కె.సాహిల్, 75 కిలోల విభాగంలో కె.శ్రీనివాస్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ క్రీడాకారులను ఎస్ఐ రమేష్ అభినందించారు. అసోసియేషన్ సభ్యులు సీహెచ్.రాజు, ఈదా రాజేష్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

కేఆర్‌యూ బాల్ బ్యాడ్మింటన్ విజేత నలంద



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ విన్నర్ ట్రోఫీని విజయవాడ నలంద డిగ్రీ కళాశాల కైవసం చేసుకుంది. నలంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రెండో స్థానంలో వైవీఎస్ఆర్ డిగ్రీ ప్రభుత్వ కాలేజీ (కైకలూరు), మూడో స్థానంలో ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ(మచిలీపట్నం), నాల్గో స్థానంలో డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(మైలవరం) నిలిచాయి. టోర్నీ ఆర్గనైజర్‌గా నలంద కాలేజీ పీడీ ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. టోర్నీ చైర్‌పర్సన్ ఎం.అనురాధ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

వలకు చిక్కిన కొండచిలువ



చల్లపల్లి(అవనిగడ్డ): దివిసీమకు సాగు, తాగు నీటిని అందించే కృష్ణా ఈస్టర్న్ బ్యాంక్ కెనాల్ (ప్రధాన పంట కాలువ)లో ఇటీవల కొండ చిలువలు కొట్టుకొస్తున్నాయి. బుధవారం ఏకంగా 11 అడుగుల పొడవైన కొండచిలువ కొట్టుకొచ్చింది. నిమ్మగడ్డకు చెందిన మత్స్యకారుడు పీతా కోటేశ్వరరావు నిమ్మగడ్డ లాకుల వద్ద చేపల కోసం కట్టి ఉంచిన వలలో చిక్కుకుంది. స్థానికులు గమనించే సమయానికే వలలో చిక్కుకుని అది మృతి చెందింది. ఇటీవల పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్ ప్రహరీ వద్ద రెండు, ఎస్టీ కాలనీ వద్ద ఒకటి, రాముడుపాలెం డొంకలో ఒకటి చొప్పున కొండచిలువలు కనిపించాయి. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని పేర్కొంటున్నారు. నిమ్మగడ్డ, పురిటిగడ్డ, పాత నడకుదురు, నడకుదురు, వెలువోలు తదితర గ్రామాల ప్రజలు కాలువలో దిగాలంటే భయపడుతున్నారు.

అభివృద్ధి బడిబాట

- ఎన్టీఆర్ జిల్లాలో జోరుగా మనబడి నాడు - నేడు పనులు
- తొలి విడతలో 341 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి
- రూ.96.32 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- రెండో విడతలో 596 పాఠశాల్లో ఆధునికీకరణ పనులు
- రూ.240.55 కోట్లతో ప్రారంభమైన అభివృద్ధి పనులు
- వచ్చే వేసవి లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు



కొమ్మా సీతారామయ్య జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయిని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర విద్యారంగంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ స్థాయి బడిలో చదివేలా మనబడి నాడు - నేడుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. తొలి విడతలో రూ.95.32 కోట్లతో ఎన్టీఆర్ జిల్లాలోని 341 ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించింది. రెండో విడతలో రూ.240.55 కోట్ల అంచనాలతో మరో 596 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులను చేపడుతోంది. నాడు - నేడుతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, వర్చువల్ బోధన, టోఫెల్‌లో శిక్షణ, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ వంటి వాటిని అమలు చేస్తోంది. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద తదితర పథకాలను పేద పిల్లల కోసం అమలు చేస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది.

రెండో విడతలో

నాడు -నేడు కార్యక్రమం రెండో విడతలో భాగంగా జిల్లాలోని మొత్తం 596 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిలో 504 ప్రాథమిక, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు, తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 83 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పనులు వేగంగా జరుగుతున్నాయి.

500 పాఠశాల్లో పనులు పూర్తి

ఎన్టీఆర్ జిల్లాలో మొదటి విడతలో 341 పాఠశాలలకు సంబంధించి రూ.95.32 కోట్లతో చేపట్టిన పనులన్నీ పూర్తి కావటంతో అవి అందుబాటులోకి వచ్చాయి. రెండో విడతలో సుమారు 150 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ పాఠశాలలను త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానుంది. రెండో విడతలో మిగిలిన నాడు-నేడు పనులను ఈ ఏడాది మార్చి లోపు పూర్తి చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాలో రెండో విడత నాడు-నేడు పనులు వేగం అందుకున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆధునిక వసతుల కల్పన

'నాడు - నేడు' కార్యక్రమం ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మైనర్, మేజర్ మరమ్మతులు, ప్రహరీలు, కుర్చీలు, బెంచ్‌లు, గ్రీన్ బోర్డులు, ఫ్యాన్లు, లైట్లు, కిటికీలు, తలుపులు, ఆర్ఓ ప్లాంట్లు, టైల్స్‌తోపాటు సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్, బాలుర, బాలికలకు ప్రత్యేకంగా మరుగు దొడ్లు తదితర ఆధునిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. తొలి విడతలో జిల్లాలోని 341 పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించింది.



మైలవరంలో మనబడి నాడు-నేడు మొదటి విడతలో అభివృద్ధి చెందిన ఉన్నత పాఠశాల

పనులను వేగవంతం చేస్తున్నాం



ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. మనబడి నాడు - నేడు పేరుతో విద్యారంగంలో అద్భుత అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. జిల్లాలో మొదటి విడతలో చేపట్టిన పనులను పూర్తి చేశాం. రెండో విడత 596 విద్యాసంస్థల్లో నాడు - నేడు పనులు చేపట్టాం. ఈ పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేందుకు అన్ని చర్యలూ చేపట్టాం. ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి పనుల వేగాన్ని పెంచుతున్నాం

– యు.వి.సుబ్బారావు, డీఈఓ, ఎన్టీఆర్ జిల్లా

వేసవి లోపు పనులు పూర్తి చేస్తాం



రెండో విడత నాడు - నేడు పనులను వేసవిలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో కొత్తగా తీర్చిదిద్దిన వసతులు అందుబాటులోకి వస్తాయి. మొదటి విడత పనులు పూర్తి చేసి అందించాం. రెండో విడత పనులను వేగంగా చేపడుతున్నాం. ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేస్తున్నాం క్షేత్ర స్థాయిలో ఎంఈఓలు, డెప్యూటీ ఈఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

– గుడ్ల మహేశ్వరరావు, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, సమగ్రశిక్ష

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలో మార్చి మూడో తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని వైద్యాధికారులకు సూచించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ భవనంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, రూట్ సూపర్‌వైజర్లకు బుధవారం పునశ్చరణ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. పక్కా కార్యాచరణతో ఐదేళ్ల లోపు చిన్నారులు అందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. మొదటి రోజే వందశాతం లక్ష్యాన్ని చేరుకోవాలని పేర్కొన్నారు. వైద్య సేవలకు అందుబాటులో లేని పిల్లలు, గ్రామాలకు దూరంగా, పొలాలు, ఇటుక బట్టీలు, ఫౌల్ట్రీ ఫామ్‌లు, వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసే కూలీల పిల్లలకు సైతం పోలియో చుక్కలు వేయాలని పేర్కొన్నారు. అలాంటి ప్రాంతాలను హై రిస్క్‌గా గుర్తించి ప్రత్యేక ప్రణాళికతో మొబైల్ వాహనాల ద్వారా పోలియో చుక్కల మందు వేయాలని సూచించారు. అనంతరం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత పల్స్ పోలియో కార్యక్రమం నిర్వాహణ, ప్రణాళిక తయారీ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంద శాతం లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలను వైద్యాధికారులు, పర్యవేక్షకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సమన్వయ అధికారి డాక్టర్ సుమన్, జిల్లా గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

రైతన్నా సమయం లేదు

- ఈ-క్రాప్ నమోదు 99 శాతం పూర్తి
- ఈ-కేవైసీ పూర్తయింది 52 శాతమే..
- 23వ తేదీతో పూర్తి కానున్న గడువు
- ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించాలని వ్యవసాయశాఖ సూచన



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకులు (ఫైల్)

కంకిపాడు(పెనమలూరు): ఈ-క్రాప్ నమోదుకు సమయం మించిపోతోంది. కృష్ణా జిల్లాలో ఈ రబీకి సంబంధించి ఈ-క్రాప్ నమోదు 99 శాతం పూర్తవగా, ఈ-కేవైసీ 52 శాతమే నమోదైంది. ఈ-క్రాప్‌తో పాటు ఈ-కేవైసీ కూడా పూర్తి కావాల్సి ఉంది. లెక్కలు పక్కాగా ఉంటేనే సాగుకు ఊతం అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సఫలీకృతం అవుతాయి. ఈ రబీ సీజన్‌లో నూరుశాతం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. సాగవుతున్న పంటల వివరాల నమోదుతో రైతులకు ప్రభుత్వం చేయూత అందిస్తుంది. పంట చేతికొచ్చిన తరువాత కొనుగోలు విషయంలోనూ, విపత్తుల వేళ పంటలకు నష్టం వాటిల్లినా సాయం అందించేందుకు ఈ-క్రాప్, ఈ-కేవైసీ దోహదపడతాయి.

2,97,727 ఎకరాల్లో పంటల సాగు

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో 2,97,727 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా వరి, మినుము, పెసర, వేరు శనగ, మిర్చి, పసుపు ఇతర వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ ఈ-క్రాప్ నమోదు చేపట్టింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2,96,542 ఎకరాల్లో ఈ-క్రాప్ పూర్తయ్యి 99 శాతంగా నమోదైంది. గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకుల వేలిముద్రల అనుసంధానంతో పంటల సాగు, రైతులు, కౌలురైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ఈ-క్రాప్ నమోదుతో పాటు రైతు/కౌలుదారు వేలిముద్రలను కూడా సేకరించాల్సి ఉంది. గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ సహాయకుల వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. లేదా రైతు/కౌలు రైతు ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ఆధారంగా కూడా ఈ - కేవైసీ పూర్తి చేసుకునే సదుపాయం కల్పించారు. ఇప్పటికే జిల్లాలోని 48,996 మంది రైతులకు సంబంధించిన 1,42,709 ఎకరాలకు ఈ-కేవైసీ జరిగి 52 శాతంగా నమోదైందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 1,29,594 ఎకరాలకు ఇంకా ఈ-కేవైసీ పూర్తికావాల్సి ఉందని నిర్ధారించారు.

23తో ముగియనున్న గడువు

ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదుకు ఈ నెల 23న తుది గడువుగా నిర్ణయించారు. సమయం లేకపోవటంతో వ్యవసాయశాఖ అధికారులు త్వరితగతిన రైతులు ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త భాగస్వామ్యంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పంటల నమోదు పారదర్శకంగా సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న సాగు, రైతులు, కౌలురైతుల వివరాలపై స్పష్టత కూడా ఏర్పడుతుంది. సాధారణ సాగు, పంట సాగు, ఏ పంట సాగు జరిగింది? వంటి వివరాలను ఆర్‌బీకే స్థాయిలో అధికారులు నమోదు చేస్తున్నారు. ఈ-క్రాప్ ఆధారంగానే సీజన్‌కు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఏ మేరకు అవసరమో తెలుస్తుంది. పంటల సాగు, విస్తీర్ణం, దిగుబడి అంచనా, పంట కొనుగోళ్లకు బడ్జెట్, లక్ష్యాల నిర్దేశానికి దోహదపడుతుంది. పంట చేతికొచ్చాక సేకరణ చేసే క్రమంలో అవరోధాలు అధిగమించొచ్చు. సాగుకు అవసరమైన భరోసా, భద్రత కల్పించటంలోనూ ఈ - క్రాప్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. సాగుదారులు, రైతుల వివరాల నమోదు తోనే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా రైతులకు దక్కుతుంది. దీంతో పాటుగా ప్రకృతి విపత్తుల వేళ పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం అందించే విషయంలోనూ ఈ-క్రాప్ డేటా సమర్థంగా ఉపయోగపడుతోంది. సామాజిక తనిఖీ నిర్వహణ, లబ్ధిదారుల జాబితా తయారీ అంశాల్లోనూ ఉపకరిస్తోంది. ఇంతటి ప్రాధాన్యత నెలకొనటంతో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను జిల్లా అధికారుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. లక్ష్యానికి అనుగుణంగా ఈ-క్రాప్ పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది.

రైతులు త్వరపడాలి



ఈ-క్రాప్, ఈ-కేవైసీకి ఈ నెల 23వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. ఈ-కేవైసీ ఇప్పటికి 52 శాతమే పూర్తయింది. పంటల కొనుగోళ్లు, విపత్తుల సమయంలో నష్టపరిహారం అందజేతకు ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి. క్షేత్రస్థాయిలో ఆర్‌బీకేల పరిధిలో ఉన్న వీఏఏల ద్వారా రైతులు/కౌలురైతులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి.

– ఎన్.పద్మావతి, కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి

దేశభక్తిని పెంచే 'ఆపరేషన్ వాలెంటైన్'

చిత్ర కథానాయకుడు వరుణ్ తేజ్



మాట్లాడుతున్న వరుణ్‌తేజ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆపరేషన్ వాలెంటైన్ చిత్రం దేశభక్తికి పెంపొందించేలా ఉంటుందని ఆ చిత్ర కథానాయకుడు వరుణ్ తేజ్ తెలిపారు. భారత జవాన్‌లపై పూల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన దాడి, ఆ తర్వాత పాకిస్తాన్ ఉగ్రవాదులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తీర్చుకున్న ప్రతీకారం వంటి అంశాలతో ఈ సినిమాను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తెలుగు, హిందీ భాషల్లో మార్చి ఒకటో తేదీన విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా వరుణ్‌తేజ్ బుధవారం విజయవాడ వచ్చారు. ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్రంలోని పలు సన్నివేశాల గురించి వరుణ్‌తేజ్ వివరించారు. కంచె చిత్రం తర్వాత అంతటి దేశ భక్తి ఉన్న సినిమా ఆపరేషన్ వాలెంటైన్ అని పేర్కొన్నారు. ఈ సినిమా కోసం ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్లు, ఎన్డీ సిబ్బందిని కలిసి అనేక అంశాలను తెలుసుకున్నానని వివరించారు. వారి నిజ జీవితానికి దగ్గరగా ఈ సినిమా ఉంటుందని, అందరికీ ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు.

రూ.కోటితో మంగినపూడి బీచ్ అభివృద్ధి



బీచ్ ఒడ్డున కొబ్బరి చెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): మంగినపూడి బీచ్‌ను ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మంగినపూడి బీచ్ అభివృద్ధిలో భాగంగా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టుతో కలిసి కలెక్టర్ రాజాబాబు బుధవారం బీచ్ ఒడ్డున కొబ్బరి చెట్లు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చుట్టు పక్కల ప్రాంతాల పర్యాటకులను ఆకర్షించేలా మంగినపూడి బీచ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ.12 లక్షలతో చెన్నై నుంచి 300 కొబ్బరి చెట్లను తెచ్చి నాటే ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. ముడా చైర్‌పర్సన్ బొర్రా దుర్గానాగభవాని, బందరు ఆర్డీఓ ఎం.వాణి పాల్గొన్నారు.

మాతృభాషతోనే మనో వికాసం

ఏపీ అధికార భాషా సంఘ చైర్మన్ విజయబాబు



రాజు, లక్ష్మీతులసిని సత్కరిస్తున్న విజయబాబు, నారాయణరావు, కొల్లూరి, ఆంజనేయరాజు

విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనో వికాసం కలుగుతుందని ఏపీ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, మాతృభాషకు సేవలు అందించిన పి.వి.ఎల్.ఎన్.రాజు, పిల్లి లక్ష్మీతులసికి ఆత్మీయ సత్కారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన విజయబాబు మాట్లాడుతూ.. జాతి మనుగడకు మాతృ భాష ఉపయోగపడుతుందని అన్నారు. భాష పేరుతో హద్దులు గీసుకోవడం సరికాదని సూచించారు. అధికార భాషా సంఘం ద్వారా మాతృభాషకు విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. భాష కోసం కృషి చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేస్తున్నామని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. మాతృభాషలో వస్తున్న సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రత్యేక అధికారి డాక్టర్ వెలగా జోషి, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్.వి.సుబ్బయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాతృభాష కోసం కృషి చేసిన పి.వి.ఎల్.ఎన్.రాజు, పిల్లి లక్ష్మీతులసిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సముద్రవేణి భక్త బృందం ప్రదర్శించిన మురళీ కోలాటం, గంగిరెద్దుల విన్యాసాలు, భాగవతుల వెంకట్రామ శర్మ బృందం కూచిపూడి నృత్యం అలరించాయి.

క్లుప్తంగా

ఉద్యోగాల పేరిట టోకరా

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై బాధితుడు బుధవారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపురం సీతాపురానికి చెందిన గడ్డం రోజారాణి గతంలో పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పని చేసేది. ఆ సమయంలో సెక్యూరిటీ మేనేజర్‌గా పని చేసే పవన్‌కుమార్ పరిచయం అయ్యాడు. రోజారాణికి గవర్నమెంట్ హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అంతే కాకుండా రోజారాణి తమ్ముడు విల్లి నరేష్, అన్నయ్య అయ్యే కొల్లాబత్తుల హరిలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. ముగ్గురికి కలిసి రూ. 6 లక్షలు ఖర్చు అవుతుందని, తన ఖర్చులు మరో రూ. 50 వేలు అవుతాయని చెప్పాడు. దీంతో తొలి సారిగా జక్కంపూడి కాలనీకి వచ్చిన రోజారాణి రూ. 40 వేలు ఇచ్చారు. ఆ తర్వాత పలు దఫాలుగా రూ. 1.35 లక్షలు, రూ. 4.65 లక్షలు చెల్లించారు. అయితే కొంత కాలంగా పవన్‌కుమార్ ఫోన్ ఎత్తి మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికే జాబ్ మేళాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత కు వారి విద్యార్హతకు తగిన విధంగా స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి నెలా తమ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని ఉపాధి కల్పన శాఖ డెప్యూటీ డైరెక్టర్ వి.హిమబిందు చెప్పారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా బుధవారం జరిగింది. జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులను ఉద్దేశించి హిమబిందు మాట్లాడారు. యువతకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమశాఖ అందించే సేవలన్నింటినీ ఎంప్లాయిమెంట్ వెబ్‌పోర్టల్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా నిరుద్యోగ సమస్య అనేది ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 210 మంది యువతీ యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరయ్యారన్నారు. వారికి ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 53 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ఆయన చెప్పారు.

చిత్ర సౌరభం.. సింధూర తోరణం

ఆమె చేతిలో అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయి. కుంచె చేతబట్టిందంటే కళాఖండాలు కళాత్మకంగా ఒదిగిపోతాయి. ఖాళీ పేపర్లు అయినా ఇట్టే అపురూపమైన బొమ్మగా మారిపోతాయి. చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్స్, పేపర్ క్విలింగ్ ఇలా ఒకటేమిటి దేనిలో అయినా తన చేయి పడిందంటే బొమ్మ అదుర్స్ అనాల్సిందే. ఒక పక్క ఫిజియోథెరపీ కోర్సులో చేరి డాక్టర్ అవ్వాలన్న తన కల వైపు అడుగులు వేస్తూనే.. తనకిష్టమైన క్రాఫ్ట్స్‌లో సత్తా చాటుతున్న విజయవాడకు చెందిన మేడా సింధుశ్రీ 'ఆర్ట్'టచింగ్ స్టోరీ ఇది.

అమ్మ స్ఫూర్తితో అద్భుతాలు సృష్టిస్తోన్న యువతి

- చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్స్, పేపర్ క్విలింగ్‌తో ఇతర అంశాల్లో ప్రతిభ
- జాతీయ స్థాయిలో సత్తా
- కళాకృతులతో వచ్చిన ఆదాయం చదువుకు వినియోగం





సింధుశ్రీ గీసిన చిత్రాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆమె వయస్సు 20 సంవత్సరాలు.. ఫిజియోథెరపీ మొదటి సంవత్సరం చదువుతోంది.. కానీ అనేక అంశాల్లో ప్రతిభ చూపుతూ పలు పోటీల్లో బహుమతులు సొంతం చేసుకుంటోంది. ఆమె ఎవరో కాదు విజయవాడ నగరానికి మేడా సింధుశ్రీ. తెలంగాణ రాష్ట్రంలోని యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి పురస్కార పోటీల్లో చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్స్, పేపర్ క్విలింగ్ అంశాల్లో ప్రతిభ చూపినందుకు తెలుగు వెలుగు మహానంది జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకుంది. ఆర్ట్ అండ్ క్రియేటివ్ క్రాఫ్ట్ వర్క్స్, మండాల ఆర్ట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, పెన్సిల్ పోర్ట్రేట్, స్టిల్ లైఫ్ పెయింటింగ్, కొలాజ్ ఆర్ట్, ల్యాండ్ స్కేప్ ఆర్ట్, రియలస్టిక్ పెయింటింగ్స్‌లో ఆమెకు నైపుణ్యం ఉంది.



తెలుగు వెలుగు మహానంది పురస్కారంతో మేడా సింధుశ్రీ, ఆమె తల్లిదండ్రులు

అమ్మే ఆదర్శం..

➡ విజయవాడ అయ్యప్ప నగర్‌లో నివసిస్తున్న మేడా సింధుశ్రీ తల్లి మేడా రజని క్వీన్ ఆఫ్ క్రాఫ్ట్స్‌గా పేరుపొందారు. రజని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూ పేపర్‌తో వివిధ కళాకృతులను తయారు చేయడంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తుంటారు. బాల్యం నుంచి తల్లి చేస్తున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వర్క్స్ చూసి సింధుశ్రీ స్ఫూర్తి పొందింది.

➡ సింధుశ్రీ చదువుకుంటూనే ఈ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్చుకోవడం తన రెగ్యులర్ స్టడీస్‌కి బాగా ఉపయోగపడుతున్నాయి. చదువులో భాగంగా ప్రాజెక్టు రిపోర్ట్స్‌లు తయారు చేయడానికి, సైన్స్ బొమ్మలు గీయడానికి.. రికార్డ్స్.. ప్రాజెక్టు వర్క్స్ చేయటానికి ఈ క్రియేటివ్ స్కిల్స్ చాలా దోహదం చేస్తున్నాయని సింధుశ్రీ చెబుతోంది.

➡ తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువులు స్ఫూర్తి శ్రీనివాస్, ఎస్పీ మల్లిక్ సలహాలు సూచనలతో వివిధ రకాల ఆర్ట్, క్రాఫ్ట్, ఫొటోగ్రఫీ కాంటెస్ట్, డ్రాయింగ్ ఎగ్జిబిషన్స్‌లో పాల్గొని విజేతగా నిలిచానని వివరించింది.

ఆర్ట్.. ఆదాయం..

తన కాళ్ల మీద తాను స్వయంగా నిలబడాలనే ఉద్దేశంతో సింధుశ్రీ ఆర్ట్స్ పేరు మీద ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ ఆర్డర్లు తీసుకుని రోజులో ఖాళీ సమయాల్లో ఆ ఆర్డర్లకు సంబంధించి పనులు పూర్తి చేసుకుంటుంది. తన చదువుకు కళాశాలలో చెల్లించాల్సిన ఫీజులు ఆర్ట్స్ అమ్మగా వచ్చిన డబ్బుతో సింధుశ్రీ చెల్లిస్తోంది. డ్రాయింగ్ అంటే చాలా ఇష్టమని, ఇష్టమైన పనిని చేయడంతో మనస్సుకు, మెదడుకు చక్కటి రిలాక్సేషన్‌గా ఉండి బాగా చదువుకోగలుగుతున్నానంటున్న ఈ యువతి. డ్రాయింగ్ వేస్తూనే డాక్టర్ అవుతానంటోంది.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు అందించిన ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తిచేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్లో పురోగతిని సమీక్షించి పనుల పూర్తికి మార్గనిర్దేశం చేశారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్, వీఆర్వో తదితరులతో పటిష్ట సమన్వయంతో వ్యవహరిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే సర్వే, రెవెన్యూ, హౌసింగ్ తదితర బృందాలు ప్రత్యేకంగా సమావేశమై సమస్యలను పరిష్కరించి.. రిజిస్ట్రేషన్లను పూర్తిచేయాలన్నారు.

పూర్తి స్థాయి ఫలితాలు సాధించాలి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంగా అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా పూర్తిస్థాయిలో ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్తురాజు ధనుంజయుడికి ఘన నివాళి



ధనుంజయుడికి నివాళులర్పిస్తున్న తొలి తెలుగు దివ్వె ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తొలి తెలుగు దివ్వె ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలితెలుగు శాసనకర్త ముత్తురాజు ధనుంజయుడి చిత్రపటానికి పూలమాల వేసి తొలితెలుగు దివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా తొలితెలుగు దివ్వె వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎల్ఎస్ రాజు మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 21న నిర్వహించే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నాడు తొలి తెలుగు శాసనకర్త ముత్తురాజు ధనుంజయుడిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020లో తొలితెలుగు శాసనం, శాసనకర్త గురించి 5వ తరగతిలో పాఠ్యాంశంగా చేర్చారని గుర్తు చేశారు. ఇందుకు గాను తొలితెలుగు దివ్వె సంస్థ తరఫున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ గౌరవ అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి, సంస్థ ప్రధాన కార్యదర్శి బి. ఆంజనేయరాజు, జి.ఆర్.కె. పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు పాల్గొని ప్రసంగించారు.

లేడీస్ హాస్టల్‌లో యువకుడి హల్‌చల్

గుణదల (విజయవాడ తూర్పు): మద్యం మత్తులో ఓ యువకుడు లేడీస్ హాస్టల్‌లోకి చొరబడి హల్ చల్ చేసిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. టి. వంశీకృష్ణ (26) రోజువారి కూలి పనులు చేస్తుంటాడు. ఇల్లు, తల్లిదండ్రులు ఎవరూ లేకపోవడంతో రాత్రి సమయాల్లో రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో పడుకుంటాడు. మత్తు పదార్థాలు, మద్యానికి బానిసైన వంశీకృష్ణ చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో బుధవారం పూటుగా మద్యం తాగిన యువకుడు లబ్బీపేట పీవీపీ మాల్ వెనుక గల భాగ్యశ్రీ లేడీస్ హాస్టల్‌లో చొరబడి దొంగతనానికి విఫలయత్నానికి పాల్పడ్డాడు. దీంతో హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలిసిన హాస్టల్ సిబ్బంది ఈ యువకుడిని పట్టుకోబోయారు. అక్కడి నుంచీ తప్పించుకునే క్రమంలో పరుగుతీస్తూ రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. వంశీకృష్ణను పట్టుకున్న హాస్టల్ సిబ్బంది మాచవరం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వంశీకృష్ణను వైద్యం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదమేమీ లేదని వైద్యులు తెలపడంతో ప్రాథమిక చికిత్స అనంతరం స్టేషన్‌కు తరలించారు. హాస్టల్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ యువకుడిపై కేసు నమోదు చేశారు. కాగా ఈ యువకుడు పలు చోరీ కేసులలో అనుమానితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.

మత్స్య పరిశ్రమతో మంచి భవిష్యత్



అవనిగడ్డ: కోస్తాతీర ప్రాంతం ఎక్కువగా ఉన్న మన రాష్ట్రంలో మత్స్య పరిశ్రమకు మంచి భవిష్యత్ ఉందని ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ డైరెక్టర్ టీఎల్ఎన్ స్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మనటీవి భవనంలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మత్స్య శాఖ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మత్స్య సంపదపై ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు లో నాగార్జున యూనివర్సిటీ ప్రధాన విభాగ అధిపతి ప్రొఫెసర్ కడిమి మధుబాబు, ప్రొఫెసర్ ఎం. కోటేశ్వరరావు, ప్రొఫెసర్ పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



హాల్ టికెట్లు పొందిన విద్యార్థులతో ప్రవీణ్ ప్రకాష్

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మమేకమై వారితో మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య కీలకం అన్నారు. అటువంటి ఇంటర్ పరీక్షలను వత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని మంచి మార్కులు సాధించి జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. అనంతరం శ్రీచైతన్య కళాశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు కూడా హాల్‌టికెట్లు అందజేసిపరీక్షలు బాగా రాయాలని సూచించారు. సుబ్బారావు, డీవైఈఓ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం

కంకిపాడు: పదో తరగతి పరీక్షలకు ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని డీఈఓ తాహెరా సుల్తానా సూచించారు. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ పీఎం శ్రీ పథకానికి ఎంపికచేసిన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పదిలో నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడి.. పోక్సో కేసు నమోదు

మోపిదేవి: తొమ్మిదో తరగతి చదువుతోన్న ఓ బాలికపై సొంత బంధువే అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బెదిరించి పలు మార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక గర్భవతి కావడంతో అసలు విషయం బయటకొచ్చింది. ఈ కేసుకు సంబంధించి అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోపిదేవిలోని దళితవాడలో నివసిస్తున్న ఓ బాలిక(14) గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండటంతో బాలిక తల్లి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించింది. అక్కడ వైద్యులు పరీక్షించి నాలుగు నెలల గర్భవతిగా నిర్ధారించారు. దీనిపై ఆరా తీయగా.. అదే ప్రాంతానికి చెందిన కర్లపూడి అంకినీడు(50) బాలికను బెదిరించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అంకినీడుపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ అంకినీడు బాలిక కుటుంబానికి దగ్గరి బంధువేనని వరుసకు తాత అవుతాడని సమాచారం.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఉంగుటూరు: పెద అవుటపల్లి రైల్వే స్టేషన్, గేటు సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద అవుటపల్లి రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని కీమ్యాన్ గుర్తించారు. ఆయన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. సుమారు 60-65 ఏళ్ల వయసు కలిగిన పురుషుడిగా గుర్తించారు. నలుపు, తెలుపు రంగు కొద్దిపాటిజుట్టు, మాసిన గడ్డం కలిగి ఉన్నాడు. తెలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, లేత ఆకుపచ్చరంగు లుంగి ధరించి, కుడి చేతిపై నలుపు రంగు కాశీతాడు కట్టుకొని ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు (9502097672)ను సంప్రదించాలని సూచించారు.

సీఏంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ ప్రభంజనం



విద్యార్థులతో అన్నా నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) బుధవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అఖిల భారత స్థాయి టాప్ ర్యాంకులతో పాటు అత్యధిక ఉత్తీర్ణతతో ప్రభంజనం సృష్టించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీమేధ కార్యాలయంలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 400కు పైగా అఖిల భారతస్థాయి ర్యాంకులు సాధించామని చెప్పారు. సీఎంఏ ఫైనల్ విభాగంలో పి. లోకేష్ అఖిల భారతస్థాయిలో 4వ ర్యాంకు, చందా పవన్ కుమార్ 17వ ర్యాంకు, ఎ.పవన్ కల్యాణ్ 31వ ర్యాంకు, డి. శ్రీహరి రెడ్డి 47వ ర్యాంకుతో పాటు సీఎంఏ ఇంటర్‌లో బొల్లా పల్లవి 27వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులే క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించడం ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ ఘనత సాధించడంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సహకారం ఎంతో ఉందన్నారు. విద్యార్థులను నంద కిషోర్, సంస్థ డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి అభినందించారు.

శారదానదిలో స్నానానికి దిగి కార్పొరేషన్ ఉద్యోగి మృతి



దుర్గాప్రసాద్(ఫైల్)

అనకాపల్లి : విజయవాడ కార్పొరేషన్‌లో శానిటరీ ఉద్యోగిగా పనిచేస్తున్న బంగారు దుర్గా ప్రసాద్(40) అనకాపల్లి జిల్లా తుమ్మపాల చిన్నయ్యపేట వద్ద శారదానదిలో ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తుమ్మపాల గ్రామానికి చెందిన కుటుంబ సభ్యుల వివాహానికి బంగారు దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా మంగళవారం ఇక్కడికి వచ్చారు. అదేరోజు సాయంత్రం దుర్గాప్రసాద్, కుమారుడు దిలీప్‌తో కలిసి శారదానదిలో స్నానానికి దిగారు. అయితే దుర్గాప్రసాద్ నీటిలో మునిగిపోయాడు. మృతదేహాన్ని బుధవారం తెల్లవారుజామున శారదానది నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడి భార్య బంగారు సంతోషి నూకలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హైవేపై లారీ పల్టీ.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడ్డ లారీని క్రేన్‌తో లేపుతున్న దృశ్యం

కంకిపాడు: వేగంగా వెళ్తున్న టిప్పరు జాతీయ రహదారిపై బోల్తా పడ్డ సంఘటన బుధవారం తెల్లవారుజామున కంకిపాడు వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మచిలీపట్నం కొండ రాళ్లతో వెళ్తున్న టిప్పరు లారీ కంకిపాడు బైపాస్ మార్గానికి చేరుకోగానే లారీ అదుపు తప్పి ఒక్కసారిగా డివైడర్ మీదుగా దూసుకెళ్లి విజయవాడ వెళ్లే వాహనాల మార్గం వైపున పల్టీ కొట్టింది. కొండరాళ్లు జాతీయ రహదారిపై చిందరవందరగా పడటం, ఆ శబ్దానికి వాహనదారులు భయాందోళనలు చెందారు. లారీ డీజిల్ ట్యాంకు పగిలి డీజిల్ కారిపోవటంతో పెనుప్రమాదం జరుగుతుందని వాహనదారులు భయపడ్డారు. అయితే అలాంటివేమి జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. లారీ పల్టీ పడటంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బోల్తా పడ్డ లారీని క్రేన్ సాయంతో లేపి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై ప్రచారం



ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలోని 4, 11 డివిజన్‌ల పరిధి గమేళా, వెటర్నరీ కాలనీల్లో బుధవారం మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం జరిగింది. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి సుధీరతో పాటు సోదరి క్రాంతి ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా దేవినేని సుధీర మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలంతా క్షేమంగా ఉన్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలు ఇంటి వద్దకే వచ్చాయన్నారు. 11 డివిజన్ ఇన్‌ఛార్జి పర్వతనేని బాబి, 4వ డివిజన్ ఇన్‌చార్జి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గల్లా పద్మావతి, గల్లా సదాశివరావు పాల్గొన్నారు.

పూజా మండపాల నిర్మాణంపై సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పూజా మండపాలపై చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలోని ఖాళీ స్థలంలో దేవస్థానం పూజా మండపాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించింది. నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ సిద్ధం కావడంతో ఆలయ ఈఈ కోటేశ్వరరావుతో చైర్మన్ స్థల పరిశీలన చేశారు. అదే విధంగా మల్లేశ్వరాలయం వద్ద క్యూలైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈఈ కోటేశ్వరరావును కోరారు. స్వామి వారి దర్శనానికి ప్రతి నిత్యం భక్తులకు విశేషంగా విచ్చేస్తున్న నేపథ్యంలో క్యూలైన్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సాధ్యమైనంత త్వరగా స్వామి వారి ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో భారతీయ రైల్వే 'అమృత్ భారత్ స్టేషన్' పథకం అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా ఈ నెల 26న విజయవాడ డివిజన్‌లోని గుణదల రైల్వే స్టేషన్‌ను దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విజయవాడ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు '2047 విక్షిత్ భారత్ విక్షిత్ రైల్వేస్' థీమ్‌తో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. నగరంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ పెయింటింగ్ వేసిన ముగ్గురు విద్యార్థులను రైల్వే అధికారులు విజేతలుగా ప్రకటించారు. వారిలో మొదటి స్థానంలో ఎ.శ్రీహాస్, రెండవ స్థానంలో ఎం.ప్రవీణ్, మూడవ స్థానంలో జె.ప్రభుకుమార్ నిలిచారు. ఈ నెల 26న గుణదల రైల్వే స్టేషన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనే విశిష్ట అతిథుల చేతుల మీదుగా వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏపీ స్టేట్ కరాటే రిఫరీ కమిషన్ సభ్యుడిగా హర్ష



భవానీపురం: ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ (ఏపీ ఎస్‌కెఎ) సభ్యుడైన పీవీకెఎస్ హర్ష ఏపీ స్టేట్ కరాటే రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గొల్లపూడిలో ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ వార్షికోత్సవంలో భాగంగా సెమినార్, రిఫరీ జ్యూరీ పరీక్ష జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియ (కాయ్) జనరల్ సెక్రటరీ షిహాన్ రజనీష్ చౌదరి చేతుల మీదుగా హర్ష నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రజనీష్ చౌదరి మాట్లాడుతూ కరాటే విద్యలో సుశిక్షతులైన హర్షను రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమించిన ఏపీ ఎస్‌కెఎ జనరల్ సెక్రటరీ జె.శ్రీనివాసులు అభినందనీయులన్నారు. ఏ పోటీల్లో అయినా రిఫరీలు కచ్చితత్వాన్ని పాటించాలని తెలిపారు. తనను రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమించిన శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు.

తూర్పులో రూ.900 కోట్లు సంక్షేమం

- అర్హతే ప్రామాణికంగా పథకాలు
- పేదల్లో పెరిగిన కొనుగోలు శక్తి
- మొదటి తేదీనే తలుపు తట్టి పింఛను అందిస్తున్న వైనం
- మరో 32211 మందికి ఇళ్ల స్థలాలు
- రైస్ కార్డులు 57359 మంది అందజేత
- చరిత్రలో ఎన్నడూ లేని సంక్షేమం అంటున్న ప్రజలు



ఇంటికే వెళ్ల ఫింఛన్ అందిస్తున్న వాలంటీర్‌లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేసింది. అందులో భాగంగా కుల, మత, వర్గ, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడింది. తూర్పు నియోజకవర్గంలో ఏకంగా రూ. 900 కోట్లు సంక్షేమ పథకాలు అందించడమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అంతేకాదు పథకాల అమలులో ఎలాంటి అవినీతి అక్రమాలు, సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తూ లబ్ధిదారుని బ్యాంకు ఖాతాల్లోనే ఆ మొత్తాన్ని జమచేశారు. నాలుగేళ్ల తొమ్మిది నెలల వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజలు చాలా సంతృప్తికరంగా ఉన్నారు. తమకు మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారు.

తెల్లారక ముందే పింఛను....

గత ప్రభుత్వంలో పింఛను తీసుకునేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. డివిజన్ మొత్తానికి ఒక ప్రాంతంలో పంపిణీ చేసే వారు. ఏ తేదీన ఇస్తారో తెలియదు. ఒకవేళ తేదీ తెలిసినా, రెండు, మూడు వందల మంది అక్కడకు వెళ్లి బారులు తీరి నిల్చుంటే, సిబ్బంది తీరిగ్గా వచ్చి పంపిణీ చేసే వాళ్లు. దీంతో వృద్ధులు నీరసించి పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాదు కొత్త పింఛను మంజూరు చేయాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగితే, వారు దయతలిస్తేనే వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే వచ్చి లబ్ధిదారులను ఎంపిక చేసి పింఛను మంజూరు చేస్తున్నారు.

పిల్లలు విద్యకు దూరం కాకూడదని....

పేద వర్గాలు చెందిన పిల్లలు కూడా ఉన్నత విద్యావంతులుగా ఎదగాలనే సదుద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం ద్వారా బడికి పంపిన పిల్లల తల్లులకు ప్రతి ఏటా రూ.15 వేలు వారి బ్యాంకు ఖాతాలోనే జమచేశారు. ఇలా నాలుగేళ్లు విజయవంతంగా జమచేశారు. అంతేకాదు వయస్సు 45 ఏళ్లు దాటిన మహిళలకు చేయూత, కాపునేస్తం, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఆసరా, రుణమాఫీ వంటి అనేక పథకాలు అమలు చేశారు. చిరు వ్యాపారులకు జగనన్న తోడు, వైఎస్సార్ బీమా వంటి పథకాలతో పేదల్లో ఆర్థిక శక్తి పెరిగింది. విద్యాదీవెన, వసతి దీవెన, వాహనమిత్ర, లా నేస్తం వంటి పథకాలు అమలు చేశారు. గత ఎన్నికల ముందు చెప్పిన ప్రతి పథకాన్ని అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు.

పథకం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన మొత్తం రూ.
వైఎస్సార్ పింఛను కానుక	21536	375.47 కోట్లు
వైఎస్సార్ చేయూత	34661	64.99 కోట్లు
వైఎస్సార్ ఆసరా	30602	119.17 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ	3869	20.40 కోట్లు
వైఎస్సార్ బీమా	678	6.39 కోట్లు
జగనన్న తోడు	22443	22.44కోట్లు
జగనన్న చేదోడు	9639	9.64 కోట్లు
వైఎస్సార్ కళ్యాణ మస్తు	111	83.25 లక్షలు
అర్చకులు, ఇమామ్, పాస్టర్లు	30	36 లక్షలు
వైఎస్సార్ కాపునేస్తం	7651	11.48 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	4256	6.39 కోట్లు
వైఎస్సార్ లా నేస్తం	125	1.50 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం	5	1.20 లక్షలు
వైఎస్సార్ వాహనమిత్ర	7485	7.49 కోట్లు
జగనన్న అమ్మఒడి	20235	28.33 కోట్లు
జగనన్న విద్యాదీవెన	16294	27.09 కోట్లు
జగనన్న వసతి దీవెన	18430	17.85 కోట్లు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	114	11.40 లక్షలు
విద్యార్థులకు ట్యాబ్‌లు	2515	8.30 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	32189	67.78 కోట్లు
ఆరోగ్య ఆసరా	2478	1.22 కోట్లు
సీఎంఆర్ఎఫ్/ఎల్ఓసీ	327	8.24 కోట్లు
మొత్తం :		900.38 కోట్లు

చేసింది దమ్ముగా చెబుతున్నాం



నాలుగేళ్ల తొమ్మిది నెలల్లో నియోజకవర్గంలో ఏమి చేశామో అంకెల్తో సహా దమ్ముగా చెప్పగలుగుతున్నాం. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గంలో రూ.900 కోట్లు సంక్షేమ పథకాలతో పాటు, రూ.650 కోట్లుతో అభివృద్ధి చేశాం. ఎన్నడూ, ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కనిపిస్తుంది. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

–దేవినేని అవినాష్, నియోజకవర్గ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ

తెల్లారక ముందే పింఛను ఇస్తున్నారు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటరీ, సచివాలయ వ్యవస్థ చాలా బాగుంది. ప్రతినెలా పింఛను మొదటి తేదీ తెల్లారక ముందే తలుపు తట్టి ఇస్తున్నారు. అంతేకాదు నాకు రైతు భరోసా వచ్చింది. కాపునేస్తం వచ్చింది. ఇన్ని సంక్షేమ పథకాలు ఇచ్చిన ప్రభుత్వాలను గతంలో ఎప్పుడూ చూడలేదు. అంతేకాదు పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ఇంటి వద్దకే వచ్చి రాసి ఇచ్చే ప్రభుత్వం ఇదే. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వం.

–చలమలశెట్టి రమేష్, కృష్ణలంక

సామాజిక, ఆర్థికంగా ఉన్నతికి దోహదం



రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల్లో కొనుగోలు శక్తి పెరిగింది. ఆర్థిక ఇబ్బందులు సైతం తొలగిపోయాయి. ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో స్వయం ఉపాధితో జీవనోపాధి పొందడంతో పాటు, పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. సంక్షేమ పథకాలు సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనాన్ని దూరం చేసి, ఉన్నత స్థితికి దోహదపడుతున్నాయి.

–వట్టిపల్లి రామస్వామి,
ఉద్యోగ సంఘ నేత, ఏపీజీఇఎఫ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఫ్రూక్ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక ఉపకేంద్రం, 11 కేవీ గీతానగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజినీర్ టీవీ సుధాకర్ తెలిపారు. తారకరామానగర్, భూపేష్ గుప్తానగర్, రాణిగారితోట, చలసానినగర్, బాలాజీకాలనీతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

- మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ లయోలా గార్డెన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరానగర్‌లోని 1,2,3 అంతర్గత రహదారులు, సెంట్రల్ ఎక్సైంజ్ కాలనీ, స్పెన్సర్ సైడు రోడ్డు, సెంటినీ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

24న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 24వ తేదీన జరగనుంది. పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున 5–55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. ఆది దంపతులైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువై తీరగా, భక్తులు, దీక్షాదారులు, ఆలయ అధికారులు, సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొంటారు. అమ్మవారి ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితారా జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కేటీ రోడ్డు, శ్రీనివాసమహాల్, బ్రహ్మణ వీధి, రథం సెంటర్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. భక్తులందరూ పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు.

అవినీతి రహిత పాలనలో వలంటీర్లే కీలకం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



సత్కారం పొందిన వలంటీర్లుతో దేవినేని అవినాష్, బెల్లం దుర్గ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అవినీతి రహిత, పారదర్శక పాలన అందించడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు వలంటీర్లు ఇంటికే వచ్చి అర్హత ఉంటే సంక్షేమ పథకం అందిస్తున్నారని పేర్కొన్నారు. శ్రీనివాస్‌నగర్ బ్యాంక్ కాలనీలోని ఓంకార్ కళ్యాణ మండపంలో బుధవారం వలంటీర్లుకు వందనం కార్యక్రమం జరిగింది. తూర్పులోని 4,10,11, 12, 13, 14 డివిజన్‌లలో ఉత్తమ ప్రతిభ చూపిన వలంటీర్లుకు సేవ వజ్ర, సేవరత్న, సేవ మిత్ర పురస్కారాలు అందచేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ పాలనను చేరువ చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందిన వారే నిజమైన స్టార్ క్యాంపెయినర్‌లన్నారు.

ప్రతి పక్షాలవి తప్పుడు ఆరోపణలు...

రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. కరోనా సమయంలో ప్రతిపక్ష నాయకులు రెండేళ్లు హైదరాబాద్‌లో దాక్కుంటే, వలంటీర్లు ప్రజలకు సేవలు అందించిన విషయం అందరికీ తెలుసునన్నారు. అలాంటి వలంటీర్లుపై చంద్రబాబు సిగ్గులేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా సేవా మిత్రకు రూ.15 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా వజ్రకు రూ.45 వేలు నగదు బహుమతులతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ ఇన్‌ఛార్జిలు గల్లా పద్మావతి, కరుటూరి హరీష్, పర్వతనేని పవన్, మాగంటి నవీన్, రామాయణపు శ్రీనివాస్, గల్లా రవి, ఎండీ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక, 20వ డివిజన్‌లోని హైస్కూల్ రోడ్డు, కాటూరివారి వీధి, పాత పోస్టాఫీస్ రోడ్డు, శంకరమఠం వీధి ప్రాంతాల్లో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నర ఏళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలపై ముద్రించిన మీ అవినాష్ అన్న హామీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తుంటే ఆయన నాయకత్వంలో పని చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఇంటింటికి వెళ్తుంటే అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం దేశంలో ఏదైనా రాష్ట్రం ఉందంటే అది మన రాష్ట్రమేనన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పురాతన భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం



పురస్కారాలు అందుకున్న ప్రముఖులు



మాట్లాడుతున్న శ్రీలక్ష్మి



తెలుగు పద్యాన్ని పాడుతున్న విద్యార్థిని


గుణదల (విజయవాడ తూర్పు): తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకుని మన మాతృభాష పై పట్టు సాధించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, ప్రముఖ వైద్యుడు జి.సమరం అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఆంధ్ర లయోల కళాశాలలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సమరం మాట్లాడుతూ భారతీయ పురాతన భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. భావ వ్యక్తీ కరణకు, ఉచ్ఛారణకు తెలుగు అనువైన భాషగా అభివర్ణించారు. మన దేశాన్ని పాలించిన ఎందరో రాజులు, పండితులు తెలుగు భాష విశిష్టతను గుర్తించి దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ కీర్తించారని గుర్తు చేశారు. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న మన తెలుగు భాష ప్రస్తుతం అంతరించిపోయే భాషల జాబితాలో చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి తరం యువతీ యువకులు తెలుగు భాష పునర్వైభవానికి కృషి చేయాలని కోరారు. తెలుగు పదాల మధ్య ఇంగ్లీషు పదాలను నియంత్రించాలని వివరించారు. మన మాతృభాషను దశ దిశలా వ్యాపింప చేసేలా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ , ఆంధ్ర లయోల కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు భాష వ్యాప్తికి కృషి చేస్తున్న పలువురికి పురస్కారాలు అందచేశారు. అవార్డు గ్రహీతలు ఫాదర్ పి.జోజయ్య, చీదిరాల చెన్నయ్య, బి.కామేశ్వర రావు, కె.సుబ్రహ్మణ్యం, పి. ఆంజనేయులు, జోబ్ సుదర్శన్లను సత్కరించారు. కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీ మోహన్ రాజు, లయోల కళాశాల తెలుగు శాఖాధిపతి కోలా శేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):మాతృభాష గొప్ప తనాన్ని తెలుసుకుని ఆ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు ఉపాధ్యాయురాలు డి.శ్రీలక్ష్మి చెప్పారు. రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో మాతృభాషా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహ ఇంచారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన శ్రీలక్ష్మి మాట్లాడుతూ తెలుగుభాషను అభ్యసించే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతుందన్నారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ళ విద్యాకన్నా మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో అనేక భాషలను నేర్చుకుంటున్నారని చెప్పారు. ప్రపంచంలోని అన్ని భాషల కంటే తెలుగు భాష ఎంతో ప్రాముఖ్యమైనదని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషలోనే మాధుర్యం

తెలుగు భాష మాధుర్యమని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, సిద్ధార్థ కళాశాల సంయుక్తంగా సిద్ధార్థ కళాశాల సెమినార్ హాలులో బుధవారం తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాల, కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తెలుగు పద్యాలను ఆలపించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల హాజరై విజేతలకు బహుమతులు అందచేశారు. పాఠశాల స్థాయి విభాగంలో డి.గ్రాహ్య (ప్రథమ), ఎం.మహత్ (ద్వితీయ), బి.వైష్ణవి (తృతీయ) బహుమతులు పొందారు. కళాశాల స్థాయిలో జరిగిన పోటీల్లో ఎ.దుర్గాసాయి (ప్రథమ), కె.తిలకవతి (ద్వితీయ), వి.మాధురి (తృతీయ) బహుమతులు పొందారు. పి.శ్యామలకు ప్రోత్సాహక బహుమతి అందుకుంది. డాక్టర్ చల్లా సీతామహాలక్ష్మి, పి.దాసు పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. డాక్టర్ ఎస్.శివకుమార్, తెలుగు శాఖ అధ్యాపకులు పి.నీరజ, ఏవీ రమణమూర్తి, డాక్టర్ బలరాం పోటీలను పర్యవేక్షించారు.

పర్యావరణాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణం, శ్రీనివాసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంధన పొదుపు కార్యకలాపాలను అమలు చేయాల్సిన ఆవశ్యకతలో భాగంగా కేవలం ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని హైదరాబాద్‌కు చెందిన సిరి ఎక్సెర్జీ అండ్ కార్బన్ అడ్వైజరీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. నగర పాలక సంస్థ నూతన భవనం సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్ లెవల్ ఇంజినీరింగ్ సిబ్బందికి ఇంధన పొదుపుపై వర్క్‌షాప్ నిర్వహించారు. పంప్ ఆపరేటర్లకు మున్సిపాలిటీల్లో ఎనర్జీ ఎఫిషియన్సీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. మున్సిపల్ వాటర్ పంపింగ్, స్ట్రీట్ లైటింగ్‌లో ఇంధనాన్ని ఆదా చేయడం గురించి చెప్పారు. ఇంధన శక్తి పొదుపులో భాగంగా విద్యుత్ బిల్లులను తగ్గించడమే కాకుండా స్థిరత్వాన్ని కాపాడుకునేందుకు కార్బన్ ఉద్గారాలను తగ్గించేటప్పుడు బొగ్గు, చమురు, గ్యాస్ వంటి వేగంగా క్షీణిస్తున్న వనరులను కూడా సంరక్షిస్తుందని వెల్లడించారు. వివిధ రంగాల్లో పొదుపు చేయాలంటే వీధి దీపాల్లో 5–10 శాతం, పంపింగ్‌లో 20–25 శాతం, మురుగునీటి పంపింగ్‌లో 15–20 శాతం, మున్సిపల్ భవనాల్లో 5–10 శాతం చేయవచ్చని వివరించారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఇసీఎమ్) డిఇఇ జీ శ్రీనివాసులు, నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) ఎస్.ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార రెడ్డి మున్సిపాలిటీల్లో ఇంధన సామర్థ్యంపై బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థులు పరీక్షలలో మంచి మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి (డీఎస్ఈవో) యు.వి.సుబ్బారావు ఉపాధ్యాయులకు సూచించారు. కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు సన్నద్ధమవుతున్న అంశాన్ని పాఠ్యాంశాలతో పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన మనస్సు ఏకాగ్రతతో చదువుపై దృష్టిపెట్టినప్పుడే మంచి ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన మౌలిక వసతులను కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. 8, 9వ తరగతి విద్యార్థుల బైజుస్ కంటెంట్ ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు.

పాన్ ఇండియా వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగల సీజన్ సందర్భంగా బందరు రోడ్‌లోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో పాన్ ఇండియా వెడ్డింగ్ వోగ్స్ జ్యూయలరీ అండ్ వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌ను కృష్ణా జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, బొండా సుజాత, యార్లగడ్డ జ్ఞానేశ్వరి, రాధిక, మాధవి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 75 ప్లస్ లగ్జరీ బ్రాండ్స్ స్టాల్స్ వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. అలాగే ప్రముఖ బ్రాండెడ్ జ్యూయలరీ షోరూమ్స్, క్లాత్ వేర్ షోరూమ్స్ నిర్వాహకులు గోల్డ్, డైమండ్, శారీస్, డ్రెసెస్ ఇతర ఉత్పత్తులను అమ్మకం కోసం ఇక్కడ ఏర్పాటు చేశారు. నిర్వాహకులు అన్నపూర్ణ, నిరంజన్ పాల్గొన్నారు.

ముమ్మాటికీ ఆర్థిక నేరస్తుడే

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసిందని ఆర్‌బీఐ స్పష్టం చేయడంతో ఈ కేసులో తరువాత పరిణామాలు ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. అక్రమ డిపాజిట్ల కేసు నిరూపితమైతే ఏకంగా రెట్టింపు జరిమానా అంటే రూ.5,200 కోట్ల జరిమానాతోపాటు కనీసం రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలు శిక్ష విధించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

- 'మార్గదర్శి' పేరిట రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం
- ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ
- అవి అక్రమ డిపాజిట్లేనని సుప్రీంకోర్టులో ఆర్‌బీఐ వెల్లడి



నల్ల గురివింద రామోజీ-1

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' పేరిట ఏళ్ల తరబడి సాగించిన అక్రమ డిపాజిట్ల వసూళ్లు.. నల్లధనం దందాపై 2006లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎట్టకేలకు ఫలించాయి. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు అక్రమ డిపాజిట్లు వసూలు చేశారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సుప్రీంకోర్టుకు విస్పష్టంగా నివేదించింది. దాంతో రామోజీ అవినీతి ఆట కట్టిందని, ఇక శిక్ష పడటమే మిగిలిందని నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండేళ్ల నుంచి గరిష్టంగా యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశం ఉందని కూడా చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దాంతో మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు సాగించిన ఆర్థిక అక్రమాల కథ కమామీషు మరోసారి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2006లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' అనే సంస్థ ఉన్నట్టు కూడా సామాన్యులకు తెలియదు. రాష్ట్రం అంతటా 'మార్గదర్శి చిట్ ఫండ్స్' కార్యాలయాలే కనిపిస్తూ ఉండేవి. కానీ ఆ కార్యాలయాల్లోనే గుట్టు చప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' పేరిట మరో కంపెనీ ఆర్థిక కార్యకలాపాలు సాగించేదనే విషయం బయటి ప్రపంచానికి తెలీదు. అలా 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్సియర్స్ యథేచ్ఛగా కార్యకలాపాలు సాగించింది.

భారీగా అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా రామోజీరావు మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు. డిపాజిట్ల సేకరణ పేరిట ప్రజలను మోసం చేయకుండా కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ స్పష్టమైన విధి విధానాలను నిర్దేశించింది. ఆర్‌బీఐ చట్టంలోని 45ఎస్ ప్రకారం కంపెనీల చట్టం ప్రకారం నమోదైన ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. రామోజీరావు తన గ్రూపు సంస్థలను 'హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కింద నమోదు చేసినట్టుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ కింద నమోదైన కంపెనీలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ చట్టానికి తాను అతీతం అని భావించే రామోజీ ఈ నిబంధనను నిర్భీతిగా బేఖాతరు చేశారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట యథేచ్ఛగా డిపాజిట్లు వసూలు చేశారు. 2006లో మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చే నాటికి ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లను సేకరించడం విభ్రాంతికర వాస్తవం. కాగా మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టుకు నివేదించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తప్పు ఒప్పుకోక తప్పని రామోజీ

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల దందా బయటపడటంతో రామోజీరావు కంగుతిన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు రంగాచారిని విచారణ అధికారిగా నియమించింది. ఈ అక్రమాలపై సీఐడీ తరపున న్యాయ స్థానాల్లో కేసులు దాఖలు చేసేందుకు టి.కృష్ణంరాజును అధీకృత అధికారిగా నియమించింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు వీరు గుర్తించారు. కాగా తాము చట్టాన్ని ఉల్లంఘించలేదని బుకాయించేందుకు రామోజీ యత్నించారు. హెచ్‌యూఎఫ్‌గా తాము ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించవచ్చని అడ్డగోలుగా వాదించారు. కానీ సెక్షన్ 45 ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు డిపాజిట్లు సేకరించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దాంతో తాము తప్పు చేసినట్టు రామోజీరావు అంగీకరించారు. నగదు రూపంలో డిపాజిట్లు వసూలు చేసినట్టు కూడా సమ్మతించారు. తమ తప్పును అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లించేస్తామని, మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను మూసి వేస్తామని న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా తెలిపారు.

వివరాలు చెప్పం అని వితండవాదం

తాము అక్రమంగా వసూలు చేసిన డిపాజిట్లను సంబంధిత డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని రామోజీరావు న్యాయస్థానానికి తెలిపారు. కాగా అక్రమ డిపాజిట్లు ఎవరెవరి నుంచి సేకరించారు.. ఎవరెవరికి తిరిగి చెల్లించారో ఆ వివరాలు వెల్లడించాలని సీఐడీ, ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరినప్పటికీ రామోజీరావు సమ్మతించ లేదు. ఆ వివరాలు తాము వెల్లడించాల్సిన అవసరం లేదని వితండవాదం చేశారు. కాగా అక్రమంగా డిపాజిట్లు వసూలు చేసిన రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలని అధీకృత అధికారి కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉమ్మడి హైకోర్టు తన చివరి పని దినాన కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ.. డిపాజిట్‌దారుల వివరాలు వెల్లడించాలని కోరుతూ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం 2022లో ఇంప్లీడ్ అయ్యింది. డిపాజిట్‌దారుల వివరాలు వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు గత ఏడాది పేర్కొంది. కానీ ఇంతవరకు రామోజీరావు తమ డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.

అక్రమ డిపాజిటర్ల వివరాలు

నగరం	రూ.లక్ష-రూ.3లక్షలు	రూ.3 లక్షలు-రూ.5లక్షలు
హైదరాబాద్	9,500	1,800
విజయవాడ	4,750	1,655
విశాఖపట్నం	6,500	985
గుంటూరు	2,465	356
తిరుపతి	650	87
వరంగల్	1,200	165
కాకినాడ	875	63
రాజమండ్రి	1,150	184

నల్లధనం దందా వల్లే గప్‌చుప్

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించిన 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' ముసుగులో రామోజీరావు భారీగా నల్లధనం దందాను సాగించారు. సీబీడీ సోదాల్లో, ఆదాయ పన్ను శాఖ తనిఖీల్లో ఆ విషయం వెలుగు చూసింది. అందుకే తమ సంస్థలో డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించేందుకు రామోజీరావు ససేమిరా అంటున్నారు.
- 2006 నాటికే ఏకంగా 32,385 మంది నుంచి రూ.2,600 కోట్ల వరకు అక్రమంగా డిపాజిట్లు సేకరించారని వెల్లడైంది. కానీ వారి పేర్లు, వివరాలను మాత్రం వెల్లడించేందుకు రామోజీరావు ససేమిరా అంటుండటం గమనార్హం. ఎందుకంటే ఆ డిపాజిట్ల ముసుగులో టీడీపీ పెద్దలు భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తీసుకువచ్చారు. అందుకే సీఐడీతోపాటు న్యాయస్థానం కోరినప్పటికీ వారి వివరాలను వెల్లడించేందుకు సమ్మతించడం లేదు.
- కేంద్ర ఆదాయపన్ను చట్టాన్ని కూడా ఉల్లంఘించి నల్లధనం దందా నడిపారు. రూ.20 వేలకు మించిన లావాదేవీలు నగదు రూపంలో తీసుకోకూడదని ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 269 స్పష్టం చేస్తోంది. కానీ మార్గదర్శి ఫైనాన్సియర్స్‌లో దాదాపు అన్ని డిపాజిట్లు కూడా నగదు రూపంలోనే తీసుకోవడం గమనార్హం. నగదు రూపంలో డిపాజిట్లు స్వీకరించి తమ సిబ్బంది ద్వారా డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ), పే ఆర్డర్లు(పీఓ)ల రూపంలోకి మార్చినట్టు ఆదాయ పన్ను శాఖ అధికారుల తనిఖీల్లో బయట పడింది. డిపాజిట్ చేసిన మొత్తాలు రూ.50 వేలకు మించి ఉన్నప్పటికీ వాటిని రూ.50 వేల కంటే తక్కువ మొత్తాలుగా విభజించి మరీ డీడీలు, పీఓ లుగా మార్చింది.
- మార్గదర్శి ఫైనాన్సియర్స్ రశీదు రూపంలో సేకరించిన డిపాజిట్ల పత్రాలను పరిశీలిస్తే అదంతా నల్లధనం బాగోతమేనన్నది స్పష్టమవుతోంది. డిపాజిట్‌దారుల పాన్ నంబర్లు, పూర్తి చిరునామాలు కూడా లేకుండానే డిపాజిట్లు సేకరించడం గమనార్హం.
- మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన మొత్తం రూ.2,610.38 కోట్లుగా రామోజీరావు 2006లో తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కానీ 2008లో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.1,864.10 కోట్లు చెల్లించేశామని తెలిపారు. మరి మిగిలిన రూ.800 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయనే విషయంపై మౌనం వహించారు. గుట్టుచప్పుడు కాకుండా రికార్డుల నుంచి తొలగించిన ఆ రూ.800 కోట్లు రామోజీకి అత్యంత సన్నిహితుడైన పచ్చ బాబు, ఆయన గ్యాంగ్‌వే అని తెలుస్తోంది. పోనీ చెల్లించామని చెబుతున్న రూ.1,864.10 కోట్ల డిపాజిట్లు ఎవరెవరికి చెల్లించారో చెప్పడానికి రామోజీ ససేమిరా అంటున్నారు.

క్లుప్తంగా...

30 లక్షల మందికి రెండు రాష్ట్రాల్లో ఓట్లు

అలాంటి వారి ఓట్లను తొలగించాలన్న కాంగ్రెస్, బీజేపీ

సాక్షి, హైదరాబాద్: కొందరికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఓట్లు ఉన్నాయని, అలాంటి వారి ఓట్లు తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్, బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు చోట్లా కలిపి 30 లక్షల ఓట్లు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న వారికి మరో రాష్ట్రంలో ఓటేసేందుకు అవకాశం కల్పించరాదని సూచించారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ బుధవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితాలోని డూప్లికేట్ ఓట్లను తొలగించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఓటర్ల జాబితాలో పెద్ద సంఖ్యలో బోగస్, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, చాలా ఓట్లకు ఫొటోలు లేవని బీజేపీ ఎన్నికల సంఘం వ్యవహారాల కమిటీ చైర్మన్ నేత మర్రి శశిధర్‌రెడ్డి, కన్వీనర్ ఆంథోని రెడ్డిలు ఆరోపించారు. బోగస్ ఓట్ల జాబితాను గతంలో అందజేసినా, రిటర్నింగ్ అధికారులు తొలగించలేదన్నారు. 18 లక్షలకు పైగా డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పారు.

రైతులను నట్టేట ముంచిన చంద్రబాబు: నాగిరెడ్డి



నాగిరెడ్డి, సుబ్బారెడ్డి

మద్దిపాడు: 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు రైతులను నిలువునా ముంచి దగా చేశాడని రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో వెల్లంపల్లిలో ఆగారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మడానికి ప్రజలిప్పుడు సిద్ధంగా లేరన్నారు. సీఎం జగన్ రైతులకు హామీలు ఇవ్వకున్నా.. వారిని ఆదుకోవడానికి రైతు భరోసా పథకం అమలు చేస్తూ రైతులను ఆదుకుంటున్నారని, గతంలో చంద్రబాబు రైతులకు ఏం అందించారో చెప్పాలని ప్రశ్నించారు. రైతులకు ఇవ్వాల్సిన ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా రూ.8,750 కోట్ల బకాయిలు వదిలేసి వెళ్లిన ఘనుడు చంద్రబాబు అన్నారు. ఇటీవలే బీజేపీలో చేరిన పురందేశ్వరి మరిది చంద్రబాబును ఏదో విధంగా కేసుల నుంచి బయట పడేయడానికి నానాపాట్లు పడుతున్నదని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత రైతులకు 3 లక్షల విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చామని, పగలు 9 గంటల కరెంటు పూర్తి స్థాయిలో అమలు చేశామన్నారు. ఒంటరిగా ఎన్నికలకు వెళ్లలేని చంద్రబాబు పొత్తుల కోసం పాకులాడుతున్నాడని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడిగా గుర్రంపాటి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడిగా గుర్రంపాటి దేవేంద్రరెడ్డి నియమితులయ్యారు. ఆ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా పులిచర్ల పరందామరెడ్డి (ప్రకాశం జిల్లా), బతుకూరి అప్పిరెడ్డి(ఎన్టీఆర్ జిల్లా)లను నియమించారు. ఏడుగురు జోనల్ ఇన్‌చార్జ్‌లు, 9 మంది కార్యదర్శులతో సహా మొత్తం 19 మందితో పంచాయతీ రాజ్ రాష్ట్ర విభాగాన్ని పార్టీ ఏర్పాటు చేసింది. అలాగే, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా షేక్ ఇస్మాయిల్ (వైఎస్సార్ జిల్లా)ను నియమించింది. అధికార ప్రతినిధిగా మక్దూమ్ మొహిద్దీన్(తిరుపతి), కార్యదర్శులుగా గడ్డం షేక్ మస్తాన్‌వలి(బాపట్ల), షేక్ కరిముల్లా(గుంటూరు), షేక్ దరియావలి (పల్నాడు)లను నియమించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం తెలిపింది.

హిందూపురం అభ్యర్థిని నేనే: పరిపూర్ణానంద

సాక్షి, పుట్టపర్తి: పొత్తు కుదరలేదు.. సీట్లు ఖరారు చేయలేదు.. కలిసి పోటీ చేస్తున్నట్లు అధికారిక ప్రకటన కూడా లేదు. కానీ ఆయా పార్టీల్లోని నాయకులు మాత్రం 'ఫలానా సీటు నాదే' అంటూ ఎవరికి వారు ప్రకటిస్తున్నారు. టీడీపీతో జత కడుతున్నట్లు చెబుతూ.. 'ఈ సీటు నుంచి నేనే పోటీ చేస్తున్నా' అంటూ బీజేపీ, జనసేన నాయకులు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. బీజేపీ తరపున హిందూపురం నుంచి పార్లమెంటుకు పోటీ చేస్తున్నట్లు పరిపూర్ణానందస్వామీజీ ప్రకటించడం చర్చకు దారి తీసింది. దీంతో హిందూపురం ఎంపీ సీటు ఆశిస్తున్న టీడీపీ నేతల్లో గుబులు మొదలైంది.

అధిష్టానంపై టీడీపీలో వ్యతిరేకత

అభ్యర్థుల ఖరారు విషయంలో చంద్రబాబు, నారా లోకేశ్ నాన్చుడు వైఖరిపై ఆ పార్టీ నాయకుల్లో వ్యతిరేకత మొదలైంది. టీడీపీ మద్దతుతో పోటీ చేస్తున్నామని బీజేపీ-జనసేన నాయకులు ఎవరికి వారుగా ప్రకటించుకుంటున్నా టీడీపీ అధిష్టానం నోరుమెదపకపోవడం సరికాదని అంటున్నారు. పరిపూర్ణానంద బీజేపీ నుంచి పోటీ చేస్తే.. ఎన్నో ఏళ్లుగా 'సైకిల్'పై తిరిగిన తమ పరిస్థితి ఏమిటని చాలా మంది సీనియర్లు సందేహంలోపడ్డారు.

సంసిద్ధం దేనికి బాబూ?

ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు



సాక్షి, అమరావతి: 14 ఏళ్లు సీఎంగా ప్రజలకు ఏం మేలు చేశారని చంద్రబాబు సంసిద్ధం అంటూ జనంలోకి వస్తున్నారని ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్‌రావు నిలదీశారు. పేదల భవిష్యత్తును గొప్పగా మార్చే సుపరిపాలనను కొనసాగించేందుకు మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధమా అంటూ సీఎం వైఎస్ జగన్ 'సిద్ధం' సభల్లో పిలుపునిస్తుంటే.. లక్షలాది ప్రజలు ఒక్కసారిగా పిడికిళ్లు బిగించి 'మేం సిద్ధం' అంటూ చేస్తున్న నినాదాలు ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయని చెప్పారు. సీఎం జగన్ సిద్ధం అంటే.. ఓటమి భయంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మేం సంసిద్ధమే అంటూ బలహీనమైన గొంతుతో బేలగా మాట్లాడుతున్నారని దెప్పిపొడిచారు. జూపూడి బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ సిద్ధం అని ఎందుకు అంటున్నారో ప్రతిపక్షాలు గ్రహించడం లేదన్నారు. 'డీబీటీ ద్వారా మళ్లీ రూ.లక్షల కోట్లు పేదల ఖాతాల్లో జమ చేసేందుకు, సుపరిపాలన కొనసాగించేందుకు సీఎం జగన్ సిద్ధం అంటున్నారు. మా బిడ్డల చదువుల కోసం, వారి ఆకలి తీర్చేందుకు జగన్ పరిపాలన కావాలి. మేం ఆయన్ని గెలిపించేందుకు సిద్ధం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎస్సీ వర్గానికి చెందిన గొల్ల బాబూరావును రాజ్యసభకు సీఎం జగన్ పంపారు. ఒక్క ఎస్సీనైనా రాజ్యసభకు పంపావా బాబూ? 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజలకు చేసిన మంచి ఒక్కటంటే ఒక్కటైనా ఉంటే.. అది చెప్పి సంసిద్ధం అనండి. టీడీపీ 80 సీట్లలో మాత్రమే పోటీ చేయాలని అమిత్‌షా చెప్తుంటే తట్టుకోలేక, గుక్కపట్టి ఏడుస్తున్న నువ్వేలా సంసిద్ధం అవుతావ్ బాబూ' అని జూపూడి అన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న సీఎం జగన్‌పై పెయిడ్ వర్కర్స్‌తో విమర్శలు చేయిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు తోక పట్టుకుని తిరుగుతున్న పవన్, బీజేపీ పాత్ర రాష్ట్రంలో ఎంత అని ప్రశ్నించారు.

చంద్రబాబు అస్త్రసన్యాసం!

'భువనేశ్వరి కుప్పం నుంచి పోటీకి దిగితే చంద్రబాబు రాజకీయాల నుంచి తప్పుకుంటాడా? ఎన్నికలకు ముందే ఓటమి భయంతో అస్త్రసన్యాసం చేస్తాడా? ఇదేమన్నా భువనేశ్వరి వెన్నుపోటా? లోకేశ్, భువనేశ్వరిలు ఏమైనా కుట్ర పన్నారా? ఇవన్నీ మాకు అనవసరం. ఇన్నేళ్ల చరిత్ర కలిగిన తెలుగు దేశం పార్టీని తుంగలో తొక్కేస్తున్నావా బాబూ? నీ పార్టీని ముంచేయడానికి సంసిద్ధమవుతున్నావా' అంటూ జూపూడి వ్యాఖ్యానించారు.

జనసేనానీ.. ఇదేం పని ?

- భీమవరంలో పవన్ తీరుపై 'తమ్ముళ్ల' ఫైర్
- పనీపాట లేక వచ్చామా అంటూ నిలదీత?
- మాజీ మంత్రి పితాని, జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మికి టీడీపీ నాయకుల సూటి ప్రశ్న
- పవన్ రాక కోసం టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద నాయకుల నిరీక్షణ
- కలవకుండానే వెనుతిరగడంపై ఆగ్రహం
- ఈసారి భీమవరం వచ్చేది లేదని తెగేసి చెప్పిన నాయకులు



పితాని సత్యనారాయణ, సీతారామలక్ష్మి వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

సాక్షి, భీమవరం: 'జనసేన అధినేత పవన్‌ను ఇప్పుడే కలిసే పరిస్థితి లేదు. రేపు ఎమ్మెల్యే అయితే ఆయన్ను కలవగలమా? ఇదే విషయాన్ని ప్రజలు అంతా అనుకుంటున్నారు. ఇది సరైన పద్ధతి కాదు' అని తెలుగు తమ్ముళ్లు ఫైర్ అయ్యారు. పవన్ బుధవారం భీమవరం పర్యటన సందర్భంగా ఆయన వ్యవహరించిన తీరుపై నేతల ఎదుటే బాహాటంగా విమర్శలు గుప్పిస్తూ నిరసన వ్యక్తం చేశారు. దీనిపై టీడీపీ నేతలు బుజ్జగించే ప్రయత్నం చేసినా సఫలం కాలేదు. పవన్ పర్యటన కోసం మరోసారి తాము భీమవరం వచ్చేది లేదని వీరవాసరం మండలానికి చెందిన నాయకులు తెగేసి చెప్పడం గమనార్హం.

మొదటికే మోసం

జనసేన అధినేత పవన్ పర్యటనతో పార్టీ బలపడుతుందని అత్యాశకు పోగా భీమవరంలో పవన్ వ్యవహరించిన తీరుతో మొదటికే మోసం వచ్చింది. బుధవారం ఉదయం టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఇంటికి వచ్చిన పవన్ ఆ పార్టీ క్యాడర్‌ను కలవకపోవడంతో పనీపాట లేక వచ్చామా అంటు దుమ్మెత్తిపోశారు. పవన్ పర్యటన ఉంటుందని పది రోజులుగా ప్రచారం జరిగింది. రెండు మూడు, పర్యాయాలు పర్యటన వాయిదా పడగా ఎట్టకేలకు భీమవరం చేరుకున్న ఆయన ముందుగా సీతారామలక్ష్మి ఇంటికి చేరుకుని ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన కోసం వేచియున్న టీడీపీ నాయకుల వద్దకు వెళ్లకుండా అక్కడి నుంచి నేరుగా మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఇంటికి వెళ్లిపోవడంతో టీడీపీ కేడర్ తీవ్ర అసంతృప్తికి గురైంది. 'పవన్ వస్తాడని ఉదయం నుంచి పడిగాపులు పడితే మా వద్దకు రాకుండా వెళ్లిపోతారా'? అంటూ మండిపడ్డారు. దీనిపై మాజీ మంత్రి పితాని కార్యకర్తలను బుజ్జగించేందుకు ప్రయత్నించగా ఆయన మాట వినలేదు.

భీమవరంపై ఎటూ తేల్చని పవన్

పవన్ కల్యాణ్ భీమవరం నుంచే పోటీచేస్తారని, దానిపై స్పష్టత ఇస్తారని జనసేన కేడర్ ఆసక్తిగా ఎదురుచూసింది. అయితే ఆయన ఎక్కడా తాను పోటీ చేస్తానన్న విషయాన్ని చెప్పలేదు. జనసేన, టీడీపీ, బీజేపీ పొత్తుల్లో భాగంగా అందరం కలిసి పనిచేద్దామని చెప్పడం మినహా తాను పోటీ చేస్తున్న విషయం బయటపెట్టలేదు. ఉదయం 10:30 గంటలకు భీమవరం చేరుకున్న పవన్ సీతారామలక్ష్మి ఇంటికి వెళ్లారు. తర్వాత టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఇంటికి చేరుకుని వారితో మాట్లాడారు. అక్కడి నుంచి తిరిగి బీజేపీ నేత పాకా వెంకట సత్యనారాయణ ఇంటికి వెళ్లి మంతనాలు చేశారు. తర్వాత పెద అమిరంలోని ఫంక్షన్‌హాల్లో బసచేసి సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో అమరావతి వెళ్లిపోయారు.

కబ్జా చేశానని నిరూపిస్తే ఆస్తులన్నీ రాసిస్తా

ఈనాడు రామోజీరావుకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సవాల్



సాక్షి, అమరావతి: 'నేనుగానీ, నా కుటుంబ సభ్యులుగానీ ఎక్కడైనా సెంటు భూమిని కబ్జా చేశామని ఆధారాలతో నువ్వు నిరూపిస్తే.. నా ఆస్తులన్నీ నీకు రాసిస్తా' అంటూ ఈనాడు రామోజీరావుకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈనాడులో మంగళవారం ప్రచురించిన కథనం నిజమని నిరూపిస్తే.. ఆ రూ. వెయ్యి కోట్ల విలువైన ఆస్తులన్నీ రామోజీకిగానీ, ఆయన పత్రికకుగానీ రాసివ్వడానికి తాను సిద్ధమన్నారు. తన సవాల్‌ను స్వీకరించే దమ్మూ ధైర్యం ఉందా? అంటూ నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోవడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని, ఎల్లో మీడియాతో దాడి చేసి రెచ్చగొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కుటుంబ సభ్యులపై తప్పుడు రాతలా?

రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని నా కుటుంబ సభ్యులపై తప్పుడు రాతలు రాయడం చాలా బాధాకరం. మీ ఇంట్లో ఆడవాళ్లకు సంబంధం లేని విషయాల్ని వారికి అంటగట్టి దుష్ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోగలవా రామోజీ? నా భార్య ఏనాడూ రాజకీయాల్లో తలదూర్చలేదు. గృహిణిగా ఉన్న ఆమెపై సెటిల్‌మెంట్‌లు చేస్తున్నట్లు ఎలా రాస్తారు? ఇష్టమొచ్చినట్లు రాసుకోవడమే పత్రికా స్వేచ్ఛకు అర్థమా? పత్రికను అడ్డంపెట్టుకుని టీడీపీకి వ్యతిరేకంగా ఉండే వారిపై కక్ష తీర్చుకోవడం జర్నలిజమా? రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నాకు కమీషన్లు ఇచ్చినట్లు ఆధారాలుంటే బయటపెట్టండి. లేదంటే, కమీషన్లు ఇచ్చామని చెప్పించగలరా?

అది దాడి ఎలా అవుతుంది?

పత్రికా కార్యాలయంపై దాడి జరిగితే దాన్ని సమర్థించబోము. అయితే మా కార్యకర్తలు కర్నూలు ఈనాడు కార్యాలయం ముందు నిరసన తెలిపితే దాన్ని దాడిగా ఎలా చిత్రీకరిస్తారు? వారి నాయకుడి మీద.. ఆ నాయకుడి కుటుంబం మీద అబద్ధాలతో వార్తలు రాసినప్పుడు ఆమాత్రం నిరసన తెలిపే హక్కు కూడా వారికి లేదనుకుంటున్నారా?. ధైర్యంగా మా మీద అబద్ధాలు రాసినప్పుడు.. మేం అడిగినప్పుడు కూడా ధైర్యంగానే సమాధానం చెప్పాలిగానీ దొంగల్లా ఈనాడు కార్యాలయానికి తాళాలు వేసి ఎందుకు పారిపోయినట్లు? మీ దగ్గర నిజం లేనట్టే కదా? ఇదే విషయంలో ఈనాడుతో పాటు ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ5ల వైఖరిని ఖండిస్తున్నా.

వక్ఫ్ భూములతో నాకు సంబంధం లేదు

పాణ్యం మండలంలోని వక్ఫ్‌బోర్డు భూములతో నాకెలాంటి సంబంధంలేదు. వక్ఫ్‌బోర్డు భూమి మొత్తం కలిపి 250 ఎకరాలుంటే ఈనాడు మాత్రం 500 ఎకరాలని రాసింది. మిగతా భూమిని రామోజీ ఎక్కడ చూపిస్తావ్. కాలబుగ్గలో నా కొడుకు పేరిట ఉన్నది 4.5 ఎకరాల భూమి మాత్రమే. అక్కడ అంతకంటే ఎక్కువ ఉందని అంటే అదంతా నువ్వే తీసుకో రామోజీ. ఒక వ్యక్తిని విమర్శించేటప్పుడు మనమెంత నిజాయితీపరులమో చూసుకోవాలి. మార్గదర్శి సంస్థతో నువ్వు చేసేదేంటి? రిజర్వు బ్యాంకు మార్గదర్శి ద్వారా డిపాజిట్లు సేకరించరాదని ఎందుకు చెప్పింది? చిట్‌ఫండ్ వ్యాపారంతో ఎంత మందిని నిలువునా ముంచావో చెప్పు?. 2014 నుంచి 2019 వరకు బినామీ పేర్లతో తెలుగు దేశం పార్టీ నాయకులు ఏం చేశారో మాకు తెలుసు. మా దగ్గర అన్నీ ఆధారాలున్నాయి. 2019లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక పూడ్చర్లలో ఎవరెవరి బినామీల పేర్ల కింద ఎంత భూమి ఉందో గుర్తించాలని ముఖ్యమంత్రికి కూడా జాబితా ఇచ్చాను.

ఏపీలోని సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలి

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పేరుకే బీసీ అని, ఈ పదేళ్లలో బీసీలకు ఆయన చేసిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాల వల్ల బీసీ విద్యార్థులకు జరుగుతున్న ప్రయోజనాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపాలని జాతీయ బీసీ కమిషన్‌ను కోరినట్టు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ లిల్లి సురేష్, బీసీ కమిషన్ మెంబర్ మారేష్‌లతో కలసి ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ కులం, మతం అనేది చూడకుండా విద్యార్థులను కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు చేసేందుకు విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తెచ్చారని తెలిపారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన వంటి వాటితో బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు బడిబాట పట్టారని తెలిపారు. వీటితో పాటు ఇతర సంక్షేమ పథకాల వల్ల బీసీలు, ఎస్టీలు, ఎస్సీలు ఆర్థికంగా బలపడుతున్నారని వివరించారు. పేద ప్రజలకు, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే పథకాలన్నీ దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం కేంద్రంపై ఉందన్నారు. ఇదే విషయాన్ని తాము జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాంను కలిసి వివరించినట్టు ఆర్ కృష్ణయ్య వివరించారు.

ఏపీలో 28 బీసీ కులాల్ని ఓబీసీలో చేర్చాలి : మారేష్

ఏపీలో ఉన్న 28 బీసీ కులాల్ని ఓబీసీ జాబితాలోకి చేర్చాలని జాతీయ బీసీ కమిషన్‌ను కోరినట్లు ఏపీ బీసీ కమిషన్ మెంబర్ ఎన్.మారేష్ తెలిపారు. ఢిల్లీలోని కమిషన్ చైర్మన్‌ను ఆర్.కృష్ణయ్య, మారేష్‌లు కలసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మారేష్ ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 28 కులాల్ని ఓబీసీలో చేర్చేందుకు సీఎం వైఎస్ జగన్ ఓ అడుగు ముందుకేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. కులాల్ని ఓబీసీలోకి చేర్చాలంటే జాతీయ బీసీ కమిషన్ ఆమోదం అవసరమని, అందుకోసమే తాము చైర్మన్‌ను కలసి వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లు పెట్టారని, వీటికి అనుబంధంగా ఆర్థికపరమైన రాయితీలైన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలల మంజూరుకు బడ్జెట్ కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం అమలు చేసే బీసీ పథకాలకు 60శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని చైర్మన్‌ను కోరినట్లు మారేష్ వివరించారు.

టీడీపీ నెత్తిన చెంగేసుకుని పోవాల్సిందే..

ఏపీ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీపార్వతి



ఏఎన్‌యూ: వచ్చే ఎన్నికల్లో టీడీపీ నెత్తిన చెంగేసుకుని పోవాల్సిందేనని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాలు నిర్వహించారు. లక్ష్మీపార్వతి మాట్లాడుతూ చంద్రబాబుకు కొమ్ముకాస్తున్న పవన్‌కళ్యాణ్ ఓ పిచ్చోడన్నారు. పవన్‌ను అడ్డుపెట్టుకుని చంద్రబాబు ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని, కానీ కాపులు అంత తెలివితక్కువ వాళ్లు కాదని ఆత్మాభిమానం ఉన్న వాళ్లని చెప్పారు. పవన్‌కళ్యాణ్ మాటలు గుడ్డిగా నమ్మేందుకు కాపుసమాజం సిద్ధంగా లేదన్నారు. ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నారని, ఇక కాపులను మభ్యపెట్టలేరని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అఖండ మెజార్టీతో సీఎం కాబోతున్నారని తెలిపారు. ఒక్క రాజ్యసభ సభ్యుడు కూడా లేకుండా అబ్బా, కొడుకులు టీడీపీని దివాలాతీయించారన్నారు. లోకేశ్‌ను పార్టీ నుంచి బహిష్కరించి టీడీపీ కార్యకర్తలు ఎన్టీఆర్ ఆశయాలను బతికించాలన్నారు.

టీడీపీ అంతరించిపోతుంది: ఎమ్మెల్యే మల్లాది

అంతరించిపోతున్న రాజకీయపార్టీ టీడీపీ అని మల్లాది విష్ణు అన్నారు. 55 శాతం ఓట్లతో వైఎస్సార్‌సీపీ మరలా విజయం సాధించబోతున్నదని అన్ని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు.

క్లుప్తంగా...

త్వరలో 'వెలిగొండ'కు సీఎం జగన్

హెలిప్యాడ్, పైలాన్ల ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

పెద్దదోర్నాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో వెలిగొండ ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో హెలిప్యాడ్‌తో పాటు సీఎం ఆవిష్కరించనున్న పైలాన్లను ఇరిగేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. శశిభూషణ్ కుమార్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో రెండో సొరంగంలోకి వెళ్లి భూగర్భంలో 12వ కిలోమీటరు వద్ద నుంచి మొదటి సొరంగంలోకి తీసిన అప్రోచ్ టన్నెల్‌ను పరిశీలించారు. త్వరలోనే మొదటి సొరంగం ద్వారా నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని చెప్పారు. ఆ సమయానికే రిజర్వాయర్ పరిధిలోని నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ పూర్తవుతుందన్నారు.ఈ ప్రాజెక్టుగుండా నీరు విడుదలైతే పశ్చిమ ప్రాంత ప్రజల కష్టాలు తీరతాయని, నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల్లోని లక్షలాది మందికి సాగు, తాగునీరు అందుతుందని అన్నారు. సీఈ మురళీనాథ్ రెడ్డి, ఎస్‌ఈలు పురార్దనరెడ్డి, అబూతాలిం, మేఘా ఏపీపీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులు

హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: స్పెషల్ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టుల భర్తీ విషయంలో బీఈడీ అభ్యర్థులను హైకోర్టు అనర్హులుగా ప్రకటించింది. ఎస్‌జీటీ పోస్టుకు బీఈడీ చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనపై స్టే విధించింది. టెట్ నిర్వహణ మార్గదర్శకాలకు సంబంధించిన జీవో 4కు అనుగుణంగా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, జాతీయ ఉపాధ్యాయ విద్య మండలి (ఎన్‌సీటీఈ) సభ్య కార్యదర్శిని ఆదేశించింది. వీరందరికీ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనుమతించడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరిపిన సీజే ధర్మాసనం, డీఎస్సీ నోటిఫికేషన్‌పై స్టే విధిస్తామని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు రాగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ, ఎస్‌జీటీ పోస్టుల భర్తీ నిమిత్తం ఈ నెల 12న జారీ చేసిన జీవో 11లో ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను కూడా అర్హులుగా పేర్కొన్న నిబంధన 5(2) వరకు స్టే చేయవచ్చునని తెలిపారు. దీంతో ధర్మాసనం ఏజీ వాదనను పరిగణనలోకి తీసుకుంది. కేవలం ఆ నిబంధన వరకే స్టే విధించింది.

వైఎస్సార్‌సీపీకి వేమిరెడ్డి రాజీనామా

నెల్లూరు(దర్గామిట్ట): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం తన పదవులకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో వైఎస్సార్‌సీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విశాఖ-అరకు మధ్య జాతీయ రహదారులను నిర్మించాలి


కేంద్రాన్ని కోరిన ఎంపీ జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ నుంచి అరకును కలిపే రెండు జాతీయ రహదారులను తక్షణమే నిర్మించాలని కేంద్రాన్ని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. బుధవారం కేంద్ర రోడ్లు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌తో ఆయన ఢిల్లీలో సమావేశమయ్యారు. పాత ఎన్‌హెచ్-16పై అగనంపూడి వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను ఇంకా కొనసాగిస్తున్నారని దీని వల్ల స్థానికులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, దాన్ని వెంటనే తొలగించాలని కోరారు.

నిబంధనల ప్రకారమే డీఎస్సీ

ఎటువంటి గందరగోళం లేదు.. అన్నీ స్పష్టంగా ఉన్నాయి

- 2018 డీఎస్సీ నిబంధనల ప్రకారమే ఇప్పుడూ నిర్వహణ
- విషయం తెలియకుండా 'ఈనాడు' తప్పుడు కథనం
- అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టేలా రాతలు
- ఈడబ్ల్యూఎస్ ఆప్షన్ మొదటి నుంచే ఉంది
- డీఎస్సీ వెబ్‌సైట్‌కు సర్వర్ సమస్య ఎప్పుడూ లేదు
- అప్లికేషన్‌ను ఎడిట్ చేసుకొనే అవకాశమూ కల్పించాం
- 'జర్నల్ నంబర్' రాకుంటే ఫీజు వారి ఖాతాలో తిరిగి జమ అవుతుంది
- ఈనెల 25 వరకు ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: డీఎస్సీ-2024లో ప్రతి అంశంలోను పూర్తి జాగ్రత్తలు తీసుకున్నామని, అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. అభ్యర్థులకు నష్టం జరగకుండా జీవో నం.77 ప్రకారం రోస్టర్ పాయింట్లు చూపించామని చెప్పారు. ప్రస్తుత డీఎస్సీని 2018 డీఎస్సీ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తున్నామన్నారు. దరఖాస్తు నుంచి పరీక్ష వరకు అప్పటి నిబంధనలే ఉంటాయని స్పష్టం చేశారు. అయినప్పటికీ 'ఈనాడు' పత్రిక డీఎస్సీ అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టేలా కథనం ప్రచురించిందన్నారు. రోస్టర్ విధానం తెలియకుండా ఆ పత్రిక ప్రచురించిన కథనం డీఎస్సీ అభ్యర్థులను ఆందోళనకు గురిచేసేలా ఉందని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టులో ఇచ్చిన జీవో 77 ప్రకారం అన్ని రోస్టర్లను చూపించామని, కానీ, బ్యాక్‌లాగ్ పోస్టుల విషయంలో ఆ సంవత్సరం రిక్రూట్‌మెంట్ రోస్టర్లను అలాగే కొనసాగించాలని అన్నారు. జీవో ప్రకారం పాయింట్లు ప్రోస్పెక్టివ్‌గానే ఉంటాయిగానీ, రెట్రోస్పెక్టివ్‌గా ఉండదని చెప్పారు. ఆయన చెప్పిన వివరాలివీ..

- ▲ మొదటి దరఖాస్తుదారులకు ఈడబ్ల్యూఎస్ కోటా కనిపించలేదనడంలోనూ వాస్తవం లేదు. దరఖాస్తులు ప్రారంభమైన తేదీ నుంచే ఆప్షన్‌లో ఈడబ్ల్యూఎస్ కోటా ఉంది. ఈనాడులో రాసింది తప్పు.
- ▲ పరీక్ష ఫీజుపైనా తప్పుగా రాశారు. వాస్తవానికి అభ్యర్థి అప్లికేషన్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినప్పుడు మాత్రమే వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది కూడా 2018 డీఎస్సీ నిబంధనే.
- ▲ స్థానికేతర అభ్యర్థులు పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసుకున్న సమయంలో స్థానికేతర ఆప్షన్ (ఓపెన్) ఇవ్వవచ్చు. ఒకసారి ఈ ఆప్షన్ ఎంచుకుని దరఖాస్తు చేసుకుంటే అభ్యర్థి నియామకం కూడా ఎంచుకున్న జిల్లాకే పరిమితం అవుతుంది. ఇదే విధానం జోనల్ పోస్టులకూ వర్తిస్తుంది. అలాగే దరఖాస్తు చేసుకోవాలి.
- ▲ డీఎస్సీ వెబ్‌సైట్‌కు సర్వర్ సమస్య ఎప్పుడూ లేదు. ఇప్పటివరకు టెట్ - 2024కు 3,17,950 దరఖాస్తులు అందాయి. డీఎస్సీకి 3,19,176 మంది నమోదు చేసుకున్నారు. సర్వర్ సమస్య ఉంటే ఇంత మంది దరఖాస్తు చేసుకోలేరు. అభ్యర్థులు కొందరికి ఫీజు చెల్లించే సమయంలో ఇంటర్నెట్ సమస్య ఉత్పన్నమై ఉంటుంది. దరఖాస్తు అనంతరం అభ్యర్థులు అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా కల్పించాం. ఎవరైనా ఫీజు చెల్లించి 'జర్నల్ నంబర్' రాకుంటే చెల్లించిన ఫీజు మొత్తం వారి బ్యాంకు ఖాతాలో ఐదు రోజుల్లో తిరిగి జమ అవుతుంది.
- ▲ డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన ఫిబ్రవరి 12 నుంచే దరఖాస్తు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. బుధవారం వరకు మొత్తం 2,40,119 మంది ఫీజు చెల్లించారు.
- ▲ సెంటర్ టెట్ (సీటెట్) విషయంలో కొందరికి అవగాహన లేదు. వాస్తవానికి ఏపీ విద్యా శాఖ వద్ద సీటెట్ డేటాబేస్ ఉండదు. సీటెట్ అభ్యర్థులు మొత్తం మార్కులు, గరిష్ఠ మార్కులను వారే స్వయంగా నమోదు చేయాలి. ఏపీ టెట్ అభ్యర్థులు మాత్రం హాల్ టికెట్ నంబరు నమోదు చేస్తే సరిపోతుంది.

అభ్యర్థులకు ఎడిట్ అవకాశం

దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్ లేకండా 30 వేల మంది అవస్థలు పడుతున్నారని అనడం కూడా సరికాదు. దరఖాస్తు సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పులు జరిగితే సవరించే అవకాశం లేదని బులెటిన్‌లోనే పేర్కొన్నాం. కానీ అభ్యర్థుల సమస్యను దృష్టిలో ఉంచుకుని అప్లికేషన్‌ను ఎడిట్ చేసుకొనే అవకాశం కల్పించాం. అభ్యర్థులు మొదట వెబ్‌సైట్‌లో డిలీట్ ఆప్షన్ ఎంచుకోవాలి. పాత జర్నల్ నంబర్, మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేసి డిలీట్ ఆప్షన్ పొందవచ్చు. దీని ద్వారా ఎలాంటి రుసుం చెల్లించకుండా తప్పులు సరిదిద్దుకుని తిరిగి అప్లై చేసుకోవచ్చు. ఇందులో అభ్యర్థి పేరు, ఎంచుకున్న పోస్టు, జిల్లా తప్ప మిగిలిన అన్ని అంశాలూ ఎడిట్ చేసుకోవచ్చు. ఒకవేళ అభ్యర్థి తన పేరులో స్పెల్లింగ్ తప్పుగా ఉంటే పరీక్ష కేంద్రంలో నామినల్ రోల్స్‌లో సంతకం చేసే సమయంలో తప్పును సవరించుకునే అవకాశం ఉందని సురేష్ కుమార్ తెలిపారు.

25 వరకు ఫీజు చెల్లింపు గడువు

డీఎస్సీ అభ్యర్థులు ఫీజు చెల్లించే గడువును పెంచినట్టు పాఠశాల కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈనెల 25వ తేదీ రాత్రి 12 గంటల వరకు ఫీజు చెల్లించవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. అలాగే, హెల్ప్ డెస్క్ సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పొడిగించామని తెలిపారు.

సమస్య విన్నారు.. ఆదుకున్నారు

మెదడులో గడ్డతో బాధ పడుతున్న జెర్రిపోతుల పాలెం బాలుడు

- సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన బాలుడి తల్లిదండ్రులు
- తల్లిదండ్రుల ఆవేదన విని చలించిపోయిన సీఎం జగన్
- తక్షణమే రూ.లక్ష ఆర్థిక సాయం చేయాలని కలెక్టర్‌కు ఆదేశం
- వెంటనే బాలుడి తల్లిదండ్రులకు చెక్ అందజేత





సీఎం వైఎస్ జగన్‌కు తన కుమారుడి పరిస్థితి వివరిస్తున్న సత్యకళ.. తల్లిదండ్రులకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఆపన్నులను ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అందె వేసిన చేయి. ఎవరైనా పేదలు వారి బాధను చెప్పుకొన్న వెంటనే స్పందిస్తారు. వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారు. బుధవారం విశాఖకు వచ్చిన సీఎం జగన్ ఇదే విధంగా మెదడులో గడ్డతో బాధ పడుతున్న ఓ బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.పెందుర్తి మండలం జెర్రిపోతులపాలేనికి చెందిన సాలాపు నూకరాజు, సత్యకళ దంపతుల కుమారుడు లీలాధర్ నాయుడు (10)కు చిన్న వయసులోనే మెదడులో క్యాన్సర్ గడ్డ ఏర్పడింది. వయసు పెరిగేకొద్దీ అది పెరిగి గొంతు వరకు వచ్చింది. స్థానిక ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో బెంగుళూరులోని నిమ్‌హాన్స్ ఆసుపత్రిలో చూపించారు. అక్కడ మందుల ఖర్చు ఎక్కువయ్యే పరిస్థితి ఉంది. బుధవారం చినముషిడివాడ వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను నూకరాజు, సత్యకళ దంపతులు కలిశారు. వారి కుమారుడి పరిస్థితిని వివరించారు. సమస్యను సావధానంగా విన్న సీఎం వైఎస్ జగన్ తక్షణమే రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఆదేశించారు. అధికారులు వెంటనే చెక్‌ను సిద్ధం చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జీవీఎంసీ ఏడీసీ సన్యాసిరావు ఆ చెక్‌ను బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.

సీఎం ఎంతో మేలు చేశారు

బాలుడి తల్లి సత్యకళ

మా కుమారుడి పరిస్థితిని చెబుతుంటే సీఎం జగనన్న చలించిపోయారు. వెంటనే మాకు ఆర్థిక సాయం చేయాలని కలెక్టర్‌కి చెప్పారు. తక్షణమే రూ.లక్ష మాకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేతుల మీదుగా ఇచ్చారు. సీఎం జగనన్న మాకు ఎంతో మేలు చేశారు. ఆయన మేలు ఎన్నటికీ మరచిపోలేం.

చంద్రబాబు పనైపోయింది..

పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు (తిరుపతి జిల్లా): కుప్పంలో నారా భువనేశ్వరి ప్రసంగం వింటే చంద్రబాబు పనైపోయిందన్న విషయం అందరికీ అర్థమవుతోందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం తిరుపతి జిల్లా పుత్తూరులో మంత్రి రోజా మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు వయసు రీత్యా రెస్ట్ తీసుకోవాలని, తనకు కుప్పం నుంచి పోటీచేయాలని ఉందని భువనేశ్వరి తన మనస్సులోని మాట చెప్పడం ద్వారా తన పనైపోయిందన్న విషయం చంద్రబాబుకు సైతం అవగతమై ఉంటుందని తెలిపారు. మూడు సార్లు సీఎంగా పనిచేసిన బాబు కుప్పానికి మంచినీళ్లు కూడా ఇవ్వలేకపోయారని దుయ్యబట్టారు.

టీడీపీ కోసమే 'భ్రమరావతి' ఉద్యమం

1,242వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల ధ్వజం



తాడికొండ: రాజధాని ముసుగులో టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకే కులవాదులు, పెత్తందారులు అంతా ఏకమై 'భ్రమరావతి' పేరుతో దొంగ ఉద్యమం చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,242వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. దళితుడిగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అన్న చంద్రబాబు.. అంబేడ్కర్ స్మృతివనం పేరుతో 125 అడుగుల విగ్రహం నిర్మిస్తానని ఐదు సంవత్సరాలపాటు ఆ సామాజిక వర్గాలను మోసం చేశారని ధ్వజమెత్తారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన 2 సంవత్సరాల్లోనే విజయవాడ నడిబొడ్డులో అత్యంత ఖరీదైన ప్రాంతంలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్) నిర్మించి.. పేదల పట్ల తన ప్రేమను చాటుకున్నారని చెప్పారు. సింగపూర్, జపాన్, అమెరికాను తలదన్నే రాజధాని నిర్మిస్తానని చెప్పి ఈ ప్రాంతంలో 3.50 లక్షల కోట్లు దోచుకున్న చంద్రబాబుకు, కరోనా కష్ట కాలంలో రూ.3 లక్షల కోట్లు నేరుగా పేదల ఖాతాలకు అందించిన జగనన్నకు పోలిక ఎక్కడుందని ప్రశ్నించారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి రాజేంద్ర కుమారి, బోదాల సలోమీ, కొమరవల్లి కిషోర్ బాబు, బోదాల సౌమ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, బట్టు రవి, కొలకలూరి లోకేశ్, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బాబు దోపిడీ పాలనకు కాదు.. జగన్ సంక్షేమ పాలనకు ఓటేయండి

- వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల పిలుపు
- పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పథకాలు రూపొందించిన సీఎం జగన్
- అన్ని పదవుల్లో అన్ని వర్గాలకూ సీఎం జగన్ ప్రాధాన్యం
- వైఎస్సార్‌సీపీ డీఎన్‌ఏలో మైనార్టీలు ఉన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: సంక్షేమాభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా ఓటేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబుకు ఓటేస్తే ఖజానాను, ప్రజలను దోపిడీ చేస్తారని చెప్పారు. గతంలో చంద్రబాబు పాలనలో జరిగిన దోపిడీని చూశామని, ఇప్పుడు వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలనను మనందరం ప్రత్యక్షంగా చూస్తున్నామని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ భాషా అధ్యక్షతన జరిగిన మైనార్టీ విభాగం కార్యవర్గ సమావేశంలో సజ్జల మాట్లాడుతూ.. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ముతా సాగించిన అరాచకాలను ఛీకొట్టిన జనం.. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ ఓట్ల కోసం సంక్షేమ పథకాలను రూపొందించలేదన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పథకాలను రూపొందించారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి కలగలిపిన రాష్ట్రంగా సీఎం జగన్ ఏపీని తీర్చిదిద్దుతున్నారని వివరించారు. గత 57 నెలల్లో డీబీటీ రూపంలోనే 87 శాతం పేద కుటుంబాల ఖాతాల్లో రూ.2.55 లక్షల కోట్లను జమ చేశారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా సాధారణ ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకు అన్ని రకాల పదవుల్లో అన్ని వర్గాలకూ సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ డీఎన్‌ఏలోనే మైనార్టీలు ఉన్నారని, అందుకు తగ్గట్టుగానే పార్టీ విధానాలు ఉన్నాయని చెప్పారు. సీఎం జగన్ ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ మైనార్టీలకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. సీఎం జగన్‌కు సునామీలా వస్తున్న ప్రజాదరణను చూసి టీడీపీ, జనసేన భయపడుతున్నాయన్నారు. ప్రభుత్వంపై టీడీపీ ఎంత విష ప్రచారం చేస్తున్నా వాస్తవాలేమిటో ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు. రోగాల సాకుతో స్కిల్ స్కాం కేసులో జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన చంద్రబాబు ఇప్పుడు యువకుడినంటూ తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ దిశానిర్దేశం మేరకు వచ్చే ఎన్నికల్లో 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వచ్చే 50 రోజులు కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ చేసిన మంచిని వివరించాలని, పోలింగ్ రోజున ప్రజలను పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు విజయం చేకూర్చేలా కృషి చేయాలని కోరారు.

నకిలీ పత్రాలు.. ఫోర్జరీ సంతకాలు

హైదరాబాద్‌లో టీవీ 5 సాంబశివరావు పెట్రోల్ బంకు సీజ్



మాదాపూర్‌లో సీజ్ చేసిన సాంబ పెట్రోల్ బంక్ (ఇన్‌సెట్‌లో) టీవీ 5 సాంబ

గచ్చిబౌలి (హైదరాబాద్): ఫోర్జరీ డాక్యుమెంట్లతో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)కు బురిడీ కొట్టించాలనుకున్న టీవీ-5 సాంబశివరావుకు బుర్ర తిరిగిపోయే ఎదురుదెబ్బ తగలింది. భూ యజమానికి తెలియకుండా నకిలీ పత్రాలతో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఆయన నడిపిస్తున్న పెట్రోల్ బంక్‌ను హెచ్‌సీఎల్ ప్రతినిధులు బుధవారం సీజ్ చేశారు. ఫోర్జరీ సంతకాలతో ప్లాట్‌ను అగ్రిమెంట్ చేసుకొని, దాన్ని హెచ్‌పీసీఎల్‌కు లీజుకు ఇచ్చాడని ప్లాట్ యజమాని సరనాల శ్రీధర్‌రావు హెచ్‌పీసీఎల్‌కు చేసిన ఫిర్యాదులో తెలిపారు. దీంతో కంపెనీ అధికారులు రంగంలోకి దిగారు. ఫోర్జరీ చేసిన స్థలానికి బుధవారం కంచె వేయడంతో పాటు పెట్రోల్ బంక్‌ను పాక్షికంగా సీజ్ చేశారు. సాంబశివరావుపై ఇటీవల మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సరనాల శ్రీధర్ భార్యకు శేరిలింగంపల్లిలోని మాదాపూర్ గ్రామం, సర్వే నంబరు-64, హుడా టెక్నో ఎన్‌క్లేవ్, సెక్టార్-3లోని ప్లాట్ నంబరు-26లో 600 చదరపు మీటర్ల (717.60 చదరపు గజాలు) స్థలం ఉంది. 2018లో సాంబశివరావు వీరిని కలిసి, తనకు ఆయిల్ సంస్థలతో మంచి సత్సంబంధాలు ఉన్నాయని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ డీలర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించాడు. ప్లాట్‌కు సంబంధించి అగ్రిమెంట్ చేసుకున్నట్టుగా నకిలీపత్రాలు సృష్టించి ఫోర్జరీ సంతకాలతో భూయజమానులకు తెలియకుండా పెట్రోల్ బంక్ డీలర్‌షిప్‌ను డాక్టర్ కొల్లి సౌమ్య పేరు మీదకు సాంబశివరావు బదలాయించాడు. తన స్థలంలో అక్రమంగా పెట్రోల్ బంక్‌ను నడుపుతున్నట్లు తెలుసుకున్న శ్రీధర్‌రావు 2021లో దీనిపై సాంబను నిలదీశారు. దీంతో హెచ్‌పీసీఎల్‌తో డీలర్‌షిప్ అగ్రిమెంట్‌కు ఒప్పుకోవాలంటూ సాంబ ఒత్తిడి చేశాడు. భయభ్రాంతులకు గురైన శ్రీధర్‌రావు ఆ డీలర్‌షిప్‌ను తమ పేరు మీదకు బదలాయించాలని కోరారు.

లక్షల్లో వసూలు చేసి..

అయితే కొంత నగదు చెల్లిస్తేనే డీలర్‌షిప్‌ను బదలాయిస్తానని సాంబశివరావు చెప్పాడు. వేరే దారిలేక 2021, మార్చిలో రూ.లక్షల్లో నగదు బదలాయించామని శ్రీధర్‌రావు పోలీసులకు చేసిన ఫిర్యాదులో తెలిపారు. అయినప్పటికీ డీలర్‌షిప్‌ను బదలాయించకపోవడంతో ఈ ఏడాది జనవరి 31న శ్రీధర్‌రావు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌పీసీఎల్ ప్రతినిధులకు సైతం శ్రీధర్‌రావు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హెచ్‌పీసీఎల్ అధికారులు సాంబశివరావు నడుపుతున్న పెట్రోల్ బంక్‌ను సీజ్ చేశారు. చీటింగ్ కేసును నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు పరిహారం చెల్లించాల్సిందే

బ్యాంకు, బీమా సంస్థలకు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశం

కర్నూలు(లీగల్): యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల సమన్వయ లోపం కారణంగా రైతులకు పంట నష్టపరిహారం ఎగ్గొట్టడాన్ని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తప్పుబట్టింది. ప్రీమియం నిర్ణీత గడువులోగా చెల్లించిన దరఖాస్తులను రీ అప్‌లోడ్ చేయడంలో బ్యాంకు నిర్లక్ష్యానికి రైతులను బాధ్యులను చేయడం సరికాదని తేల్చిచెప్పింది. రైతుల నుంచి బీమా సంస్థకు ప్రీమియం అందినప్పుడు వారికి పంట నష్టపరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు 39 మంది రైతులకు రూ.15.50 లక్షలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అలాగే పరిహారం, కోర్టు ఖర్చులకు ఒక్కో రైతుకు రూ.13 వేల చొప్పున రూ.5.07 లక్షలు చెల్లించాలని పేర్కొంది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ బుధవారం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలు జిల్లా డోన్ మండలానికి చెందిన పలువురు రైతులు 2018 ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటకు యూనియన్ బ్యాంకు నుంచి క్రాప్ లోన్ తీసుకున్నారు. ఈ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా ఉంది. ఇందులో భాగంగా నిర్ణీత గడువులోగా యూనియన్ బ్యాంకు రైతుల నుంచి ప్రీమియం సేకరించి ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థకు చెల్లించింది. అయితే సరైన వివరాలు లేవంటూ కొందరు రైతుల దరఖాస్తులను ఇన్సూరెన్స్ సంస్థ తిప్పి పంపింది. ఈ దరఖాస్తులను యూనియన్ బ్యాంకు కొద్ది ఆలస్యంతో రీ అప్‌లోడ్ చేసింది. అయితే ఆలస్యంగా దరఖాస్తులు అప్‌లోడ్ చేశారంటూ 780 మంది రైతుల క్లెయింలను బీమా సంస్థ తిరస్కరించింది. ఇందులో 39 మంది రైతులు తమకు న్యాయం చేయాలంటూ జిల్లా కమిషన్‌ను ఆశ్రయించారు.

టెట్, టీఆర్‌టీపై నేడు మధ్యంతర ఉత్తర్వులు

- రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ఆదేశాలివ్వాలన్న పిటిషనర్లు
- ఐదుగురు అభ్యర్థుల కోసం మొత్తం నోటిఫికేషన్లను రద్దు చేయడం సరికాదు
- దీనివల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారు
- ప్రభుత్వ న్యాయవాదుల వాదన



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ), టీచర్ అర్హత పరీక్ష (టెట్)ల మధ్య తగిన సమయం ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల జారీ విషయంలో తన నిర్ణయాన్ని గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీఆర్‌టీ, టెట్ పరీక్షల మధ్య తగిన సమయం ఉండేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.పెద్దిరాజు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత నోటిఫికేషన్లను రద్దు చేసి, రెండు పరీక్షల మధ్య తగిన సమయం ఇస్తూ తిరిగి నోటిఫికేషన్లు జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రామకృష్ణప్రసాద్ మరోసారి విచారణ జరిపారు.

పరీక్షలపై తీవ్ర ప్రభావం..

ప్రభుత్వ న్యాయవాది వీకే నాయుడు వాదనలు వినిపిస్తూ.. ఐదుగురు అభ్యర్థుల కోసం మొత్తం నోటిఫికేషన్లను నిలుపుదల చేయడం సరికాదన్నారు. పరీక్ష నిర్వహణను వాయిదా వేస్తే టీసీఎస్ సంస్థ పరీక్షల నిర్వహణకు మరో స్లాట్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇది పరీక్షలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. దీనివల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని వివరించారు. అందువల్ల పరీక్షల నిర్వహణలో జాప్యం చేయలేమన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపిస్తూ.. టీఆర్‌టీ నిర్వహణ కోసం ఈ నెల 12న, టెట్‌కు 8న నోటిఫికేషన్లు జారీ చేశారని తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన వారు టీఆర్‌టీకి హాజరయ్యేందుకు అర్హులన్నారు. టెట్ ఫలితాలను మార్చి 14న విడుదల చేస్తారని, ఆ మరుసటి రోజే అంటే మార్చి 15న టీఆర్‌టీ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు. టెట్ పరీక్ష సిలబస్ చాలా ఎక్కువని, ఆ పరీక్షకు హాజరయ్యేందుకు ఉన్న గడువు కేవలం 19 రోజులు మాత్రమేనన్నారు. ఇది ఎంత మాత్రం సరిపోదని, టీఆర్‌టీ పరీక్షకు సైతం తక్కువ సమయమే ఉందని వారు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అందువల్ల ఈ విషయంలో తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

సూక్ష్మ ప్రణాళికలతో పోలింగ్ నమోదు శాతం పెంచండి

జిల్లాల స్వీప్ నోడల్ అధికారులను ఆదేశించిన సీఈవో ముకేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ నమోదు శాతాన్ని విస్తృత స్థాయిలో పెంచేందుకు స్వీప్ సూక్ష్మ ప్రణాళికలను అమలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లాల స్వీప్ నోడల్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం స్వీప్ అధికారుల బృందం రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాల (SVEEP& Systematic Voters' Education & Electoral Participation) అమలు పై అన్ని జిల్లాల స్వీప్ నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సమీక్షా సమావేశం ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా పాల్గొని అన్ని జిల్లాల స్వీప్ నోడల్ అధికారులకు దిశ, నిర్దేశం చేశారు. జిల్లా స్థాయితోపాటు నియోజకవర్గ, పోలింగ్ స్టేషన్ల స్థాయిలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా స్వీప్ సూక్ష్మ ప్రణాళికలను రూపొందించి, అమలు చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లు ఓటు హక్కు వినియోగంపై గణనీయమైన శ్రద్ధ చూపడం లేదనీ, ఇటువంటి వారికి అవగాహన కల్పించి, ఎన్నికల్లో పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని ఆయన తెలిపారు.

స్వీప్ కార్యక్రమాలపై ఎన్నికల సంఘం అధికారుల సంతృప్తి

ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న భారత ఎన్నికల సంఘం అధికారుల బృందం రాష్ట్రంలో అమలు చేస్తున్న స్వీప్ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేసింది. అధికారుల బృందం సభ్యుడు సంతోష్ కుమార్ (కార్యదర్శి) మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతస్థాయిలో అమలు చేయాలని సూచించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో అత్యల్ప స్థాయి పోలింగ్ శాతం నమోదైన కేంద్రాలను గుర్తించి కారణాలు విశ్లేషించి, పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాల వారీగా అమలు చేస్తున్న ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాలను ఆయా జిల్లాల స్వీప్ నోడల్ అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

ఎన్నికల్లో 83% పైగా పోలింగ్ నమోదే లక్ష్యం

రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదే లక్ష్యంగా ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలుపరుస్తున్నట్లు సీఈవో ముకేష్ కుమార్ మీనా తెలిపారు. స్వీప్ అధికారుల బృందం సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా సగటున 79.77% పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు అయ్యే లక్ష్యంతో స్వీప్ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్వీప్ అధికారుల బృందం సభ్యులు సంతోష్ కుమార్ (కార్యదర్శి), రాహుల్ కుమార్, ఆర్కేసింగ్‌తో పాటు అదనపు సీఈవో ఎం.ఎన్. హరెంధిర ప్రసాద్ ఈ చర్చల్లో పాల్గొన్నారు.

స్పోర్ట్స్



యూఏఈ క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా లాల్‌చంద్ రాజ్‌పుత్

భారత మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుకు హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. పాకిస్తాన్‌కు చెందిన ముదస్సర్ నాజర్ స్థానంలో 62 ఏళ్ల రాజ్‌పుత్‌ను నియమించారు. నాజర్ కోచింగ్‌లోని యూఏఈ జట్టు ఈ ఏడాది వెస్టిండీస్, అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. రాజ్‌పుత్ కెరీర్‌లో రెండు టెస్టులు, నాలుగే వన్డేలు ఆడారు. 2007లో భారత్ గెలిచిన తొలి టి20 ప్రపంచకప్‌లో జట్టు కోచ్‌గా వ్యవహరించారు.



భారత బాస్కెట్‌బాల్ జట్టు కోచ్‌గా సంతోష్

ఆసియా కప్ సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు కోచ్‌గా తెలంగాణకు చెందిన పి.ఎస్.సంతోష్ ఎంపికయ్యాడు. ఈ టోర్నీ కజకిస్తాన్‌లో ఈనెల 23 నుంచి 26 వరకు జరుగుతుంది. గ్రూప్ ‘ఇ’లో భారత్‌తోపాటు ఖతర్, కజకిస్తాన్, ఇరాన్ జట్లున్నాయి. భారత జట్టులో విశేష్, అరవింద్, ముయిన్ బెక్, ప్రణవ్ ప్రిన్స్, అమృత్‌పాల్, గుర్బాజ్, పల్‌ప్రీత్, అమరేంద్ర, వైశాఖ్, ప్రిన్స్‌పాల్ సింగ్, సహజ్‌ప్రతాప్ సింగ్, బాలదానేశ్వర్ సభ్యులుగా ఉన్నారు.



సాకేత్ జోడీ సంచలనం

పుణే: మహారాష్ట్ర ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ సంచలన విజయంతో బోణీ కొట్టింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-రామ్ ద్వయం 7-6 (7/5), 6-4తో రెండో సీడ్ పీటర్ మటూవ్‌స్కీ (పోలాండ్)-మాథ్యూ రోమియోస్ (ఆస్ట్రేలియా) జంటను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్ జోడీ మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో అర్జున్-జీవన్ (భారత్) 6-3, 6-3తో రిత్విక్ చౌదరీ-నికీ పూనాచా (భారత్)లపై నెగ్గగా... గంటా సాయి కార్తీక్ రెడ్డి-కరణ్ (భారత్) 6-3, 3-6, 4-10తో ట్రిస్టన్-వాల్టన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడారు.

భారత్ శుభారంభం



అలాన్యా: టర్కిష్ కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో భారత జట్టు శుభారంభం చేసింది. తొలి పోరులో భారత మహిళల బృందం 4-3 గోల్స్ తేడాతో ఎస్టోనియాపై విజయం సాధించింది. భారత సీనియర్ మహిళల జట్టు చరిత్రలో ఒక యూరోపియన్ టీమ్‌పై గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. భారత్ తరఫున మనీషా కల్యాణ్ రెండు గోల్స్ (17వ ని.లో, 81వ ని.లో) సాధించగా... ఇందుమతి (62వ ని.లో), ప్యారీ (79వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. ఎస్టోనియా ప్లేయర్లలో లిసెట్ తమిక్ (32వ ని.లో), వ్లాదా (88వ ని.లో), లిస్ లిలెమా (90వ ని.లో) ఒక్కో గోల్ నమోదు చేశారు.

ప్రీక్వార్టర్స్‌లో భారత జట్ల ఓటమి

ప్రపంచ టీటీ టీమ్ చాంపియన్‌షిప్

బుసాన్: పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారు కావడానికి అవసరమైన విజయాన్ని భారత మహిళల, పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లు సాధించలేకపోయాయి. పటిష్ట జట్లతో జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో భారత జట్లు ఓడిపోయి ప్రపంచ టీటీ టీమ్ చాంపియన్‌షిప్ నుంచి నిష్క్రమించాయి. బుధవారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో భారత మహిళల జట్టు 1-3తో చైనీస్ తైపీ జట్టు చేతిలో... భారత పురుషుల జట్టు 0-3తో దక్షిణ కొరియా జట్టు చేతిలో ఓడిపోయాయి. అంతకుముందు జరిగిన నాకౌట్ దశ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 3-0తో ఇటలీపై... భారత పురుషుల జట్టు 3-2తో కజకిస్తాన్‌పై విజయం సాధించాయి. ఈ మెగా ఈవెంట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో క్వార్టర్ ఫైనల్ చేరిన 8 జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. మార్చి 5న విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-16లో చోటు సంపాదిస్తే భారత జట్లకు పారిస్ ఒలింపిక్ బెర్త్‌లు లభిస్తాయి. ప్రస్తుతం



భారత మహిళల జట్టు 17వ ర్యాంక్‌లో, భారత పురుషుల జట్టు 15వ ర్యాంక్‌లో ఉన్నాయి.

చైనీస్ తైపీతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా 11-8, 8-11, 4-11, 11-9, 11-9తో ప్రపంచ 10వ ర్యాంకర్ చెన్ జు యుపై సంచలన విజయం సాధించి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ 6-11, 9-11, 5-11తో చెంగ్ ఐ చింగ్ చేతిలో... మూడో



మ్యాచ్‌లో ఐహిక ముఖర్జీ 10-12, 13-15, 11-9, 2-11తో లి యు జున్ చేతిలో... నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా 10-12, 11-5, 9-11, 5-11తో చెంగ్ ఐ చింగ్ చేతిలో ఓడిపోవడంతో భారత పరాజయం ఖరారైంది.

కొరియాతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 10-12, 11-13, 7-11తో జాంగ్ వూజిన్ చేతిలో... రెండో మ్యాచ్‌లో ఆచంట శరత్ కమల్ 9-11, 5-11, 11-8, 4-11తో లిమ్ జాంగ్‌హూన్ చేతిలో... మూడో మ్యాచ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ 5-11, 8-11, 2-11తో లీ సాంగ్ హు చేతిలో ఓటమి పాలయ్యారు.

ఆసీస్‌ను గెలిపించిన టిమ్ డేవిడ్

ఆఖరి బంతికి ఫోర్ కొట్టిన ఆసీస్ బ్యాటర్ ● తొలి టి20లో న్యూజిలాండ్ ఓటమి

వెల్లింగ్టన్: ఆఖరి బంతిదాకా ఉత్కంఠ రేపిన తొలి టి20 మ్యాచ్‌లో టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు ఆస్ట్రేలియాను గెలిపించాయి. న్యూజిలాండ్‌తో జరిగిన ఈ పోరులో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీస్కోరు చేసింది. రచిన్ రవీంద్ర (35 బంతుల్లో 68; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), కాన్వే (46 బంతుల్లో 63; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆసీస్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (15 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ వార్నర్ (20 బంతుల్లో 32; 1 ఫోర్, 3 సిక్స్‌లు) తక్కువే చేసినా... ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ మార్ష్ (44 బంతుల్లో 72 నాటౌట్; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 17వ ఓవర్ ఆఖరి బంతికి హిట్టర్ టిమ్ డేవిడ్ క్రీజులోకి వచ్చాడు. అప్పుడు ఆసీస్ గెలిచేందుకు 19 బంతుల్లో 44 పరుగులు కావాలి. కాసేపటికే అది కాస్తా 9 బంతుల్లో 32 పరుగుల సమీకరణం కష్టంగా మారింది. ఈ దశలో మిల్నే వేసిన 19వ ఓవర్ ఆఖరి మూడు బంతుల్ని డేవిడ్ 4, 6, 6లుగా బాదేశాడు. దాంతో చివరి ఓవర్లో ఆసీస్ విజయానికి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. చివరి ఓవర్ వేసిన సౌతీ వైడ్ సహా 3 బంతుల్లో 4 పరుగులే ఇచ్చాడు. ఇక మిగిలిన 3 బంతుల్లో 12 పరుగులు కావాల్సి ఉండగా... డేవిడ్ 6, 2, 4లతో ఆసీస్ జట్టును గెలిపించాడు. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టి20 మ్యాచ్ శుక్రవారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.



యశస్వి @ 15

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 14 స్థానాలు ఎగబాకిన భారత ఓపెనర్

దుబాయ్: భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రీజులోనే కాదు... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్తున్నాడు. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో వరుస టెస్టుల్లో డబుల్ సెంచరీలతో అదరగొట్టిన జైస్వాల్ ఐసీసీ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 15వ స్థానానికి చేరుకున్నాడు. 22 ఏళ్ల ఈ ఓపెనర్ ఏకంగా 14 స్థానాల్ని మెరుగుపర్చుకొని తొలిసారి టాప్-20లోకి వచ్చాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ 12వ, శుబ్‌మన్ గిల్ 35వ స్థానాల్లో ఉన్నారు. అరంగేట్రం టెస్టులో రెండు అర్ధసెంచరీలు సాధించిన సర్ఫరాజ్ 75వ ర్యాంకులో ఉన్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు దూరంగా ఉన్నప్పటికీ స్టార్ బ్యాటర్



విరాట్ కోహ్లి ఒక్కడే భారత్ తరఫున టాప్-10లో ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు. రాజ్‌కోట్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బ్యాటర్ల జాబితాలో 41 నుంచి 34వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఈ టెస్టులో శతకం సహా ఏడు వికెట్లు తీసిన జడేజా బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 9 నుంచి 6వ స్థానానికి చేరాడు. 500 వికెట్ల క్లబ్‌లో చేరిన అశ్విన్ ఒకస్థానం మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌లో నిలువగా, బుమ్రా టాప్ ర్యాంక్‌లోనే కొనసాగుతున్నాడు.

‘టాప్’ పుణేరి పల్టన్

పంచ్‌కుల: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. బుధవారంతో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. పుణేరి పల్టన్ 40-38తో యూపీ యోధాస్‌పై గెలిచి ఓవరాల్‌గా 96 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 53-39తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. పుణేరి పల్టన్, జైపూర్ పింక్ పాంథర్స్, దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్ టాప్-6లో నిలిచి ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించాయి. ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ప్లే ఆఫ్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.



‘షూటౌట్’లో నెదర్లాండ్స్ చేతిలో భారత్ పరాజయం

రూర్కెలా: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) పురుషుల ప్రొ లీగ్‌లో తొలి అంచె పోరులో నెదర్లాండ్స్‌ను కంగుతినిపించిన భారత్‌కు రెండో అంచెలో పరాజయం ఎదురైంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ‘షూటౌట్’లో 2-4తో ఓడిపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. షూటౌట్‌లో అరిజీత్ సింగ్, లలిత్ ఉపాధ్యయ్ మాత్రమే సఫలం కాగా, సుఖ్‌జీత్, షంషేర్ సింగ్ విఫలమయ్యారు. అయితే డచ్ జట్టులో డి మోల్ జోప్, డుకో, బ్రింక్‌మన్ థియెరి, క్రూన్ జొరిట్ గోల్ చేసి గెలిపించారు.

పేస్ బౌలర్ల ప్రదర్శన వల్లే...

విజయాలు దక్కాయన్న గిల్



రాంచీ: ఇంగ్లండ్‌తో గత రెండు టెస్టుల్లో భారత జట్టు విజయం సాధించడంలో పేస్ బౌలర్లు ప్రధాన పాత్ర పోషించారని జట్టు బ్యాటర్ శుబ్‌మన్ గిల్ అభిప్రాయపడ్డాడు. పిచ్‌లు అనుకూలంగా లేకపోయినా కీలక సమయాల్లో వారు చెలరేగడం వల్లే మ్యాచ్‌లు మనవైపు మొగ్గు చూపాయని అతను అన్నాడు. ఈ సిరీస్‌లో భారత స్పిన్నర్లు తీసిన 36 వికెట్లతో పోలిస్తే పేసర్లు 22 వికెట్లు తీశారు. ‘సాధారణంగా భారత్‌లో దాదాపు అన్ని పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తూనే ఉంటాయి. అశ్విన్, జడేజాలు ఎలాగూ ఇక్కడ వికెట్లు తీయగలరు. కానీ మన ఫాస్ట్ బౌలర్ల ప్రదర్శనే సిరీస్‌లో ఇరు జట్ల మధ్య ప్రధాన తేడాగా మారింది. పరిస్థితులకు తగినట్లుగా స్పందించి పేసర్లు జట్టును ముందంజలో నిలిపారు. నాలుగో టెస్టుకు బుమ్రాలాంటి స్టార్ బౌలర్ దూరం కావడం నిరాశ కలిగించేదే. అయినా ఇతర పేసర్లకూ మంచి అనుభవం ఉంది. సిరాజ్ తీసిన నాలుగు వికెట్ల ప్రదర్శనను మరచిపోవద్దు’ అని గిల్ ప్రశంసించాడు. పలువురు కీలక ఆటగాళ్లు దూరం కావడం వల్ల వచ్చిన అవకాశాలను కొత్త ఆటగాళ్లు సమర్థంగా వాడుకున్నారన్న గిల్... సర్ఫరాజ్ ఖాన్, యశస్వి జైస్వాల్‌లను ఉదాహరణగా చూపించాడు. తనపై తాను పెట్టుకున్న అంచనాల కారణంగానే కొన్నిసార్లు నిరాశను ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఇప్పుడు వాటిని అధిగమించి భారీ స్కోర్లపై దృష్టి పెట్టినట్లు అతను చెప్పాడు. తొలి టెస్టులో శుభారంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయినా భారత జట్టు...ఆ మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకొని తర్వాతి రెండు టెస్టుల్లో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచినట్లు గిల్ గుర్తు చేసుకున్నాడు.

సినిమా



గల్లీ సౌండుల్లో భీమా

గోపీచంద్ హీరోగా నటించిన చిత్రం ‘భీమా’. ఎ.హర్ష దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లు. కేకే రాధామోహన్ నిర్మించిన ‘భీమా’ మార్చి 8న రిలీజ్ కానుంది. రవి బస్రూర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని ‘గల్లీ సౌండుల్లో..’ అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. రవి బస్రూర్, సంతోష్ వెంకీ రాసిన ఈ పాటను సంతోష్ వెంకీ పాడారు. ‘‘గోపీచంద్ పాత్ర గురించి చెప్పే ట్రాక్ ఇది. ఈ పాట మాస్‌ని అలరించేలా ఉంటుంది’’ అన్నారు మేకర్స్.



త్రిష థగ్ లైఫ్ ఆరంభం

‘**థ**గ్ లైఫ్’ను ఆరంభించారు హీరోయిన్ త్రిష. ‘నాయగన్’ (తెలుగులో ‘నాయకుడు’) తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా ‘థగ్ లైఫ్’. ‘జయం’ రవి, త్రిష, దుల్కర్ సల్మాన్, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ముఖ్య తారలుగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే ప్రారంభమైంది. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అయ్యారు త్రిష. సెట్స్‌లో ‘థగ్ లైఫ్’ స్క్రిప్ట్‌ను పట్టుకుని ఉన్నట్లుగా ఇన్‌స్టా స్టోరీలో త్రిష ఓ చిన్న వీడియోను షేర్ చేశారు. దీంతో ‘థగ్ లైఫ్’ సినిమా షూటింగ్‌లో త్రిష జాయిన్ అయ్యారని స్పష్టం అయింది. ప్రస్తుతం చెన్నైలో జరుగుతున్న ఈ సినిమా షెడ్యూల్ పూర్తవ్వగానే, నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ కోసం టీమ్ సెర్బియా వెళుతుందని కోలీవుడ్ సమాచారం. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్, మణిరత్నం, ఏ. శివ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

త్రిషకు క్షమాపణలు చెప్పిన ఏవీ రాజు: త్రిషను ఉద్దేశించి తమిళనాడు రాజకీయ నేత ఏవీ రాజు రెండు రోజుల క్రితం చేసిన కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ విషయంపై లీగల్‌గా ముందుకు వెళ్తానని త్రిష పేర్కొన్నారు. అనంతరం మంగళవారం రాత్రి ఏవీ రాజు స్పందించారు. తాను ఏ యాక్టర్‌నీ టార్గెట్ చేయాలనుకోవడం లేదని, తన మాటలు తప్పుగా అర్థం చేసుకోబడ్డాయని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని ఓ వీడియోను రిలీజ్ చేశారు ఏవీ రాజు.

● త్రిష

కథని నమ్మి చేశారనిపిస్తోంది



● వరుణ్ తేజ్, అభినవ్ గోమఠం

‘‘**వి**భిన్న పాత్రల ద్వారా ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న అభినవ్ ‘మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా’ చిత్రంలో తొలిసారి హీరోగా చేశాడు. ఈ చిత్రంతో తనకు మంచి సక్సెస్ రావాలి. టీజర్, ట్రైలర్ చూస్తే కథని నమ్మి చేసిన సినిమాలా అనిపిస్తోంది. టీమ్ అంతా చాలా నమ్మకంగా ఉన్నారు. ఈ చిత్రం విజయం సాధించి, దర్శక, నిర్మాతలకు మంచి బ్రేక్ రావాలని ఆశిస్తున్నాను’’ అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. అభినవ్ గోమఠం, వైశాలి రాజ్ జంటగా తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వం వహించిన చిత్రం ‘మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా’. కాసుల క్రియేటివ్ వర్క్స్‌పై భవాని కాసుల, ఆరెం రెడ్డి, ప్రశాంత్.వి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా హాజరై, మూవీ బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. అభినవ్ గోమఠం మాట్లాడుతూ– ‘‘ఈ సినిమా కోసం నా కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. అయినా ఈ మూవీలో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను’’ అన్నారు. ‘‘నాకు తొలి అవకాశం ఇచ్చిన అభినవ్‌కు, నిర్మాతలకు రుణపడి ఉంటాను. ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను’’ అన్నారు తిరుపతి రావు. ‘‘ప్రేక్షకులకు నచ్చే అంశాలున్న ఈ సినిమా విజయం సాధించాలి’’ అన్నారు భవాని కాసుల.

ఘనంగా జాకీ-రకుల్‌ల వివాహం



● జాకీ భగ్నానీ, రకుల్

నటుడు-నిర్మాత జాకీ భగ్నానీ, హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్‌ల వివాహం సౌత్ గోవాలో బుధవారం వైభవంగా జరిగింది. రెండు కుటుంబాల సభ్యులు, సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో జాకీ, రకుల్ ఏడడుగులు వేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో పెళ్లి జరిగిందని బాలీవుడ్ సమాచారం. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అనన్యా పాండే తదితర ప్రముఖులు పెళ్లికి హాజరయ్యారు. ఇక 2021 అక్టోబరులో తమ రిలేషన్‌షిప్‌ను అధికారికంగా ప్రకటించారు జాకీ, రకుల్. నిజానికి జాకీ-రకుల్‌ల వివాహం ఫారిన్‌లో జరగాల్సింది. కానీ సెలబ్రిటీలు భారతదేశంలోనే వివాహాలు చేసుకోవాలన్నట్లుగా భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీంతో జాకీ- రకుల్ తమ నిర్ణయాన్ని మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకున్నారు.



● నిఖిల్

మా నాన్నే వచ్చారనుకుంటున్నాను

హీరో నిఖిల్ సిద్ధార్థ్ తండ్రయ్యారు. ఆయన సతీమణి డా. పల్లవి వర్మ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చారు. ‘‘జీవితం అనేది వృత్తంలాంటిది. గత ఏడాది మా నాన్నగారు మాకు దూరం అయ్యారు. ఇప్పుడు మా కుటుంబంలోకి కొత్త సభ్యుడు చేరాడు. మా నాన్నే వచ్చారనుకుంటున్నాను’’ అంటూ తన కుమారుడిని ముద్దాడుతున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు నిఖిల్.

ఆమె కళ్లు వేటాడతాయి!



బాలీవుడ్ హారర్ కామెడీ ఫ్రాంచైజీలో ‘భూల్ భూలయ్యా’ ఒకటి. 2007లో విడుదలైన ‘భూల్ భూలయ్యా’, 2022లో విడుదలైన ‘భూల్ భూలయ్యా 2’ చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. తాజాగా ‘భూల్ భూలయ్యా 3’ చిత్రీకరణ జరుగుతోంది. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్ ప్రధాన పాత్రలు చేస్తున్నారు. ‘భూల్ భూలయ్యా’ ఫ్యామిలీలో ‘యానిమల్’ ఫేమ్ త్రిప్తి దిమ్రీ చేరారు. ‘‘ఆమె నవ్వు భయం పుట్టిస్తుంది. ఆమె కళ్లు వేటాడతాయి... అలాగే !భయపెడతాయి. మిస్టరీ గాళ్’’ అంటూ ఈ సినిమాలో త్రిప్తి దిమ్రీ పాత్రను వివరించారు మేకర్స్.

● త్రిప్తి దిమ్రీ

దిష్టి బొమ్మ కథేంటి అని చూపిస్తున్నాం



● స్నేహాల్, శశిధర్

‘‘**భూ**తద్దం భాస్కర్ నారాయణ’ చిత్రం డిటెక్టివ్ థ్రిల్లర్‌గా రూపొందింది. డిటెక్టివ్ కథని పురాణాలతో ముడిపెట్టిన విధానం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది’’ అని నిర్మాతలు స్నేహాల్, శశిధర్ అన్నారు. శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం ‘భూతద్దం భాస్కర్ నారాయణ’. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ మూవీ మార్చి 1న రిలీజవుతోంది. స్నేహాల్, శశిధర్ మాట్లాడుతూ– ‘‘2014లో ‘షీష్ మహల్’ అనే ఇండిపెండెంట్ సినిమా, 2020లో ‘నీతో’ మూవీ చేశాం. 2022లో ‘భూతద్దం భాస్కర్ నారాయణ’ ప్రయాణం ఆరంభమైంది. ప్రతి ఇంటి ముందు దిష్టి బొమ్మ ఉంటుంది.. దాని వెనక ఉన్న కథ ఏంటి? అన్నదానికి ఫ్యాంటసీ ఎలిమెంట్‌ని జోడించి ఈ కథని తీశాడు పురుషోత్తం’’ అన్నారు.



● అక్షయ్, టైగర్ ష్రాఫ్

భగ్గుమంటే నిప్పుల వానే..

‘‘**ను**వ్వు భగ్గుమంటే నిప్పుల వానే... నిన్ను చుట్టుకున్న గాలిని నేనే.. నీకు ఎప్పుడైనా తోడు ఉంటానే...’ (అక్షయ్‌కుమార్), ‘నువ్వు చిరుతను మించి కిలాడి.. ఈ దునియాను చేసుకో దాడి’ (టైగర్ ష్రాఫ్) అంటూ సాగుతాయి హిందీ చిత్రం ‘బడే మియా చోటే మియా’ సాంగ్ తెలుగు లిరిక్స్. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ కీలక పాత్రధారిగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ చిత్రం ఇది. ఈ చిత్రం ఈ ఏడాది రంజాన్‌కు విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ‘బిందాస్ బడే భయ్యా...’ అంటూ సాగే ఈ సినిమా టైటిల్ ట్రాక్‌ను విడుదల చేశారు. విశాల్ మిశ్రా సంగీత సారథ్యంలో సురేష్ బనిశెట్టి తెలుగు లిరిక్స్ అందించిన ఈ పాటను దీపక్, శరత్ సంతోష్ పాడారు.



సస్పెన్స్.. థ్రిల్

‘**కాం**చన 3, రూలర్’ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘ఫియర్’. హరిత గోగినేని దర్శకత్వం వహించిన ఈ మూవీలో అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మించారు. కాగా బుధవారం (ఫిబ్రవరి 21) వేదిక పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ‘‘సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘ఫియర్’. ఇందులో వేదిక క్యారెక్టర్ కొత్తగా ఉంటూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనుంది. ఆమె కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన చిత్రం అవుతుంది. ప్రస్తుతం ‘ఫియర్’ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: ఐ. ఆండ్రూ, సహ నిర్మాతలు: సుజాత రెడ్డి, సామ సురేందర్ రెడ్డి.

● వేదిక

సాక్షి బిజినెస్
గురువారం
22-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	434	72,623
నిఫ్టీ ▽	142	22,055

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్డాక్	15,507	▽	123
డోజోన్స్	38,492	▽	72
ఎఫ్టీఎస్ఈ 100	7,663	▽	57
డాక్స్	17,118	△	50
షాంఘై	2,951	△	28
నికాయ్	38,262	▽	101

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,258	△	119
బంగారం (99.5 స్వచ్ఛత)	62,009	△	119
వెండి (కేజీ)	70,708	▽	109

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.51	83.53
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.62	106.16
€	యూరో	ఒకటి	88.61	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.76	56.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.58	55.50
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.41	64.01
SAR	సౌదీ రియాల్	ఖాయమవుతుంది	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమవుతుంది	21.96	23.49
¥	చైనా యువాన్	ఖాయమవుతుంది	10.42	12.49

విదేశీ రోడ్లపై మన స్కూటర్లు రయ్

- ఎగుమతుల్లో కొత్త రికార్డులు
- 10 నెలల్లో 4,21,096 యూనిట్లు
- 2022–23లో ఈ సంఖ్య 4,16,935



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్లో తయారైన స్కూటర్లు విదేశీ గడ్డపై పరుగులు తీస్తున్నాయి. 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్య 4,21,096 యూనిట్ల స్కూటర్లు పలు దేశాలకు ఎగుమతి అయ్యాయి. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 24 శాతం అధికం. 2022–23లో విదేశాలకు సరఫరా అయిన స్కూటర్ల సంఖ్య 4,16,935 యూనిట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఎగుమతుల పరిమాణాన్ని ఈ పది నెలల కాలంలోనే దాటడం విశేషం. ప్రస్తుత వేగాన్నిబట్టి చూస్తే 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతయ్యే స్కూటర్ల సంఖ్య 5,00,000 యూనిట్లు దాటడం ఖాయంగా కనిపిస్తోంది. మేడిన్ ఇండియా వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో ఉందో ఈ గణాంకాలనుబట్టి అవగతమవుతోంది.

స్కూటర్ల ఎగుమతుల్లోనే వృద్ధి..

భారత్ నుంచి విదేశాలకు 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్య 12 శాతం క్షీణతతో 28,03,217 యూనిట్ల ద్విచక్ర వాహనాలు చేరాయి. 2022 ఏప్రిల్–2023 జనవరి మధ్య ఈ సంఖ్య 31,71,461 యూనిట్లుగా ఉంది. జనవరితో ముగిసిన 10 నెలల కాలంలో ఎగుమతుల్లో మోటార్సైకిల్స్ 16 శాతం, మోపెడ్స్ 43 శాతం తిరోగమన వృద్ధి సాధించాయి. స్కూటర్స్ మాత్రమే వృద్ధి నమోదు చేశాయి. స్కూటర్ల ఎగుమతులు 2013–14లో 93,931 యూనిట్లు నమోదైంది. ఏటా పరిమాణం పెరుగుతూ 2018–19లో ఏకంగా 3,98,316 యూనిట్ల ఎగుమతులను సాధించింది. ఆ తర్వాతి సంవత్సరాల్లో క్షీణిస్తూ 2020–21లో 2,32,020 యూనిట్లతో సరిపెట్టుకుంది. తిరిగి 2021–22 నుంచి వృద్ధిలో పయనించింది. 2013–14 నుంచి 2024 జనవరి వరకు విదేశాలకు చేరిన స్కూటర్ల సంఖ్య మొత్తం 33,44,223 యూనిట్లు నమోదయ్యాయి.

అగ్ర స్థానంలో హోండా..

స్కూటర్ల ఎగుమతుల్లో హోండా మోటార్సైకిల్స్, స్కూటర్స్ ఇండియా తొలి స్థానంలో ఉంది. 2024 జనవరితో ముగిసిన 10 నెలల కాలంలో ఈ కంపెనీ 1,87,305 యూనిట్ల స్కూటర్లను విదేశాలకు సరఫరా చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో టీవీఎస్ మోటార్ కో, సుజుకీ మోటార్సైకిల్స్ ఇండియా, ఇండియా యమహా మోటార్, హీరో మోటోకార్ప్, పియాజియో వెహికల్స్, ఏథర్ ఎనర్జీ, బజాజ్ ఆటో నిలిచాయి. ఇక దేశీయంగా ద్విచక్ర వాహనాల అమ్మకాలు హోల్సేల్లో 2024 జనవరిలో 26 శాతం వృద్ధితో 14.9 లక్షల యూనిట్లు జరిగాయి. 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య ఈ సంఖ్య 11 శాతం అధికమై 1.49 కోట్ల యూనిట్లను తాకింది. పరిమాణం తక్కువ అయినప్పటికీ ఎలక్ట్రిక్ స్కూటర్ల ఎగుమతులు సైతం అనూహ్య వృద్ధి సాధించాయి. 2023 ఏప్రిల్–2024 జనవరిలో 586 శాతం ఎగసి 412 యూనిట్ల ఈ–స్కూటర్లు విదేశాలకు సరఫరా అయ్యాయి.

ఫోన్పే ఇండస్ యాప్ స్టోర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత డిజిటల్ ప్రయాణంలో సరికొత్త అధ్యాయానికి ఫిన్టెక్ కంపెనీ ఫోన్పే తెరతీసింది. తాజాగా ఆండ్రాయిడ్ యాప్ స్టోర్ అయిన ఇండస్ యాప్స్టోర్ను ఢిల్లీ వేదికగా బుధవారం ఆవిష్కరించింది. 45 విభాగాల్లో 2 లక్షలకుపైగా యాప్స్, గేమ్స్ను ఈ యాప్స్టోర్లో పొందుపరిచింది. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సహా 12 భాషల్లో యూజర్లు తమకు కావాల్సిన యాప్స్ను సర్చ్ చేయవచ్చు. డెవలపర్లు 2025 ఏప్రిల్ 1 వరకు యాప్ లిస్టింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే డెవలపర్లు ఇన్–యాప్ బిల్లింగ్ కోసం తమకు నచ్చిన థర్డ్పార్టీ పేమెంట్ గేట్వేను ఎంచుకోవచ్చు. ఫోన్పే యాప్ లేదా ఇండస్ యాప్స్టోర్.కామ్ నుంచి ఇండస్ యాప్స్టోర్ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. 'మొబైల్ యాప్ మార్కెట్లో మరింత ఆరోగ్యకర పోటీకి ఈ యాప్స్టోర్ నాంది పలికింది. ఇది మరింత ప్రజాస్వామ్య, శక్తివంతమైన భారతీయ డిజిటల్ పర్యావరణ వ్యవస్థను రూపొందించడంలో సహాయపడుతుంది' అని ఫోన్పే సీఈవో, ఫౌండర్ సమీర్ నిగమ్ తెలిపారు.



అనధికారిక రుణ యాప్ల పని పట్టండి

ఆర్థిక నియంత్రణ సంస్థలకు మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



న్యూఢిల్లీ: అనధికారిక రుణాల యాప్లను కట్టడి చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఆర్థిక స్థిరత్వానికి పొంచి ఉన్న రిస్కులను గుర్తించేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్రియాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బుధవారం జరిగిన ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్డీసీ) 28వ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ మేరకు సూచనలు చేశారు. స్థూల ఆర్థిక స్థిరత్వం, సవాళ్లను ఎదుర్కొనడంలో భారత్ సన్నద్ధత, నియంత్రణ సంస్థల మధ్య సమస్యాత్మక అంశాలు మొదలైన వాటి గురించి ఈ సమావేశంలో చర్చించినట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. సమ్మిళిత వృద్ధి సాధనకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చేలా ఆర్థిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నియంత్రణ సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేయాలని ఎఫ్ఎస్డీసీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్, సెబీ చైర్పర్సన్ మాధవి పురి బుచ్, ఐఆర్డీఏఐ చైర్మన్ దేవాశీష్ పాండా, ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బైజూస్ రైట్స్ ఇష్యూ సక్సెస్



పూర్తిస్థాయిలో సబ్స్క్రిప్షన్

న్యూఢిల్లీ: ఎడ్యుటెక్ కంపెనీ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన 20 కోట్ల డాలర్ల విలువైన రైట్స్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ పూర్తిస్థాయిలో సబ్స్క్రిప్షన్ సాధించినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో బైజు రవీంద్రన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్త మిషన్లో వాటాదారులంతా పాలు పంచుకోవలసిందిగా కోరారు. బైజూస్ బ్రాండుతో కంపెనీ ఎడ్యుకేషన్ సంబంధ సేవలను అందించే సంగతి తెలిసిందే. ఇష్యూకి పూర్తిస్థాయిలో స్పందన లభించినందుకు రవీంద్రన్ కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే వాటాదారులంతా రైట్స్లో పాలుపంచుకుంటేనే విజయానికి ప్రామాణికత ఉంటుందని వ్యాఖ్యానించారు. అందరం కలసికట్టుగా సంస్థను నిర్మించినట్లు వాటాదారులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీంతో అందరూ కొత్త మిషన్లో భాగస్వాములుకావలసి ఉన్నదని సూచించారు. రైట్స్ నిధుల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు థర్డ్పార్టీ ఏజెన్సీని ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. రైట్స్కు ముందు, తదుపరి కంపెనీ యాజమాన్యంలో ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టం చేశారు.

హైదరాబాద్లో బ్లాక్బెర్రీ ఐవోటీ సెంటర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కెనడాకు చెందిన సాఫ్ట్వేర్ కంపెనీ బ్లాక్బెర్రీ లిమిటెడ్ కొత్తగా హైదరాబాద్లో ఐవోటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇంజనీరింగ్, ఇన్నోవేషన్ను (సీవోఈ) ప్రారంభించింది. ఇది కెనడా తర్వాత తమకు అతి పెద్ద సీవోఈ అని బ్లాక్బెర్రీ ఐవోటీ ప్రెసిడెంట్ మతియాస్ ఎరిక్సన్ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. బ్లాక్బెర్రీ క్యూఎన్ఎక్స్ గ్లోబల్ డెవలపర్ నెట్వర్క్కి ఇది ఆసియా పసిఫిక్ హబ్గా ఉంటుందని ఎరిక్సన్ వివరించారు. దీనికోసం పెద్ద యెత్తున నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్ కేంద్రంలో ప్రస్తుతం 60 మంది సిబ్బంది ఉన్నారు. ఏడాదిలో ఈ సంఖ్యను రెండింతలు చేయాలన్నది కంపెనీ ఆలోచన.

ఆఖర్లో అమ్మకాలు

- ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్
- 73 వేల దిగువకు సెన్సెక్స్
- ఇంట్రాడేలో నిఫ్టీ కొత్త రికార్డు
- ఐటీ, ఇంధన షేర్ల భారీ పతనం



ముంబై: ఆఖరి గంటలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీల ఆరు రోజుల వరుస ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. ట్రేడింగ్లో 22,249 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 142 పాయింట్లు పతనమై 22,055 వద్ద నిలిచింది. సెన్సెక్స్ 434 పాయింట్లు నష్టపోయి 73 వేల స్థాయి దిగువన 72,623 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లోని మిశ్రమ సంకేతాలు, గరిష్ఠ స్థాయిల ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు ట్రేడింగ్ చివర్లో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ఇంట్రాడేలో స్థిరంగా ముందుకు కదలాయి. ఒక దశలో సెన్సెక్స్ 211 పాయింట్లు బలపడి 73,268 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 52 పాయింట్లు పెరిగి ఆల్టైం హై స్థాయి(22,249 వద్ద)ని నమోదు చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, రియల్టీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లు విక్రయాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఆయిల్అండ్గ్యాస్, ఐటీ షేర్లు భారీ నష్టాలు చవిచూశాయి. యూఎస్ ఫెడ్ మినిట్స్ వెల్లడికి ముందు ఈక్విటీ మార్కెట్లు ఒడిదుడుకులకు గురికావచ్చనే ఆందోళనలతో మధ్య, చిన్న తరహా షేర్లు పతనాన్ని చవిచూశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.27%, 0.84% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.285 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.411 కోట్ల షేర్లు కొన్నారు. యూఎస్ టెక్ దిగ్గజం ఎన్విడియా త్రైమాసిక ఫలితాలు, ఫెడ్ రిజర్వ్ సమావేశ వివరాల వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప బలహీనతతో ట్రేడవుతున్నాయి.

- వరుసగా నాలుగో రోజూ పేటీఎం షేరు 5% ర్యాలీ చేసి రూ.395 వద్ద అప్పర్ సర్క్యూట్ను తాకింది. తన అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఫెమా నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఈడీ ఇప్పటి వరకు ఎలాంటి నిబంధనల అతిక్రమణలు గుర్తించలేకపోవడంతో పేటీఎం షేరుకు కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభిస్తోంది.
- జీ ఎంటర్టైన్మెంట్ 15% నష్టపోయి రూ.164.50 వద్ద ముగసింది. ఈ కంపెనీ ఖాతాల్లో అవకతవకలు జరిగినట్లు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ గుర్తించడంతో షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది.
- క్యూ3 లాభం 13% వృద్ధితో ఏబీబీ ఇండియా షేరు 10% పెరిగి రూ.4989 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ట్రేడింగ్లో 11% పెరిగి రూ.5019 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

వాణిజ్యం, పెట్టుబడులపై పారదర్శకంగానే..

- దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలపై భారత్ పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా వ్యవహరిస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ విషయమై దీర్ఘకాలంలో ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. భారత్తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ), పెట్టుబడులపై సంప్రదింపులు నిర్వహించే దేశాలు.. భారత్ అందించే భారీ మార్కెట్ అవకాశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ప్రపంచంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని గుర్తు చేశారు. సీఐఐ ఇండియా–యూరప్ సమావేశంలో భాగంగా మంత్రి మాట్లాడారు. యువ జనాభా అధికంగా కలిగిన భారత్లో వస్తు, సేవలకు ఉన్న డిమాండ్.. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలకు భారీ అవకాశాలను కల్పిస్తుందన్నారు. బ్రిటన్, ఒమన్, యూరోపియన్ యూనియన్తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై భారత్ సంప్రదింపులు నిర్వహిస్తున్న విషయం గమనార్హం. ఇదే సమావేశంలో పాల్గొన్న బ్రిటన్ మంత్రి లార్డ్ అహ్మద్ మాట్లాడుతూ.. బ్రిటిష్ కంపెనీలు భారత్లో పెద్ద పెట్టుబడిదారులుగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోందన్నారు.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్బీలో 9000 టెక్నీషియన్ పోస్టులు

రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు(ఆర్ఆర్బీ).. దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ రైల్వే రీజియన్లలో వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 9000.
» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్ గ్రేడ్1 సిగ్నల్–1100, టెక్నీషియన్ గ్రేడ్ 3–7900.
» **ఆర్ఆర్బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్కతా, మాల్డా, ముంబై, ముజఫర్పూర్, పాట్నా, ప్రయాగ్రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్పూర్.
» **వయసు:** 01.07.2024 నాటికి టెక్నీషియన్ గ్రేడ్1 సిగ్నల్ పోస్టులకు 18 నుంచి 36 ఏళ్లు, టెక్నీషియన్ గ్రేడ్–3 పోస్టులకు 18 నుంచి 33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** నెలకు టెక్నీషియన్ గ్రేడ్1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200, టెక్నీషియన్ గ్రేడ్3 పోస్టులకు రూ.19,900.
» **ఎంపిక విధానం:** ఫస్ట్ స్టేజ్ సీబీటీ–1, సెకండ్ స్టేజ్ సీబీటీ–2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.03.2024.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.04.2024.
» **వెబ్సైట్:** https://indianrailways.gov.in

ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎస్వోఈ/సీవోఈ)ల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎనిమిదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతితోపాటు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది.

గురుకుల పాఠశాలలు

» కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(పీజీటీ), మల్లి; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, విశాఖపట్నం; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, పార్వతీపురం(జోగింపేట); కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్, వినుకొండపేట; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, శ్రీకాళహస్తి; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, శ్రీశైలం డ్యామ్; కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్, తనకల్లు.
» **మొత్తం సీట్ల సంఖ్య:**780(ఇంటర్ ఎంపీసీ–300, ఇంటర్ బైపీసీ–300, ఎనిమిదో తరగతి–180).
» **అర్హత:** ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎనిమిదో తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రవేశ పరీక్షకు అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
» **పరీక్ష విధానం:** ఎనిమిదో తరగతికి ఏడో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు(10 మార్కులు), ఇంగ్లిష్(10 మార్కులు), హిందీ(10 మార్కులు), మ్యాథ్స్(20 మార్కులు), ఫిజికల్ సైన్స్(15 మార్కులు), బయో సైన్స్(15 మార్కులు), సోషల్ స్టడీస్(20 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్కు పదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్(20 మార్కులు),మ్యాథ్స్(40 మార్కులు), ఫిజికల్ సైన్స్(20 మార్కులు), బయో సైన్స్(20 మార్కులు) సబ్జెక్టు ప్రశ్నలు ఉంటాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2024.
» **హాల్ టిక్కెట్ డౌన్లోడ్ ప్రారంభతేది:** 30.03.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 07.04.2024.
» **వెబ్సైట్:** https://twreiscet.apcfss.in

జెడ్ఆర్వో చెన్నైలో సోల్జర్ టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ చెన్నైలోని జోన్ రిక్రూటింగ్ ఆఫీస్..అగ్నిపథ్ పథకం కింద 2024–25 సంవత్సరం నియామకాలకు సంబంధించి సోల్జర్ టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు తమిళనాడు,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,పుదుచ్చేరి(కరైకాల్,యానాం,పుదుచ్చేరి), అండమాన్ అండ్ నికోబార్,కేంద్ర పాలిత ప్రాంతాల జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు. ఇందులో అర్హత సాధించిన వారికి శారీరక సామర్థ్య,వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థుల వడపోత అనంతరం నాలుగేళ్ల కాలానికి అగ్నివీరులను ఎంపికచేస్తారు.

» **అర్హత:** 10+2/ఇంటర్మీడియట్ సైన్స్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బోటనీ, జువాలజీ, ఇంగ్లిష్)లో కనీసం 50% మార్కులు, ప్రతి సబ్జెక్టులో కనీసం 40% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:**17 1/2 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్లైన్ కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, రిక్రూట్మెంట్ ర్యాలీ(ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్, ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్), వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ రిజిస్ట్రేషన్కు చివరితేది:** 22.03.2024.
» **ఆన్లైన్ పరీక్షలు ప్రారంభం:** 22.04.2024.
» **వెబ్సైట్:** www.joinindianarmy.nic.in

గురుకులాల్లో.. ఉచితంగా ఇంటర్

» టీఎస్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు
» ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
» ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూప్లు

ఇంటర్మీడియెట్.. పదో తరగతి పూర్తి చేసుకున్న తర్వాత ఎక్కువ మంది విద్యార్థులు ఎంచుకునే కోర్సు! తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలలు.. ఉచిత విద్య, వసతి సదుపాయాలతోపాటు నీట్, జేఈఈ మెయిన్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణసైతం అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశాలకు ఏటా రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్ ఎంట్రన్స్ టెస్ట్ పేరుతో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. తాజాగా.. 2024-25 ప్రవేశాలకు సంబంధించి టీఎస్ఆర్జేసీ సెట్-2024కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ఆర్జేసీ సెట్-2024 వివరాలు, కళాశాలలు- సీట్లు, ప్రవేశ పరీక్ష విధానం తదితర వివరాలు..



తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో బోధన, ఇతర ప్రమాణాలు ఉన్నతంగా ఉండేలా పర్యవేక్షించేందుకు.. తెలంగాణ గురుకుల విద్యాలయాల విభాగం (తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ) పేరుతో ప్రత్యేక విభాగాన్ని.. విద్యా శాఖ పరిధిలో ప్రారంభించారు. రాష్ట్రంలోని గురుకుల కళాశాలల్లో ప్రవేశాలతోపాటు అన్ని అంశాలను ఈ సొసైటీనే పర్యవేక్షిస్తుంది.

35 కళాశాలలు-2,996 సీట్లు

ప్రస్తుతం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో 35 గురుకుల కళాశాలల్లో 2,996 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా 20 కళాశాలలు ఏర్పాటు చేశారు. 33 కళాశాలల్లో.. ప్రతి కళాశాలలో ఎంపీసీ గ్రూప్లో 40 సీట్లు, బైపీసీ గ్రూప్లో 40 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులందరికీ అవకాశం ఉండే సర్వేల్ గురుకుల కళాశాలలో ఎంపీసీలో 88, బైపీసీలో 60; ఎంఈసీలో 30 సీట్లు చొప్పున ఉన్నాయి. అదేవిధంగా హసన్పర్తిలోని మహిళలల గురుకుల కళాశాలలోనూ ఎంపీసీలో 88, బైపీసీలో 60, ఎంఈసీలో 30 సీట్లు ఉన్నాయి. మిగిలిన 33 గురుకుల కళాశాలలకు సంబంధించి ప్రతి కళాశాలలకు.. పోటీ పడేందుకు జిల్లా స్థానికతను నిర్దేశించారు. అన్ని కళాశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియంలోనే బోధన ఉంటుంది.

అర్హతలు

2024 మార్చిలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మాత్రమే అర్హులు. వార్షిక పరీక్షల్లో ఓసీ అభ్యర్థులు 6 జీపీఏతో, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు 5 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి. అన్ని కేటగిరీల విద్యార్థులు ఇంగ్లిష్ సబ్జెక్ట్లో తప్పకుండా 4 జీపీఏ సాధించాలి. పదో తరగతి వరకు తప్పనిసరిగా తెలంగాణలోనే చదివి ఉండాలి.

ఉమ్మడి కౌన్సెలింగ్

మొత్తం 35 కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి.. రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ఆర్జేసీ సెట్)ను నిర్వహించి..అందులో పొందిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించే క్రమంలో ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఒక్కో సీటుకు అయిదుగురిని చొప్పున కౌన్సెలింగ్కు పిలుస్తారు. ఎంపీసీ విద్యార్థులకైతే మ్యాథ్స్లో వచ్చిన మార్కులు, బైపీసీ విద్యార్థులకు బయాలజీలో వచ్చిన మార్కులు, ఎంఈసీ విద్యార్థులకు సోషల్ స్టడీస్లో వచ్చిన మార్కులను పరిగణలోకి తీసుకుని తుది జాబితా రూపొందించి ప్రవేశాలు ఖరారు చేస్తారు.

ఉచిత విద్య, వసతి

టీఎస్ఆర్జేసీ సెట్ ద్వారా ప్రవేశాలు ఖరారు చేసుకున్న విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా విద్యనందిస్తారు. ఎలాంటి ఫీజులు చెల్లించనక్కర్లేదు. అదే విధంగా వసతి సదుపాయం కూడా ఉచితంగానే ఉంటుంది. గురుకుల విద్యా విధానంలో బోధన సాగుతుంది. ఉదయం 5:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అకడమిక్, ఫిజికల్ యాక్టివిటీస్, స్పోర్ట్స్, గేమ్స్, ఇతర కో–కరిక్యులర్ యాక్టివిటీస్ను నిర్వహిస్తారు. ఫలితంగా విద్యార్థులు అకడమిక్ నైపుణ్యాలతోపాటు సామాజిక అవగాహన పొందే అవకాశం కూడా లభిస్తుంది.

150 మార్కులకు పరీక్ష

టీఎస్ఆర్జేసీ సెట్ను మూడు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న గ్రూప్ ఆధారంగా సంబంధిత విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంపీసీ గ్రూప్ విద్యార్థులకు ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అదేవిధంగా బైపీసీ గ్రూప్ విద్యార్థులకు ఇంగ్లిష్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంఈసీ గ్రూప్ విద్యార్థులకు ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి గ్రూప్నకు సంబంధించి ప్రతి విభాగం నుంచి 50 ప్రశ్నలు చొప్పున 150 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం రెండున్నర గంటలు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. ▪ దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న గ్రూప్ను ఎంచుకోవాలి.
- ఆన్లైన్ దరఖాస్తు చివరి తేదీ:2024, మార్చి 16
- టీఎస్ ఆర్జేసీ సెట్ తేదీ: 2024, ఏప్రిల్ 21 (10 గంటల నుంచి 12:30 వరకు)
- పూర్తి వివరాలకు వెబ్సైట్: https://tsrjdc.cgg.gov.in/TSRJDCWEB20/#!/home0103prsvdf.rps

మంచి మార్కులకు ఇలా

రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఆర్జేసీ సెట్లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు పదో తరగతి పాఠ్య పుస్తకాలను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి.

ఇంగ్లిష్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం.. యాంటానిమ్స్, సినానిమ్స్పై దృష్టి సారించాలి. వీటితోపాటు.. పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్పై అవగాహన పెంచుకోవాలి. చదవడంతో పాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు అవకాశం లభిస్తుంది. పంక్చుయేషన్స్, ప్రిపొజిషన్స్, ఆర్టికల్స్పై దృష్టి పెట్టాలి. అదే విధంగా.. రీడింగ్ కాంప్రహెన్షన్ పెంచుకునేలా ప్రిపరేషన్ సాగించాలి.

మ్యాథమెటిక్స్

ప్రతి చాప్టర్ను చదివి వాటికి సంబంధించిన ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, రేఖా గణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించడం ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. టెక్స్ట్ బుక్లో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలపై పట్టు సాధించాలి.

ఫిజికల్ సైన్స్

ఈ సబ్జెక్ట్కు సంబంధించి.. ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు- ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా దృష్టిపెట్టాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై ఎక్కువ శ్రద్ధతో చదవాలి. అదే విధంగా.. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

బయలాజికల్ సైన్స్

ఈ సబ్జెక్ట్లో మార్కుల కోసం ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి. డయాగ్రమ్స్ను ప్రాక్టీస్ చేసి.. భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా పదో తరగతి చాప్టర్స్లోని ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి.

సోషల్ స్టడీస్

సోషల్ స్టడీస్కు సంబంధించి సబ్జెక్ట్ అంశాలతో పాటు సమకాలీన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. జాగ్రఫీ,ఎకనామిక్స్లో భారతదేశం–భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత,ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధం సమయంలో ప్రపంచం;సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రపై ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగాల నుంచి స్వీకరించారు వంటి కోణాల్లో చదవాలి.

క్లుప్తంగా...

నేటి నుంచి వృద్ధుల సమస్యలపై జాతీయ సదస్సు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): శేష జీవితంలో హాయిగా గడపాల్సిన వృద్ధులు.. వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. కేంద్ర న్యాయ సాధికార మంత్రిత్వ శాఖ(ఎన్ఐఎస్‌డి), హెరిటేజ్ ఫౌండేషన్ రీజనల్ రిసోర్స్ ట్రైనింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో డాబా గార్డెన్స్ ప్రేమ సమాజం వేదికగా రెండు రోజుల పాటు సదస్సు జరుగనుంది. సదస్సులో హెరిటేజ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ కె.ఆర్.గంగాధరన్, స్నేహ సంధ్యా ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఎస్ రాజు, న్యూరో సర్జన్ డాక్టర్ భావరాజు సుబ్బారావు, డాక్టర్ సూర్యతేజ, డాక్టర్ జి.శ్రావణి, డాక్టర్ ఎం.శ్రీనివాసశాస్త్రి, డాక్టర్ జి.శోభాపెరిస్‌దేవి, ఎంకే రైనాతో పాటు ఎన్జీవోస్, సీనియర్ సిటిజన్స్, పీజీ విద్యార్థులు పాల్గొని వృద్ధాప్యంలో వృద్ధులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై చర్చించనున్నారు.

ఆధునిక జీవనశైలితో జీర్ణకోశ సమస్యలు

ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి మనుషులపై తీవ్ర ప్రభావం చూపుతోందని, నేడు చాలామంది జీర్ణకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. హెపటైటిస్ వ్యాధులు, కొన్ని క్యాన్సర్లు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. 30 శాతం జనాభా జీర్ణకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడించారు.అందుకు ఆధునిక ఆహారపు అలవాట్లు, జెనెటిక్ కారణాలు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. పోస్ట్ కోవిడ్ వల్ల గ్యాస్, లివర్, ఎసిడిటీ, ప్యాంక్రియాటీస్ సమస్యలు వస్తున్నాయన్నారు. చిన్నపిల్లల్లో కూడా గ్యాస్ సంబంధిత సమస్యలు వస్తున్నాయని, ఫ్యాటీలివర్ వల్ల 40 శాతం పిల్లల్లో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నదన్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్స్ ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: గతేడాది ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్స్ (ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్) పోస్టుల తుది ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కార్యదర్శి ప్రదీప్ కుమార్ బుధవారం పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు సీబీఐ నోటీసులు

తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. విచారణ నిమిత్తం ఈ నెల 26న ఢిల్లీలోని కార్యాలయానికి రావాలని సూచించింది. ఈ మేరకు బుధవారం రాత్రి సీబీఐ నుంచి కవిత సమన్లు అందుకున్నారు. సీబీఐ గతంలో ఇదే కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్న విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా పలుమార్లు కవితను ప్రశ్నించింది. చివరగా గత ఏడాది జనవరి 16న విచారణకు రావాల్సిందిగా కవితకు ఈడీ నోటీసులు జారీచేసింది.

25నే గ్రూప్-2 ప్రిలిమ్స్

ఇప్పటిదాకా 4.30 లక్షల మంది హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

- రాష్ట్రవ్యాప్తంగా 1,327 సెంటర్ల ఏర్పాటు
- ఒకే రోజు జరిగే గ్రూప్-2, ఎస్‌బీఐ పరీక్షలకు దరఖాస్తు చేసింది 550 మందే
- 550 మందికి మార్చి 4వ తేదీ పరీక్ష నిర్వహించనున్న ఎస్‌బీఐ
- ఏపీపీఎస్సీ విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయించాలనుకున్న ఎల్లో బ్యాచ్‌కు ఎదురుదెబ్బ



సాక్షి, అమరావతి: ఒకే రోజు గ్రూప్-2 ప్రిలిమ్స్, ఎస్‌బీఐ పరీక్షలు ఉన్నాయని.. ఈ రెండింటికి దరఖాస్తు చేసినవారు ఉన్నారని.. ఈ నేపథ్యంలో గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయించాలని కుయుక్తులు పన్నిన ఎల్లో బ్యాచ్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రూప్-2 పరీక్ష జరిగే ఈ నెల 25న ఎస్‌బీఐ పరీక్ష కూడా రాస్తున్నవారు కేవలం 550 మందే ఉన్నారని తేలింది. ఈ 550 మందికి మార్చి 4న పరీక్ష నిర్వహిస్తామని ఎస్‌బీఐ తెలిపింది. దీంతో యథావిధిగా ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. గ్రూప్- 2 పరీక్షను ఈ నెల 25న నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష కోసం 1,327 సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు 4.30 లక్షల మంది హాల్‌టికెట్లను కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు.

4.83 లక్షల మంది శ్రమను వృథా చేయాలని..

దాదాపు 4.83 లక్షల మంది గ్రూప్-2 అభ్యర్థుల శ్రమను వృథా చేయాలని ఎల్లో బ్యాచ్ కుట్ర పన్నింది. గ్రూప్-2 ప్రిలిమ్స్ రోజే ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ పరీక్ష కూడా ఉందని.. ఇలాంటి వారు 10 వేల మంది ఉన్నారని చెప్పుకొచ్చారు. వీరికి నష్టం కలగకుండా గ్రూప్-2 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. కానీ లక్షల మంది గ్రూప్స్ అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఏపీపీఎస్సీ.. ఎస్‌బీఐ బ్యాంకు ఉన్నతాధికారులను సంప్రదించింది. ఈ నెల 25న పరీక్ష స్లాట్ కేటాయించిన ఎస్‌బీఐ అభ్యర్థులకు మరోరోజు అవకాశం ఇవ్వాలని విన్నవించింది. దీంతో ఎస్‌బీఐ అధికారులు గ్రూప్-2, ఎస్‌బీఐ రెండు పరీక్షలు రాసే అభ్యర్థుల వివరాలను తమకు పంపించాలని ఏపీపీఎస్సీని కోరారు. దీంతో ఏపీపీఎస్సీ ఈనెల 19 వరకు రెండు పరీక్షలు రాసే అభ్యర్థుల వివరాలను సేకరించగా మొత్తం 550 మంది ఉన్నట్టు తేలింది. దీంతో వీరికి మార్చి 4న పరీక్ష నిర్వహిస్తామని ఎస్‌బీఐ తెలిపింది. ఈ అభ్యర్థులు 23వ తేదీ ఉదయం 9 గంటల్లోగా https://ibpsonline.ibps.in/sbijaoct23/లో పరీక్ష తేదీ మార్పుకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో ఏదో ఒక సాకుతో గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయించాలనుకున్న ఎల్లో బ్యాచ్ ఎత్తుగడ బెడిసికొట్టింది.

వాయిదాలు లేకుండా 31 నోటిఫికేషన్లు పూర్తి

గత టీడీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ నుంచి ఇచ్చిన నోటిఫికేషన్లు అరకొరే. వాటి పరీక్షలు కూడా ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి ఉండేది. ఏళ్ల తరబడి అభ్యర్థుల భావోద్వేగాలతో టీడీపీ ప్రభుత్వం ఆడుకుంది. ఒకే రోజు రెండు పరీక్షలు వచ్చినప్పుడు సమస్యను అధిగమించడంపై దృష్టి పెట్టకుండా 'వాయిదా' నిర్ణయం తీసుకునేవారు. దీంతో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమయ్యే ఎంతోమంది నష్టపోయేవారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2019 జూన్ నుంచి 2023 మధ్య ఏపీపీఎస్సీ 31 నోటిఫికేషన్లను నేరుగా జారీ చేసింది. నోటిఫికేషన్ ఇచ్చే ముందే వివాదాలు, ఇతర పరీక్షల షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకుంది. ఈ నాలుగేళ్లల్లో ఒక్క కోర్టు వివాదం లేకుండా, ఒక్క నిరుద్యోగికీ అన్యాయం జరగకుండా దాదాపు 6,300 పోస్టులను భర్తీ చేసింది. అంతేకాకుండా గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ పరీక్షలను సైతం ఏపీపీఎస్సీనే విజయవంతంగా నిర్వహించింది. తద్వారా ఒకేసారి 1.34 లక్షల మందికి మేలు చేసింది. గతేడాది డిసెంబర్‌లో గ్రూప్-1, గ్రూప్-2, పాలిటెక్నిక్ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్స్‌తో పాటు 11 నోటిఫికేషన్లు జారీ చేసి, పరీక్షల షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. మరో వారం రోజుల్లో ఇంకో 5 నోటిఫికేషన్లు జారీ చేయనుంది.

పురపాలక సంస్థల్లో విద్యుత్ పొదుపు

- మున్సిపల్ సెక్టార్‌లో ఇంధన సామర్థ్య చర్యలను ప్రోత్సహించడమే లక్ష్యం
- ఎనర్జీ ఆడిట్ ద్వారా 25 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదాకు అవకాశం
- విజయవాడలో మున్సిపల్ పంప్ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఈసీఎం అధికారులు

సాక్షి, అమరావతి: పురపాలక సంస్థల్లో ఇంధన పొదుపు, సామర్థ్యంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఇంధన శాఖ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) శిక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. మునిసిపల్ సెక్టార్‌లో తాగునీటి సరఫరా వ్యవస్థ, మురుగునీటి సరఫరా వ్యవస్థ, వీధి దీపాలు, భవనాల్లో విద్యుత్ ఆదాకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఏపీఎస్ఈసీఎం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో ఏపీఎస్ఈసీఎం ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనికి నాలెడ్జ్ పార్టనర్‌గా సిరి ఎక్సర్జి-కార్బన్ అడ్వైజరీ సర్వీసెస్ అనే సంస్థను నియమించింది. ఇంధన సామర్థ్య చర్యలు, మోటార్, పంపులు, పైపులు, స్టార్టర్‌లు, ఎలక్ట్రికల్ ప్యానెల్‌ల నిర్వహణలో ప్రామాణిక పద్ధతుల గురించి పంప్ ఆపరేటర్‌లకు అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. విద్యుత్ వినియోగంలో పొదుపు సాధించడం ద్వారా మునిసిపల్ శాఖకు విద్యుత్ బిల్లులు ఆదా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా ఏపీఎస్ఈసీఎం వెల్లడించింది. అవగాహన కార్యక్రమాలతో పాటు 15 మునిసిపల్ కార్పొరేషన్లలో ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్‌ను నిర్వహించి, వారి విద్యుత్ బిల్లులను, విద్యుత్ డిమాండ్‌ను తగ్గించడంలో ప్రయోజనం చేకూర్చే ఇంధన పొదుపు అవకాశాలు కనుగొన్నట్లు వెల్లడించింది. ఎనర్జీ ఆడిట్ ప్రకారం, 239 పంపు సెట్ల స్థానంలో ఇంధన సామర్థ్య పంపుసెట్లను అమర్చితే 25 మిలియన్ యూనిట్ల ఇంధన ఆదాతో పాటు ఏటా దాదాపు రూ.20 కోట్లు ఆదా చేయవచ్చని అంచనా వేసినట్లు ఏపీఎస్ఈసీఎం అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని దాదాపు 50 మంది పంప్ ఆపరేటర్లకు మున్సిపల్ డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్ (ఎండిఎస్ఎం) కార్యక్రమం కింద ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేసింది. ఇలా ఇప్పటివరకు రాష్ట్రంలోని 16 మున్సిపల్ కార్పొరేషన్ల సిబ్బందికి శిక్షణను నిర్వహించినట్లు ఏపీఎస్ఈసీఎం వెల్లడించింది.

ఏపీలో ఎంఎస్ఎంఈల పనితీరు భేష్

ప్రశంసించిన కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర లాల్ దాస్

సాక్షి, అమరావతి: అత్యధికమందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుండటంపై కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర లాల్ దాస్ రాష్ట్ర పర్యటనలో భాగంగా గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మయోజన్, నైపుణ్య శిక్షణా కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన పనితీరు కనబరుస్తోందన్నారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ పురోగతికి కేంద్రం పూర్తి సహకారాన్ని అందిస్తుందని, కేంద్ర రాష్ట్ర సమన్వయం కోసం తిరుపతి, విజయవాడల్లో మరో రెండు ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు సుభాష్ చంద్ర తెలిపారు. మరో ఆరు ఎంఎస్ఎంఈ విస్తరణ కేంద్రాలతో పాటు కొత్తగా కొప్పర్తిలో ఏర్పాటు చేస్తున్న సాంకేతిక కేంద్రానికి సంబంధించిన పనులు వేగవంతం చేయడానికి అంగీకరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.



రైఫిల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



మట్టి పాత్రలు, బొమ్మలు చేస్తున్న దృశ్యాలను చూస్తున్న విదేశీ మహిళా అధికారులు

నేడు మిలాన్‌లో మెరుపులు

- ప్రతిష్టాత్మక సిటీ పరేడ్‌తో సందడిగా మారనున్న ఆర్కే బీచ్
- తొలిసారి విశాఖ జలాల్లోకి చేరుకున్న బాహుబలి యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్
- విశాఖలోనే మరో విమాన వాహక యుద్ధనౌక విక్రమాదిత్య
- హాజరుకానున్న ఉపరాష్ట్రపతి ధన్‌కడ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, న్యూఢిల్లీ: భారత నౌకాదళం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్-2024 విన్యాసాల్లో భాగంగా గురువారం సిటీ పరేడ్ నిర్వహించనున్నారు. ఆర్కే బీచ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఈ విన్యాసాల్లో పాల్గొనేందుకు భారత నౌకాదళం తయారు చేసిన తొలి విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ తొలిసారిగా విశాఖ చేరుకుంది. ఏడాది క్రితం ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితమిచ్చిన తర్వాత తూర్పు నౌకాదళం కేంద్రంగా విక్రాంత్ విధులు నిర్వర్తిస్తుందని ప్రకటించారు. ఆ తర్వాత వివిధ కార్యకలాపాల్లో పాలుపంచుకున్న విక్రాంత్ ప్రస్తుతం తొలిసారిగా విశాఖకు చేరుకుంది. వాస్తవానికి విక్రాంత్‌ని బెర్తింగ్ చేసేందుకు అవసరమైన బెర్త్ ఇక్కడ లేదు. విక్రాంత్‌కు అనుగుణమైన భారీ బెర్త్ నిర్మించేందుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)తో నౌకాదళం ఒప్పందం కుదుర్చుకుంది. అయితే విశాఖ వేదికగా మిలాన్-2024 విన్యాసాలు జరుగుతున్న నేపథ్యంలో విశాఖకు వచ్చిన విక్రాంత్‌ను విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో బెర్తింగ్ చేశారు. మరోవైపు.. పశ్చిమ నౌకాదళంలో విధులు నిర్వర్తిస్తున్న మరో విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య రెండు రోజుల క్రితం విశాఖ చేరుకుంది. ఈ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ని గంగవరం అదానీ పోర్టులో లంగరు వేశారు. 22న జరిగే సిటీ పరేడ్, 23 నుంచి 27వ తేదీ వరకూ జరిగే మిలాన్ సీ ఫేజ్ విన్యాసాల్లో ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మిలాన్‌లో పాల్గొన్న దేశాల జాతీయ జెండాలతో ఆ దేశ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పరేడ్ సాగనుంది. యుద్ధ నౌకలు, విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలతో ఆర్కే బీచ్‌లో యుద్ధ వాతావరణాన్ని నౌకాదళ సిబ్బంది ప్రజలకు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించనున్నారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, నౌకాదళ అధికారులు పాల్గొననున్నారు.

ఇది యుద్ధ యుగం కాదు.. దౌత్య యుగం

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్టాత్మకంగా సాగుతున్న మిలాన్-2024 విన్యాసాల్లో భాగంగా.. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలోని సాముద్రిక ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కీలకమైన మిలాన్ విలేజ్‌ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ బుధవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మిలాన్‌లో పాల్గొన్న 58 దేశాల ప్రతినిధులతో రాజ్‌నాథ్‌సింగ్ ఆత్మీయ కరచాలనం చేశారు. అనంతరం మిలాన్ విలేజ్‌ని సందర్శించారు. ప్రారంభోత్సవ సభలో రక్షణ మంత్రి మాట్లాడుతూ సాయుధ బలగాలు యుద్ధం చేయడంతో పాటు శాంతిభద్రతలు కాపాడటం అనే ద్వంద్వ పాత్రలు పోషిస్తాయని అన్నారు. సముద్ర జలాల్లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి భద్రత కల్పించడమే కాకుండా పైరసీ, ట్రాఫికింగ్‌ని అణిచివేసేందుకు భారత్ నిరంతరం శ్రమిస్తోందని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతిని చెడగొట్టేందుకు ఏ దేశం ప్రయత్నించినా సహించేది లేదని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. దేశంతో సంబంధం లేకుండా ఏ దేశానికి సంబంధించిన షిప్ ఆపదలో ఉన్నా రక్షించేందుకు భారత్ ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఇది యుద్ధాలు చేసే యుగం కాదనీ, అన్ని దేశాలు కలిసివెళ్లే దౌత్య యుగం అన్నది ప్రధాని మోదీ నినాదమని తెలిపారు. నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ మాట్లాడుతూ 24న విశాఖ సాగర జలాల్లో జరిగే మిలాన్ విన్యాసాల్లో 60కి పైగా హెలికాప్టర్లు, అత్యాధునిక యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు పాల్గొంటున్నాయని తెలిపారు.

వైద్య విద్యలో 'ఏఐ'!

- ప్రాథమిక కసరత్తు చేసి నివేదిక ఇవ్వండి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వైద్య విద్యలో కృత్రిమ మేధస్సు(ఏఐ)ను ప్రవేశపెట్టేందుకు అవసరమైన ప్రాథమిక కసరత్తు చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. వైద్య విద్యలో ఏఐ సాంకేతికతను ప్రవేశపెడితే ఎలా ఉంటుందని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. దీనిపై వైద్య శాఖ అధికారులు ప్రాథమిక కసరత్తు చేసి ఒక నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ విధానం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేయాలని సూచించారు. అనేక శస్త్రచికిత్సలకు ఏఐ ఎంతో ఉపయోగపడుతుందని.. ఇప్పటికే దేశంలోని ప్రముఖ వైద్య సంస్థల్లో ఏఐ విధానాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. కాగా, ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) ద్వారా మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు తీసుకున్న చర్యలను ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తెలియజేయాలని సీఎస్ ఆదేశించారు. దీర్ఘకాలిక రోగులకు మందుల పంపిణీ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌమార బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు డేటా బేస్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు మరింత వేగంగా వైద్య సేవలందించాలని స్పష్టం చేశారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ మరో ఏడాది పొడిగింపు

వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ.. మార్చి నెలాఖరుతో ముగియనున్న ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకం గడువును మరో ఏడాది పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఉద్యోగ సంఘాల వినతి మేరకు ఈహెచ్ఎస్ లబ్ధిదారులకు డిస్పెన్సరీ విధానం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈహెచ్ఎస్‌లో అన్ కవర్డ్ ప్రొసీజర్లకు సీలింగ్ లిమిట్ పెంచాలన్న దానిపైనా చర్యలు చేపట్టామన్నారు. కొత్త ఈహెచ్ఎస్ కార్డుల జారీ, ప్యాకేజీల సవరణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా, మొత్తం 1,43,60,620 ఆరోగ్య శ్రీ కార్డులకు గాను 1,13,48,378 కార్డులు వచ్చాయని చెప్పారు. వాటిలో ఇప్పటికే 79.78 లక్షల కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉన్నతాధికారులు జె.నివాస్, మురళీధర్ రెడ్డి, డా.ఎస్.వెంకటేశ్వర్, డా.నర్సింహం, బాలాజీ, ఎన్.గుల్జార్ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.